ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి



# గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! — సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సిహెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 22 - సంచిక 7
డిసెంబర్ 2017

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
040-39560330
77994 44248
9949 411181


## ఆధ్యాత్మిక చికిత్స

బోధ, నిదానం, విజ్ఞానములతో కూడిన సంపూర్ణ చికిత్స ఆధ్యాత్మిక చికిత్స. జీవితం యొక్క దృశ్యము, అదృశ్యము అయిన వ్యవస్థ గురించిన సమగ్రమైన పరిజ్ఞానం ఈ చికిత్సలో ఉంది. దైహిక, దైవిక, ఆధ్యాత్మిక రోగాల నిదానానికి సూక్ష్మప్రక్రియల పరిపూర్ణ జ్ఞానం ఇందులో ఉంది. అన్ని రోగాల చికిత్సలకూ కార్యపద్ధతి ఇందులో ఉంది. మానవ జీవనానికి సంపూర్ణ చికిత్స అనే ఋషి సంకల్పానికి ప్రతిబింబం ఈ కార్యపద్ధతి.

ఋగ్వేదం దశమ మండలంలోని రోగనివారణ సూక్తం. అయిదవ మంత్రంలో ఋషి అంతఃచేతనలో మారుమ్రోగిన మహాసంకల్పం ఇదే. నవయుగం కోసం కొత్త సృష్టి చేసిన బ్రహ్మర్షి విశ్వామిత్రుడు ఆ క్షణాలలో చింతనలో నిమగ్నులై ఉన్నారు. అప్పుడు ఆర్తితో నిండిన, కరుణ కలిగించే ఒక స్వరం వినిపించింది. దుఃఖంలో మునిగి ఉన్న ఒక స్త్రీ చేసిన ఆర్తనాదం అది. ఆయన శిష్యుడు జాబాలి ఆమెను తీసుకువస్తున్నాడు. రోగాలు యవ్వనంలోనే ఆమెను వృద్ధురాలిగా చేశాయి.

ఆమె సమీపించగానే, బ్రహ్మజ్ఞాని అయిన మహర్షి ఆమె బాధలకు మూల కారణాన్ని గ్రహించారు. ఆయన జాబాలితో ఇలా అన్నారు – "నాయనా! చికిత్స ప్రక్రియలూ, ఔషధాలూ ఈమెమీద పనిచేయలేదని చెప్పాలనుకుంటున్నావు కదా" – "అవును ఆచార్యవర్యా" – అంటూ శిష్యుడు ఏదో చెప్పబోయేలోగా ఋషి ఇలా అన్నారు – "నాయనా! ఇంకా ఒక చికిత్సా విధానం మిగిలి ఉంది. అది ఆధ్యాత్మిక చికిత్స. నేను నీ ఎదుట ఆ చికిత్స చేస్తాను." తన గురువుగారికి అనంతమైన ఆధ్యాత్మిక శక్తులు ఉన్నాయని శిష్యుడు జాబాలికి తెలుసు. కనుక అతడు మౌనం వహించాడు. అయినా అతడిలో జిజ్ఞాస ఉంది. ఆ జిజ్ఞాసను తృప్తిపరుస్తూ అంతర్యామి అయిన బ్రహ్మర్షి ఇలా అన్నారు – "నాయనా జాబాలి! చికిత్స సఫలం కావాలంటే జీవితాన్ని సమగ్రంగా అవగాహన చేసుకోవడం అవసరం. మనిషి శరీరం మాత్రమే కాదు. ఇంద్రియాలు, ప్రాణం, మనస్సు, చిత్తం, బుద్ధి, అహం, అంతరాత్మల అదృశ్యశక్తులు కూడా మనిషిలో ఉన్నాయి. చికిత్స చేయడానికై ఆ శక్తులన్నింటి పరిజ్ఞానం అవసరం అవుతుంది."

ఇలా చెపుతూ మహర్షి ఆ రోగిని తనముందు కూర్చోబెట్టారు. తన మహాతపస్సులోని ఒక అంశను దానం ఇవ్వాలని సంకల్పం చేస్తూ ఇలా చెప్పారు – "ఆ త్యాగమం శంతాతిభిరథో అరిష్టతాతతిభిః॥" అనగా – శాంతిని వ్యాపింపజేసేవి, నాశనం లేనివి అయిన సాధనాలతో నీవద్దకు వచ్చాను. నీలో ప్రచండమైన బలాన్ని నింపుతున్నాను. నీ రోగాన్ని పారద్రోలు తున్నాను. మహర్షి ఈ సంకల్పం చేయగానే, ఆ స్త్రీ రోగం నయమయింది. ఆమెకు ఆరోగ్యం చేకూరింది. ఈ సంఘటనతో ఆధ్యాత్మిక చికిత్స సంప్రదాయం ప్రారంభమయింది.

# విషయసూచిక


1. సంపాదకీయం: ఆధ్యాత్మిక చికిత్స 3
2. విషయసూచిక & సద్గురు వచనామృతం 4
3. పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-66: శాంతి సైన్యం 5
4. మాతా భగవతీదేవిశర్మ దివ్యచరిత్ర-9: యదార్థ సాధనాస్వాధ్వీ 10
5. జీవనమార్గం ఏవిధంగా ఉండాలి? 13
6. పిల్లలను ఆరోగ్యవంతంగా ఎలా ఉంచాలి? 16
7. అనుభూతినుండి వచ్చినదే జ్ఞానము 19
8. మనం సదాలోచనలకు కేంద్రం కావాలి 21
9. బోధకథ: నిష్కామకర్మ యొక్క శక్తి 23
10. శిష్య సంజీవని-8: సద్గురువు చేతనత్వంతో ఏకాకారము 26
11. కలల యొక్క సత్యమును గురించిన రహస్యము ఏమిటి? 28
12. మనం మన ఆరోగ్యం: పవిత్ర వృక్షం - చందన వృక్షం 31
13. పద్యం నేపథ్యం 34
14. పూజ్య గురుదేవుల అమృతవాణి: కుటుంబమే సమాజ నిర్మాణానికి ప్రయోగశాల 36
15. నా వారితో నా మాట: యుగ సృజేత - జనవరి 2018 నాగపూర్‌లో జరుగనున్న యువక్రాంతి ముగింపు ఉత్సవాలు 41
16. ఆరోగ్య సూత్రాలు-4: హోమియోపతి వైద్య విధానం 44
17. వార్తలు: ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 47




# సద్గురు వచనామృతం

## మీ పట్ల మీరు పాపం చేయకండి

మీరు భగవంతుని ప్రతినిధి. మీరు సర్వశ్రేష్ఠమైన శక్తి పుంజం. మరి అలాంటపుడు మిమ్మల్ని దీనులుగా, హీనులుగా, దురదృష్టవంతులుగా, పరిగణించుకోవటానికి మీకేమి అధికారమున్నది? భగవంతుణ్ణి మీరు అవమానించలేరు. ఈశ్వరత్వం ప్రపంచం యొక్క మౌలికమైన క్రియాత్మక శక్తి. అది ప్రపంచంలో అన్నింటికంటే శ్రేష్ఠమైనది. సత్యం, శివం, సుందరాలకు శిఖరాగ్రమైనది ఈశ్వరత్వం. అది మీ రక్త మాంసాలలో ప్రవహిస్తున్నది.

మీరు మీ పట్ల సద్వ్యవహారం జరపండి. మీరు ఇతరుల మేలు కోరుతారు. మీ కుమారుని విద్య, ఆరోగ్యం కోసం, కీర్తి కోసం, హితం కోసం మీరు నానా యాతనలూపడతారు. భార్య, పిల్లలు, బంధువుల ప్రయోజనాలను గురించి నిరంతరం ఆలోచిస్తూ ఉంటారు. ఇతరుల శ్రేయస్సును కోరటం మంచిదే. దానికంటే ఉత్కృష్ట మార్గం హితాన్ని గురించి ఆలోచించడం. ఇతరులకు చెడుచేయటం పాపమని మీరంటారు. ఈ దుశ్చర్యని మీరు అసహ్యించుకుంటారు. మంచిదే. కాని మీరు మీ విషయంలో నిందనీయమైన ఆలోచన చేయడం మరింత ఘోరమైన పాపం. ఇతరులపట్ల చేసిన పాపాన్ని ప్రపంచం చూస్తుంది. కానీ మీరు మీ పట్ల చేసిన పాపం కంటికి కనపడదు. అంతరాత్మ అంతర్ దృష్టితో దాన్ని చూస్తుంది. అది అప్పుడప్పుడు మిమ్మల్ని చీవాట్లు పెడుతుంది కాని, దాని ఆదేశాలను ఉపేక్షిస్తే అది క్షీణించి పోతుంది.

*(అఖండజ్యోతి, జనవరి, 1952, 8వపుట)*

*అనువాదం-ఊటుకూరు సత్యనారాయణ గుప్త*

**కర్మభారం తీరనంతవరకు మనిషికి ముక్తి లేదు**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-66

# శాంతి సైన్యం



దేశవిభజన కోసం జరిగిన ప్రకటన తరువాత మథురలో కూడా ప్రదర్శనలు జరిగాయి. బెంగాల్, బీహార్ మరియు పంజాబ్‌లో ఊచ కోతలు జరిగాయి. ఆ వార్తలు వ్యాపించిన కొద్దీ ప్రశాంతంగా ఉన్న నగరాల్లో కూడా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విభజన కావాలి అంటూ చేపట్టిన ప్రదర్శనలు, నిర్వహించబడ్డ సభలు మథురను కూడా ప్రభావితం చేశాయి. ఆ సంవత్సర కాలంలో రెండు సముదాయాల వారు, కనీసం పదిహేనుసార్లు గొడవలు పడ్డారు. మథురలో స్వాతంత్ర్య ఉద్యమ సైనికులందరూ కలిసి శాంతి సైన్యాన్ని ఏర్పాటు చేశారు. వారందరూ కలిసి ఉదయాన్నే నగర సంకీర్తన చేసేవారు. గాంధీగారి ఆశ్రమంలో పాడే 'రఘుపతి రాఘవ రాజారామ్' ప్రార్థనా గేయాన్ని మథుర సందుల్లో మారు మోగేట్టు చేసిన ఘనత వారిదే. శ్రీరాం కూడా నగర సంకీర్తనల్లో పాల్గొనేవారు. అఖండజ్యోతి పాఠకులు కూడా శాంతి ప్రదర్శనలలో పాల్గొనేటట్టు శ్రీరాం ప్రేరణనిచ్చేవారు.

1947 జూన్ నెలలో విభజన చేయాలని, ఆగస్టు 15న స్వాతంత్ర్యం ఇవ్వాలని చివరకు నిర్ణయించారు. పంపకాలు జరిగిన ప్రదేశాల్లో అక్కడి అల్పసంఖ్యాకుల వారు హింసకు గురైయ్యారు. పశ్చిమ పంజాబ్, సింధ్, తూర్పు బెంగాల్‌లలో హింస పెల్లుబికింది. అక్కడి అల్పసంఖ్యాకులు మాతృ భూమిని వదిలేసి వెళ్ళడం మొదలుపెట్టారు. పశ్చిమ పంజాబ్, సింధ్ ప్రదేశాల్లోకి హిందువులు, తూర్పు బెంగాల్ లోకి ముస్లీములు పారిపోవడం మొదలుపెట్టారు. పారిపోతున్నవారి మీద అక్కడి ఉపద్రవ శక్తులు పంజా విసిరాయి. ఈ అల్లర్ల సమాచారం దేశంలోని మిగిలిన చోట్లకి పాకడంతో అక్కడి వారు కూడా ఇల్లు వాకిళ్ళు వదిలేసి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నారు. మథురలో కూడా కొనిన ముస్లీము కుటుంబాలు రాత్రికి రాత్రి ఆస్తులు అమ్మేసుకుని పాకిస్తాన్ వెళ్ళిపోవాలని నిర్ణయించు కున్నాయి. పాకిస్తాన్ ఇస్లాం దేశం కావడం వల్ల అక్కడ వారి కలలు నెరవేరుతాయి అన్న ఆశతో వారు అలా నిర్ణయించు కున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే శ్రీరాం, తమ ధార్మిక సంఘం సభ్యులం దరితో కలిసి వెంటనే రంగంలోకి దిగారు. ఆ కుటుంబాలను కలిసి, ఇక్కడే ఉండమని రకరకాలుగా నచ్చచెప్పారు. ఇరవైలో పద్నాలుగు కుటుంబాలు మనసు మార్చుకున్నాయి.

ఈ గొడవలు జరుగుతున్నప్పుడే మథురలోని కొన్ని ధార్మిక క్షేత్రాలలో కూడా ఉద్రిక్తత చోటు చేసుకుంది. అక్కడ శాంతి స్థాపించాల్సిన బాధ్యత పోలీసులదే. కాని పోలీసు బలగాలు సరిపోవడం లేదు. ఆగ్రా, భరత్‌పుర్ కూడా అట్టుడకసాగాయి. ఆ నగరాల్లో కూడా ప్రజలకు నచ్చ చెప్పడానికి, వారిలో సౌభ్రా తృత్వ భావన మేల్కొల్పడానికి, శాంతి సేన ఏర్పాటయింది. శ్రీరాంని రమ్మని పిలిచారు, కొన్ని చోట్లకు వెళ్ళారు కాని మథురలోనే ఉండడం సబబుగా తోచింది. ఆయన అవసరం అక్కడే ఎక్కువ.

చౌక్, కేశవ్‌దేవ్ మొదలైన ధార్మిక ప్రాంతాల్లో ఉపద్రవాలు లేవదీయాలని కొందరు యోచిస్తున్నారని తెలియవచ్చింది. వారి ఆక్రమణలకు అడ్డుపెట్టాలని శ్రీరాం తమ సహచరులను తీసుకుని కేశవ్‌దేవ్‌కి వెళ్ళారు. పోలీసులు వారిని మోర్చా దగ్గరకు వెళ్ళనివ్వలేదు. అక్కడుండే అల్పసంఖ్యాకుల కుటుంబాలను కలవడానికి కార్యకర్తలు సిద్ధమయ్యారు.

**కర్మచక్రం చాలా నిగూఢమైనది, అగోచరమైనది**

అప్పటి అభద్రత దృష్ట్యా ఇతర మతస్తులను నమ్మడం కష్టం. దానికి తోడు హిందువులు వస్తున్నారన్న కబురు వ్యాపించింది. కాని ఆ వచ్చేది శాంతిదళం సభ్యులని, అందులోనూ శ్రీరాం సహచరులని తెలిసిన తరువాత అంతా ఊపిరి పీల్చు కున్నారు. అల్లర్లు సృష్టించాలని వచ్చినవారు చాలా ప్రయాసపడి కొంత ఆస్తినష్టం కలగజేసారు కాని వారనుకున్నంత నష్టం చేయలేక పోయారు. చాలా మందిని బంధించారు. అయినా ఒత్తిడి, అభద్రత కొనసాగింది. శ్రీరాం తరచూ అక్కడికి వెళ్ళసాగారు. నెలన్నర పాటు శ్రీరాం ప్రతిరోజూ వారిని కలిసేవారు. వారి బాధలు, సమస్యలు అడిగి తెలుసుకునేవారు. శ్రీరాంతోపాటు ఇతర సహచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉండేవారు. అలా వారిని కలిసి వారి మనోబలం పెంచాలన్నది వారి ఉద్దేశం.

## సవాళ్ళతో కూడిన ఉత్సవం

15 ఆగస్టు 1947, స్వాతంత్రం లభించింది. మథురలో కూడా ఉత్సవారు జరిగాయి. శ్రీరాం ఇంట్లో ప్రత్యేకమైన యజ్ఞం చేశారు. ముఖ్యద్వారం దగ్గర జండా వందనం చేశారు. తరువాత కలెక్టరేట్‌లో జరిగిన ఉత్సవంలో పాల్గొన్నారు. ఆ తరువాత కటరా కేశవ్‌దేవ్‌కి కూడా వెళ్లారు. వారితో పాటు స్థానిక సామాజిక కార్యకర్తలు, మిత్రులు శ్యామ్‌లాల్ కూడా ఉన్నారు. (శ్యామ్‌లాల్ గారు అత్యంత సన్నిహిత స్నేహితులు). అక్కడి కుటుంబాల్లో కూడా ఉల్లాసం నిండింది. కాని నిష్కపట వాతావరణం మాత్రం లేదు. వారి మనసుల్లో భయాందోళనలు నిండే ఉన్నాయి. అంత భయంగా ఉంటే తమ ఇంటికి వచ్చి ఉండవచ్చన్నారు శ్రీరాం వారితో. మా ప్రెస్‌లో కూడా మీ సముదాయం వారు పని చేస్తున్నారు. ఎన్ని రోజులైనా భయం లేకుండా ఉండమన్నారు.

శ్రీరాం ఇచ్చిన రెండు కుటుంబాలు మకాం మార్చేందుకు కూడా సిద్ధమయ్యాయి. సాయంత్రానికల్లా శ్రీరాం వారి బసకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వారి కోసం ఘియామండి ఇంట్లోనే రెండు గదులు ఖాళీ చేశారు. మర్నాడు వాళ్ళని ఇంటికి తీసుకొచ్చారు. చెప్పుకోదగ్గ పెద్ద సామాను లేవు కాబట్టి ఉన్నవి మూటకట్టుకుని వచ్చేశారు. మాతాజీ ఎదురొచ్చి మరీ స్వాగతం పలికారు. ఇంట్లోనే వారికి వంట చేసి భోజనం ఏర్పాట్లు చేశారు. రెండు వారాల వరకు వారు ఆ ఇంట్లోనే ఉన్నారు. పరిస్థితులు సద్దుమణిగాక తిరిగి ఎవరిళ్ళకి వారు వెళ్ళిపోయారు.

అల్పసంఖ్యాకులకు ఇప్పుడు ఉపాధి కొత్త సమస్యగా మారింది. వారికి ఉద్యోగం ఇవ్వడానికి వెనకాడేవారు. కొన్ని చోట్ల ఉన్న ఉద్యోగాల్లోంచి కూడా తీసేశారు. వారంతా శ్రీరాం దగ్గరకొచ్చి మొరపెట్టుకున్నారు. శ్రీరాం వారి యజమానుల దగ్గరకెళ్ళి నచ్చచెప్పారు. వారి భయానికి కూడా కారణం లేకపోలేదు. పని చేసేవారి స్వభావం లేదా చరిత్ర వల్ల కాదు, సమాజంలోని అపనమ్మకం, ఒత్తిడి ముఖ్య కారణాలు. అనవసర మైన ఉత్తేజాన్ని రేకెత్తిస్తున్న సాంప్రదాయక సంఘటనలు కూడా ప్రజల మీద ఒత్తిడి తెస్తున్నాయి.

బాగా నచ్చజెపితే కొంతమంది ఉద్యోగాలు తిరిగి ఇచ్చేశారు. కాని అపనమ్మకం తొలగాలంటే ఏం చేయాలి? ఒక సహకార సమితిని ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. కాస్త పెట్టుబడి సర్దుబాటు చేస్తే ఏదైనా చిన్న తరహా పరిశ్రమలు మొదలు పెట్టవచ్చు. బట్టలు నేయడం, రంగులు వేయడం, మసాలాలు, అప్పడాలు, సబ్బుల తయారీ వంటివి చేయవచ్చు. వీటికి పెద్దగా పెట్టుబడి అక్కర్లేదు కాబట్టి సమాజంలో కొందరు శ్రీమంతుల సహాయంతో అక్టోబరు 1947 కల్లా సహకార సమితి ఏర్పాటయింది. ఈ సమితి నలభై కుటుంబాలకు పని కల్పించింది. సామాన్లు తయారు చేసి వాటిని బజార్లలో అమ్మే వరకు బాధ్యతంతా వారే తీసుకున్నారు. మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా, మునుపటి ఉద్యోగాలకన్నా ఇదే నయం అనిపించింది. స్వంత వ్యాపారం, ఎక్కువ లాభం. అందుకని కూడా ఆ కుటుంబాలు ఈ పనుల మీద ఎక్కువ అభిరుచి చూపించాయి. కొన్ని సంవత్సరాల వరకు సమితి సక్రియంగా నడిచింది.

సామాజిక సక్రియత వల్ల శ్రీరాం ఎందరికో స్నేహ పాత్రులయ్యారు. మార్చి నుండి డిసెంబరు వరకు మొత్తం

**తీసుకునేటప్పుడు ఇచ్చి తీరాలనే విషయం మరువకూడదు**

మథురలో గాయత్రీ యజ్ఞాల హోరు కొనసాగింది. ఈ కాలంలో 35 కార్యక్రమాలయ్యాయి. నాలుగైదు వేల మంది సంపర్కంలోకి వచ్చారు. అసలైన యజ్ఞం మనలోని ఆంతరిక క్షేత్రాన్ని సంపన్నం చేసుకోవడమే అని చెప్పేవారు శ్రీరాం. ఈ అగ్నిహోత్ర అనుష్ఠానం ఆ ఆంతరిక యజ్ఞానికి ప్రతీక. దీన్నే శ్రీకృష్ణుడు 'బ్రహ్మయజ్ఞం', 'జ్ఞానయజ్ఞం' అన్నారు.

స్వార్థాన్ని ఆహుతిగా ఇవ్వాలి. కానీఎక్కడ? సమాజం, శ్రీరాం విశ్వాత్మ ముఖంలోని యజ్ఞ జ్వాలల్లో. ప్రజలలో పెరుగు తున్న కోపం ప్రజలలో ఎగసిపడుతున్న కోపాన్ని, ద్వేషాన్ని సంయమపరచాలనే లక్ష్యంతోనే యజ్ఞాల శృంఖల నిర్వహించారు. మథురలో గొడవలు ఆగిపోవాలన్నది తక్షణ లక్ష్యం. 1948 వసంతోత్సవంలో "మథురలో రగులుతున్న నిప్పును శ్రీరాం దివ్యయజ్ఞ జ్వాలలు నియంత్రించాయి" అని ప్రఖ్యాత రాజకీయ కార్యకర్త జగన్ ప్రసాద్ రావత్ ప్రకటించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు సరైన ధార్మిక సందేశం అందించకపోయుంటే మథుర కూడా నాశనం అయ్యేది.

30 జనవరి 1948నాడు ఒక ఉన్మాది మహాత్మగాంధీ గారిని చంపేశాడు. ఆ సమాచారం దేశాన్ని కుదిపేసింది. "ఆ జ్యోతి ఆరిపోయింది" అని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ అన్నమాటల్లో దేవ ప్రజల ఆత్మ ఘోషిచ్చింది. అదృష్టవశాత్తు ఆ ఉన్మాది హిందువు. అలా కాక అతను ఏ అల్పసంఖ్యాకుల సముదాయంలోని వాడైతే ఏం జరిగేదో ఊహించడమే కష్టం.

31 జనవరిన శ్రీరాం ఉపవాసం చేశారు. మహా పురశ్చరణ చేస్తున్న ఆ రోజులలో ఒంటిపూట భోజనం చేసేవారు. గాంధీ గారి హత్యకు సమాజమంతటినీ దోషిగా భావించారు శ్రీరాం. ఆ దోష ప్రక్షాళన కోసం ఉపవాసం చేసారు. వారి ఉపవాసంలో ధార్మిక, సామాజికనేతలు కూడా పాల్గొన్నారు. సద్భావ సమితిలో సభ్యులేకాక కాంగ్రెస్ కార్యకర్తలు, సామాన్య పౌరులు కూడా ఒక్కొక్క రోజు ఉపవాసానికి కూర్చున్నారు. ఫిబ్రవరి 48న శ్రీరాం ఉపవాసాన్ని విరమించుకున్నారు. ఆరోజు వంద మందికి పైగా అక్కడున్నారు. గత కొన్నేళ్ళుగా వ్యాపించిన విషం వారిని దహించినట్టుగా వారి ముఖాలలోనే స్పష్టంగా కనిపిస్తోంది.

శ్రీరాం కుటుంబంలో కొత్త శిశువు జన్మించాడు. సెప్టెంబరు 1948 (ఆశ్వీయుజ కృష్ణ తృతీయ) నాడు బాబు పుట్టినప్పుడు శ్రీరాం జయసింహపురంలో ఉన్నారు. అక్కడి పరిస్థితులు విష మించాయి. వారిని శాంతపరచడానికి శ్రీరాంని పిలిపించారు. సాయంత్రానికల్లా ఆయన తిరిగి వచ్చారు. వారితోపాటు స్వామి ప్రేమానంద్ అనే ఆర్య సమాజ సన్యాసి కూడా వచ్చారు. ఆయన భజనలు చేసేవారు. శ్రీరాం యజ్ఞాల్లో కూడా భజనలు చేసేవారు. అది చూసి ఆర్యసమాజం వారు ఆయన్ని తప్పుపట్టినా కూడా పట్టించుకునేవారు కాదు. ఇంట్లోకి అడుగుపెట్టిన వెంటనే బాబు పుట్టిన విషయం తెలిసింది. అది విని స్వామి ప్రేమానంద్ బాబుకి శివుడి పేరుకి పర్యాయమైనది పెట్టాలని సూచించారు. నేడు సమాజం ద్వేషం అనే గరళాన్ని మింగుతోంది. ఆ గరళంపై సాధించిన విజయానికి గుర్తుగా ఉండాలి బాబు పేరు. శ్రీరాం వెంటనే "మృత్యుంజయ ఎలా ఉంటుంది. శివుడి పర్యాయమే కదా" అన్నారు.

నామకరణం చేసేటప్పుడు చుట్టుప్రక్కల ముస్లిం కుటుంబాలను కూడా సంస్కారానికి పిలిచారు. వారంతా ఏదో రూపంలో శ్రీరాం నుండి సంరక్షణ పొందినవారే. సంస్కారం అయ్యాక జరిగిన చర్చలో శ్రీరాం ధార్మిక క్షేత్రానికే పరిమితం కాకూడదని ద్వారకా ప్రసాద్ అందరి తరపున విన్నవించారు. సామాజి కంగా, రాజకీయంగా కూడా మీ అవసరం ఉంది, అక్కడి వారికి కూడా నాయకత్వం వహించ మన్నారు.

అక్కడున్న వారంతా ద్వారాకాబాబు చెప్పినదానికి సమర్థించారు. మథుర ప్రజలకు శ్రీరాం నాయకత్వం వహిస్తే మైనారిటీలు ఆందోళన పడకుండా ఉండగలరని సలీమ్ సాహెబ్ అన్నారు. అక్కడ వారందరికీ ఈ మాటలు నచ్చ

**ఇస్తూనే ఉండండి, సత్కర్మ బీజాలు నాటుతూనే ఉండండి**

సాగాయి. కాని రాజకీయ కార్యకర్తలు ఇబ్బందిపడ్డారు. అధికారం చేజిక్కించుకోవాలనే ఆశ ఉన్నవారు మాత్రం చాలా కంగారు పడ్డారు. శ్రీరాంవంటి సహచరుడి వల్ల యాత్ర ఇంకా సుగమమే అవుతుంది తప్ప అడ్డుండదని మిగిలిన వక్తలు చెప్పారు.

చివరిగా శ్రీరాం వంతు వచ్చినప్పుడు "మేము పని చేస్తున్న క్షేత్రం చాలా విశాలమైనది ఎక్కువ బాధ్యతాయుత మైనది. అది చేస్తూనే రాజకీయానికి దారి చూపించవచ్చు. ప్రజల భావాలను ధార్మికత ఆధారంగానే నియంత్రించ వచ్చని ఈ సంవత్సరం చూసాం. రాజకీయాలతో, ప్రభుత్వంలో ఉండి పరిస్థితులను నియంత్రించడం అంత సులువేమీ కాదు. ఈ పరిస్థితులకు కారణం మనసులో నాటుకున్న ద్వేషం, శత్రుత్వం, ధార్మికంగానే వారి మనస్సులను చేరుకోగలం."

రాజకీయాల్లో ప్రవేశించే ఉద్దేశం లేదని ఆయన నిర్ణయాన్ని స్పష్టంగా చెప్పారు శ్రీరాం. అయినా కొందరు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. సముద్రంలో ఈదేవారు కాలవల్లో ఈది ఆనందాన్ని పొందలేరు అన్నారు శ్రీరాం. రాజకీయాల వంటి మరిన్ని కాలువలకు నీటినిచ్చే సాగరంలో ఈదడమే వారికి ఇష్టం అన్నారు. మిగిలిన రాజకీయ కార్యకర్తలకు ఊరట కలిగింది. చాలా సంతోషం, ధన్యులు మీరు అంటూ వారు శ్రీరాంకు నమస్కరించారు. ఆ నమస్కారాల్లో కృతజ్ఞత కన్నా ఊరట ఎక్కువగా కనిపించింది.

### కొత్త సాధకుల కోరిక

కార్యాలయానికి వచ్చే ఉత్తరాలను శ్రీరాం స్వయంగా తెరిచేవారు అందులోని విషయాలను జాగ్రత్తగా గమనించే వారు. ఒకరోజు శ్రీరాం భూదేవశర్మ గారితో "పండిట్ జీ, పాఠకులు మన నుండి ఏం కోరుకుంటున్నారు?" అని అడిగారు.

"ఉత్తరాలతో పెద్దగా అంచనా వేయలేం. కిందటి రెండేళ్ళలో సభ్యుల సంఖ్య ఐదు రెట్లు పెరిగింది. వారిలో కొందరు అఖండజ్యోతి పాత సంచికలు కావాలని అడిగారు. వారికి అవి కూడా చదవాలని ఉంది."

"పాత సంచికలు మన దగ్గర లేవు. కాని వాటికోసం ఒక ఉపాయం ఉంది. ఆ సంచికల్లో ప్రచురించిన లేఖలను పుస్తకాలుగా అచ్చు వేయించాలి."

అఖండజ్యోతికి సంబంధించిన ఏ నిర్ణయమైనా మాతాజీని అడిగే తీసుకునేవారు. ఆవిడ ఎప్పుడూ శ్రీరాంకి వ్యతిరేకంగా ఆలోచించలేదు. పుస్తకాలను అచ్చు వేయించా లని నిర్ణయిం చారు. అఖండజ్యోతిలో ప్రచురించిన లేఖల సంగ్రహాలతో ఆరు అణాల పుస్తకాలు ముద్రించారు. వాటితోపాటు కొత్తగా వ్రాసిన పుస్తకాలు కూడా ఉన్నాయి. పుస్తకాల వెల గురించి చర్చ జరిగినప్పుడు మాతాజీ "ఆరు అణాలు ఖర్చు పెట్టలేని వారు కూడా ఎందరో ఉంటారు. వారి గురించి కూడా ఆలోచించాలి" అన్నారు.

భూదేవశర్మగారు "ఉచితంగా అయితే ఇవ్వలేం కదా, ఏమి చేయగలం. పుస్తకాలు కొని చదివే స్తోమత లేనివారు. ముందు, భోజనం, బట్టల ఏర్పాటు చేసుకోవడానికి కృషి చేయాలి" అన్నారు.

"భోజనం కూడా సమకూర్చుకోలేని వారి గురించి సమాజం చూసుకోవాలి. అన్నసత్రాలు, లంగర్ మొదలైనవి ఆ పనే చేస్తాయి"

పుస్తకాలు కొనలేనివారు పుస్తకాలయాలకు వెళ్ళి చదవ గలరు. పుస్తకాలయాలకు పుస్తకాలు ఎలా చేరాలి? ఇలా చర్చ కొనసాగుతూనే ఉంది.

"స్వాధ్యాయం చేయాలనుకునేవారికి కొనే స్తోమత లేకపోయినా పుస్తకాలు చేరాలన్నది మాతాజీ ఉద్దేశం. ఒక మధ్యమార్గాన్ని అవలంభించవచ్చు. కొంతమందికి తక్కువ ధరకే పుస్తకాలు ఇవ్వవచ్చు. కాని ఎవరికి? ఎవరైనా పుస్తకం చూసి ధర తగ్గించమని అడిగితే, ఆరు అణాల పుస్తకాలను ఒకటిన్నర అణాకి, అంటే నేటిలెక్కలో 8 పైసలకు అమ్మ వచ్చు. విద్యార్థులు తమ ప్రధానోపాధ్యాయుని సిఫార్సుతో

**ఏదో ఒకరోజు సత్కర్మల బీజాలు మొలకెత్తి ఫలాలను ఇస్తాయి**

ఈ అవకాశాన్ని పొంద వచ్చు. అప్పుడు ఎవరూ దీన్ని దుర్వినియోగపరచలేదు. అలాంటి పుస్తకాల మీద విద్యార్థి సంస్కరణ అని ముద్ర కూడా వేయాలి అన్నారు.

అఖండజ్యోతిలో ఈ సూచన ప్రచురించినప్పుడు వందల మంది ఉత్తరాలు రాసారు. విద్యార్థులకు శ్రీరాం వ్యక్తిగతంగా జవాబు రాశారు. వారి స్నేహితులతో కూడా పుస్తకాలు చదివించమని సలహా ఇచ్చారు. 1949 అక్టోబరు కల్లా 500 మంది కన్నా ఎక్కువ పాఠకులు స్వాధ్యాయ శృంఖల పుస్తకాలను చదివారు. వారు మథురకు వచ్చి కొంతకాలం శ్రీరాంతో కలిసి ఉండాలని కోరుతున్నట్టు ఉత్తరాలు వ్రాశారు. కొందరు యువకులు శ్రీరాంను గురుదేవ అంటూ సంబోధించారు. మథురకి రావాలి అని కోరిన వారిని నిరాకరించలేదు. వారు నొచ్చుకుంటారు. కానీ వారు ఉండేందుకు ఏర్పాట్లు లేవు.

పది, పన్నెండు మందికైతే ఇంట్లోనే ఏర్పాటు చేయవచ్చు అన్నారు మాతాజీ. కాని ఇది శాశ్వత పరిష్కారం కాదు. భవిష్యత్తులో సాధకుల సంఖ్య పెరగబోతోంది. కాని ఇతర ఏర్పాట్లకు తగినన్నీ సాధనలు లేవు. ఇవే ఆలోచనలు మనసులో మెదులుతున్నాయి. తాత్కాలికంగా మాతాజీ సలహాను ఒప్పుకుని విద్యార్థులను, సాధకులను ఇంటికి పిలిచారు. వారందరికీ ఉత్తరాలు వ్రాయమని భూదేవశర్మ గారికి పురమాయించారు. కాని శాశ్వత పరిష్కారం కనిపించక పోయేసరికి పూజగదిలో వెలుగుతిన్న దీపం వంక చూసారు. ఉన్నట్టుండి, అంతస్సులో స్తబ్ధత, నిశ్శబ్దం అలుముకుది. చల్లటి గాలి వీస్తోంది. హిమాల యాల దృశ్యం మనో ఫలకంపై ఉబికివస్తోంది. క్రితంసారి యాత్ర స్మృతులు ఒక్కొక్కటిగా కంటి ముందు కదలాడు తున్నాయి. ఆ నిశ్శబ్ద వాతావరణంలో గురువుగారి మాట వినిపించింది. "ఆశ్రమాన్ని నిర్మించు, ఆశ్రమాన్ని నిర్మించు."

– అనువాదం: *శ్రీమతి జయలక్ష్మి*

---


# యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**

**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఇతర SBI బ్రాంచీల నుండి మా ఎకౌంట్‌కు చెక్ ద్వారా ఉచితంగా ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. ఇతర బ్యాంకుల నుండి కూడా NEFT ద్వారా ఉచితంగా డబ్బును పంపించవచ్చు. Cheque, Draft, Payable at Hyderabad ద్వారా కూడా డబ్బును పంపించవచ్చు. తరువాత బ్యాంక్ చలానా కాపీని మాకు పూర్తి వివరములతో పంపించగలరు. మా ఎకౌంట్‌లోని ఇతర బ్యాంకుల నుండి క్యాష్‌గా పంపినప్పుడు అదనంగా రూ. 50/- కలిపి పంపవలసి ఉంటుంది. M.O. ద్వారా కూడా డబ్బులు పంపించవచ్చును. అలా పంపించినప్పుడు మీ వివరములు ఈ క్రింది నెంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయగలరు.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు** బ్యాంకుపేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**

ఖాతా నెం.: **32506416087** IFSC Code: **SBIN-0013272**

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట, అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500018.

ఫోన్: 040-39560330


**ఇచ్చే అవకాశాన్ని జారవిడుచుకోకండి**

## మాతా భగవతీదేవిశర్మ దివ్యచరిత్ర-9

# యదార్థ సాధనాస్వాథ్వీ



మాతాజీ తన ఆరాధ్యుని యొక్క నిజమైన సాధనా సాథ్వీ. పూజ్యగురుదేవులు ఆమెకు గురువు, మార్గ దర్శకులు, ఇష్టులు, ఆరాధ్యులు అన్నీ. ఆమె జీవితము తన ఆరాధ్యుని శ్రీచరణములలో సమర్పించబడిన సురభిత పుష్పము వంటిది. రోజూ చేసే ప్రతిచిన్న పెద్ద పని మరియు ప్రతి క్రియాకలాపము ద్వారా ఆమె ప్రాణము తన ఆరాధ్యుని మహా ప్రాణములో కలిసేది. బాహ్యముగా ఇల్లు, కుటుంబం, బంధువులు, మిత్రులు, అఖండజ్యోతి సంస్థాన్ మరియు గాయత్రీ తపోభూమి మొదలగు అనేక లౌకిక బాధ్యతలు నిర్వహిస్తూన్నప్పటికీ ఆమె ఆంతరిక జీవితము ఈ లౌకికతను ఏవిధంగానూ స్పృశిం చేది కాదు. పూర్తిగా అలౌకికముగా ఉండేది. సాంసారిక కర్తవ్యములను పూర్తి మనసుతో చేసే సార్థక ప్రయత్నము చేస్తూవున్నప్పటికి ఆమె ఆంతరిక భావనల్లో ఎక్కడా సాంసారిక విషయముల లేశమాత్ర గంధం కూడా ఉండేది కాదు.

తన పూర్తిరోజు క్రియాకలాపాలలో నిమగ్నమైయున్న ఆమె మనసులో రాత్రి చేయబోయే విశిష్ట సాధనల కొరకు తయారవుతూ ఉండేది. వచ్చిపోయేవారి పని, పత్రిక మరియు ఇతర సాహిత్యముల ప్రచురణ, గాయత్రీ తపోభూమి యొక్క అనేక క్రియాకలాపాల వలన పరమపూజ్య గురుదేవుల పని చాల ఎక్కువైపోయింది. మాతాజీకి దీనిలో సమానముగా పని ఉండేది. అందువల్ల ప్రొద్దున్న సూర్యోదయము నుంచి రాత్రి యొక్క మొదటి జాము వరకు సాధన చేయటానికి ఏవిధముగానూ సమయము దొరికేదికాదు. అందువల్ల గురు దేవులు అర్ధరాత్రి నుండి పొద్దున వరకు సాధన చేయుటకు నిర్ణయించారు. రోజంతా జరిగే క్రియాకలాపాలను చూస్తే ఇది చాలా సరియైన సమయము. కానీ దీనివల్ల ఆమెకు నిద్రపోవుటకు అతి కష్టముమీద 3, 4 గంటలు దొరికినవి. కానీ మాతాజీకి అర్ధరాత్రికంటే కొంచెము ముందు లేచి గురుదేవులతో పాటు కూర్చుని సాధన చేయుటలో ఎంత ఆనందము లభించే దంటే ఇతర కష్టములు నగణ్యము అనిపించేవి.

ఆమె నియమిత సమయములో స్నానాదిక ములు ముగించుకుని పూజగదికి చేరుకునేది. అక్కడ గురుదేవులు ఈమె కొరకు నిరీక్షిస్తూ ఉండేవారు. ఆసనము మీద కూర్చోగానే ఆరాధ్యుని అనుగ్రహము ఆమె మీద అవతరించేది. ప్రాణసంచారము యొక్క అనేక గుహ్యక్రియలు ఆమెలో జరిగేవి. గోపనీయ బీజమంత్రముల స్ఫోటనతో సూక్ష్మచేతన యొక్క దివ్యకేంద్రములలో అపార శక్తి సముద్రాలు ఎగసిపడేవి. కానీ ఇవి ప్రారంభ క్షణాలలో జరిగే విషయము. వీటి అనుభవము ఆమెకు ఇదివరకు కూడా కొన్ని అంశములలో ఉండేది. గురుదేవులతో పాటు గడిపే ఈ సాధనా క్షణాలు అతి విశిష్టమైనవి. ఈ క్షణాలలో శాస్త్రములు కేవలము సంకేతం ద్వారా చెప్పే అనేక సత్యముల సాక్షాత్కారము జరిగేది. విశ్వములోని ఏ సాధన గురించి శాస్త్రములలో కూడా పూర్తి వివరణ లేదు. యథార్థ సాధన శాస్త్రములలో ఉండదుకూడా. ఇది పూర్తిగా గురుగమ్యమే. శాస్త్రగమ్యము కాదు. దీనిమీద ఎల్లప్పుడూ గురుగతప్రాణులైన శిష్యులకి మాత్రమే అధికారమున్నది. మాతాజీ యొక్క అగాధమైన సమర్పణ మరియు పరిపూర్ణ నివేదన ఆమెకు సర్వదా

**ఇతరులు చేసిన తప్పులను మరచి ఇతరులను క్షమించడం నేర్చుకోండి**

గోపనీయమైన ఈ యోగసాధనలకు అధికారిని చేసింది.

నియమిత యోగసాధనల ప్రగాఢత మరియు సఘనత వల్ల ఆమె సూక్ష్మశరీరము అతి తేజస్వి మరియు ప్రచండ ఊర్జ కలిగినది అయింది. గురుదేవుల ద్వారా చెప్పబడిన ముఖ్యమైన యోగవిధానముల ద్వారా ఆమె అతి సులభంగా స్థూలశరీరము నుండి సూక్ష్మశరీరమును వేరుచేసుకోగలిగేది. ఇటువంటి పరిస్థితులలో గురుదేవులు ఆమె స్థూలశరీరమును రక్షిస్తూండేవారు. అప్పుడు లోకలోకాంతరములకు వెళ్ళి అవసరమైన తత్త్వములను సంపాదించుకుని వచ్చేది. శిష్యులు మరియు సంతానము యొక్క పిలుపుకు కూడా ప్రత్యుత్తర మిచ్చేది. గురుదేవుల సాన్నిధ్యములో యోగసాధనా తీవ్రత వలన ఆమె సూక్ష్మశరీరము యొక్క క్రియాశీలత ఉత్తరోత్తరా పెరుగుతూ వెళ్ళింది. కారణశరీరము కూడా ప్రభతోకూడి ఇంకా ప్రఖరము అవ్వటము మొదలిడినది. ఆమె యొక్క సాధనా ఘనత్వం ఎంత పెరిగిందంటే ఆమె అన్నిరకాలా పరమ సమర్థురాలయింది.

ఈ స్థితి మొదటికంటే చాలా భిన్నముగ ఉన్నది. దీనిని తెలుసుకొని అర్థము చేసుకొనుట సులభము కాదు. దీనిగురించి ఆమె స్వయముగా విభిన్న ప్రసంగాలలో ఇచ్చిన సంకేతాలను బట్టి గురుదేవులు ఆమె స్థూలశరీర రక్షణ కొరకు ఆగవల్సిన అవసరము ఉండేది కాదని తెలుస్తోంది. దివ్యమహా మంత్రముల కీలకశక్తి మరియు ఆమె మహాశ్చేతన యొక్క సంకల్పము స్థూలదేహ పరిరక్షణ కొరకు సరిపోతుంది. గురుదేవులు మొదటినుండి యోగము యొక్క సమస్త ఉచ్చతమ సాధనలలో పారంగతులు. ఇప్పుడు మాతాజీ కూడా యోగం యొక్క ఉచ్చతమ రహస్యాలను అవగతము చేసుకున్నది. స్థితి ఎంత వరకు వచ్చిందంటే ఇంక స్థూలదేహముతో ఏవిధమైన సాధనా చేయవల్సిన అవసరం లేదు. సూక్ష్మశరీరము నుండే స్వయమేవ అన్ని యోగవిభూతులూ పొందగలిగేది. ఈ విలక్షణస్థితి అతి కొద్దిమంది మహాయోగులకు మాత్రమే సులభము.

ఈ పరివర్తిత భావదశలో కూడా నియమిత సాధన కొరకు లేచుట మరియు ఆసనం మీద కూర్చునే బాహ్యకార్యక్రమము అలాగే కొనసాగేది. కానీ ఆంతరిక సత్యములు మారిపోయాయి. ఆమె గురుదేవులతో పాటు ఇప్పుడు కూడ సాధనకు కూర్చునేది. కానీ విశేష సాధన కొరకు కాదు. ఆయన సాధనాత్మక కార్యక్రమములలో సహకరించడానికి. ఇటువంటి కార్యక్రమ ములలో శిష్యులు, భక్తుల యొక్క బాధ మరియు వారికి వచ్చిన కష్టములను నివారించుట ప్రముఖమైనవి. దీనికొరకు వారిరువురూ శిష్యుల వద్దకు వచ్చి వారికి ఆశ్వాసన నిచ్చి, ధైర్యము చెప్పి తమ యోగశక్తితో వారి కష్టములను తృటిలో నివారించేవారు. సంతానముల బాధా పూరితమైన అంతశ్చేతన తమ మహాయోగినీ తల్లి యొక్క అనుగ్రహం పొంది అపూర్వ శాంతిని అనుభవించేది.

సాధనా క్షణములలోనే అప్పుడప్పుడూ గురుదేవులతో పాటు సూక్ష్మశరీరముతో దివ్యలోకములు, దివ్యక్షేత్రములు మరియు సామాన్య మానవుల దృష్టికి కనిపించని దివ్యసాధనా కేంద్రములకు ఆమె వెడుతూ ఉండేది. దీనిగురించి ఆమె ఎప్పుడూ ఎవ్వరికీ పూర్తిగా చెప్పలేదు. కానీ గురుదేవుల మహిమను తెలపటానికి అప్పుడప్పుడూ కొన్ని అంశములు ఆవిడ తెలిపేది. అటువంటి ఒక ప్రసంగములో ఆమె ఇలా చెప్పారు. ''నాయనా! గురుదేవులెవరో మీకు తెలీదు. ఆయనని ఎప్పుడూ ఒక సామాన్య తపస్విగా, సిద్ధునిగా, యోగిగా అనుకొనే తప్పు చేయవద్దు. వారు మానవదేహములో సాక్షాత్తు ఈశ్వరుడే. ఈ నిజము నేను స్వయముగా నా కళ్ళతో చూశాను. నా సూక్ష్మచేతన స్వయముగా ఈ సత్యమునకు అనేకమార్లు సాక్షిగా ఉండేది. హిమాలయవాసులైన సిద్ధగణములు, దివ్య లోకవాసులు వారిని క్షణమాత్రము చూచుటకు తపిస్తారు. విశేష పరిస్థితులలో వారు వీరిముందుకు వచ్చినప్పుడు వాళ్ళు ఈయన చరణాలకు పువ్వులను సమర్పించి తమని తాము అత్యంత సౌభాగ్యవంతులుగా అనుకుంటారు. ఈ

**ఇతరుల తప్పులను క్షమిస్తే మనస్సు తేలిక పడుతుంది**

సత్యమును నేను అనేకసార్లు ఆయనతో పాటు ఉండి స్వయముగా చూచాను.” మాతాజీ ఈ మాటలు విని భావ విహ్వలులై తండ్రిని గురించి పిల్లలకు తల్లితప్ప స్పష్టముగా ఎవరు చెప్పగలరు అని అనుకునే వారు.

గురుదేవుల దివ్యస్వరూపం గురించి స్పష్టముగా చెప్పే మాతాజీ తన గురించి ఏమీ చెప్పేదికాదు. మౌనంగా ఉండేది. ఎప్పుడైనా విశేష పరిస్థితులలో చాల చెప్పదల్చు కున్నప్పుడు ఇంత మాత్రమే చెప్పేది. ఆధ్యాత్మికత చెప్పబడేది, వినేదీ కాదు. ఇది అనుభవంలోకి తెచ్చుకోవల్సిన విషయము. ఇన్ని పుస్తకాలు వ్రాయబడినా లేక చదువబడినా దీని సత్యము సాధన యొక్క అనుభూతుల ద్వారానే తెలుసు కోగలము. ఈ సత్యములు కూడా ఎలా ఉంటాయంటే దాని గురించి తెల్సినవాళ్ళు చెపుతూవుంటే ఒక రహస్యమయ నవలలోని కథ చెపుతున్నారా! అని అనిపి స్తుంది. అందువల్ల తెలివైనవాళ్ళు దీనిగురించి ఎవరికీ, ఎక్కడా ఏమీ చెప్పరు. చాలా అవసరమనుకుంటే దాని తత్త్వదర్శనము లేక సిద్ధాంత ముల గురించి చెపుతారు. చెప్పవల్సిన ముఖ్యమైన విషయం కూడా అంతేకదా! అవి అర్థమైతే అన్నీ అర్థమైపోతాయి.

తన మాటలను వివరిస్తూ మాతాజీ సాధనా ప్రసంగములు ఎంత రహస్యంగా ఉంచితే అంత మంచిదని చెప్పేవారు. చర్చిస్తే దాని బలము తగ్గుతుంది. ఇలా చెప్తూ ఆమె తన మాటలను కొనసాగించేది. ఇప్పుడు నా విషయమే తీసుకోండి. నేనేమి చేశానో ఎవరికి ఏమి తెలుసు? అఖండ జ్యోతి సంస్థాన్‌లో ఉన్నప్పుడు అర్ధరాత్రికి ముందే లేచేదాన్ని. తరచు రాత్రిళ్ళు గురుదేవులతో పాటు సాధనలో గడిపేదాన్ని. కానీ ఇంట్లో ఉన్న మిగతావాళ్ళు లేచేముందే సాధననుంచి లేచేదాన్ని. ఆతరువాత వారందరూ నిద్ర లేచాక మళ్ళా స్నానము చేసేదాన్ని. ఈ స్నానంతో రాత్రంతా సాధన వలన కలిగిన వేడి శాంతించేది. అంతేకాక అందరూ నేను ఇప్పుడే నిద్రలేచాను అని అనుకునేవారు. ఇంత ఆలస్యంగా స్నానము చేస్తుందేమిటని అనుకునేవారు. నన్ను ఇంకా అడిగినప్పుడు వారి మాటలకు ఔనని తలూపేదాన్ని. కానీ అసలైన విషయము ఇంకొకటి. ఆరోజులలో గురుదేవులతో పాటు నేను పూర్తిగా ప్రగాఢతతో తన్మయత్వముతో మరియు తత్పరతతో సాధన చేస్తూండేదాన్ని. అవి అత్యంత అద్భుత మైన రోజులు. శరీరము ఈ లోకంలో ఉన్నా చేతనత్వం ఎక్కడో ఉండేది. నా సర్వస్వమూ గురూజీలో కరిగిపోతూ ఉండేది. ఆమె యొక్క ఈ మాటలు వినేవాళ్ళకి శివశక్తుల అంతర్‌మిలన భావానుభూతులు, సత్యమూ స్పష్టమయ్యేది.

*– అనువాదం: డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ*

## నేను ఆమెను దుఃఖ పెట్టలేను

*మహాత్ముడైన చ్యోగత్సు ఉన్నత శ్రేణికి చెందిన వేదాంతి. ఈయన దాంపత్య జీవితాన్నందరూ ఎంత గానో కొనియాడేవారు. కొన్నాళ్ళుకు ముందుగా ఆయన భార్య మరణించింది. అనేకమంది ప్రముఖులు వారి సంతాపాన్ని తెలియజేస్తూ వచ్చి చేరారు. వారిలో చైనా దేశపు రాజు చ్యోగత్సు భార్య సమాధి దగ్గర కూర్చుని ఆనందంగా పియానో వాయిస్తూ కూర్చోవటం చూచి ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచాడు. అది గమనించి ఆ మహా వేదాంతి “నేను జీవించినంత కాలం నా సహధర్మ చారిణికి ప్రసన్నతో కూడిన సంభాషణలనే వినిపించాను. కటువచనాలతో ఏనాడు ఆమె కోమల హృదయాన్ని నొప్పించలేదు. ఇప్పుడు మరణించిన తరువాత మాత్రము నా వ్యధను వ్యక్తం చేస్తూ ఆమెను ఎందుకు దుఃఖపెట్టాలి. ప్రసన్నమైన సంభాషణలను వినిపించి ఆమెకు ఆనందం కలిగించే అవకాశాన్ని కోల్పోవటం వలన పియానో వాద్యస్వరాలతో ఆమె ఆత్మకు ఆనందం కలిగించడము నా విద్యుక్త ధర్మమని తెలియ జేశాడు” దివ్య సమర్పణ, పతిపత్నుల అమరప్రేమ అంటే ఇదేనని రాజు అచ్చెరు వొందాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి**

# జీవనమార్గం ఏవిధంగా ఉండాలి?

ప్రపంచంలో ప్రతి వస్తువుకూ రెండురకాల ఉపయోగాలు ఉంటాయి. అందులో ఒకటి సదుపయోగమైతే – రెండవది దురుపయోగము. మానవ జీవితానికి కూడా ఈ రెండురకాలైన ఉపయోగాలు వర్తిస్తాయి.

ఏ వస్తువునైనా ఉపయోగించినప్పుడు దానివల్ల ఎక్కువ మంచిస్థితి, ఎక్కువ శాంతి, అధికమైన సుఖసంతోషాలు కలిగితే కనుక ఆ వస్తువు సదుపయోగమైనట్లుగా భావించబడుతుంది. అలా కాకుండా ఆ ఫలానా వస్తువును ఉపయోగించటం ద్వారా ఎటువంటి లాభమూ లేకపోగా పైపెచ్చు బాధలు, కష్టాలు, అశాంతి, చిరాకు ఎక్కువైతే కనుక ఆ వస్తువు దురుపయోగ మైనదిగా తెలుసుకోవాలి.

జీవితంలో ఏ ఒక్క క్షణాన్నీ కాపాడి భద్రపరచి ఉంచలేము. జీవితంలోని ప్రతి ఒక్క క్షణమూ కరిగిపోతూనే ఉంటుంది. ఏదో ఒకపని చేస్తూ ఉన్నా లేదా అలా ఊరికే కూర్చున్నా, పడుకున్నా... సరే కాలం మాత్రం గడచిపోతూనే ఉంటుంది. అంత్యదిశగా(మరణం) సాగిపోతూండే దాని నిరంతర ప్రవాహంలో ఒక క్షణాన్ని కూడా పట్టుకొని ఆపి ఉంచలేము. కొన్ని అవసరాల కోసం ప్రేరణ, కొన్ని సుఖాల కోసం కాంక్షతో కూడిన ఒత్తిడీ, కాలం యొక్క నిరంతర గమనం... ఇవన్నీ కలసి ఏదో ఒకటి చెయ్యటానికీ లేదా చేస్తూండటానికీ మానవు లను వివశులను గావిస్తుంటాయి. జీవితం అంతం కావట మనేది తిరుగులేని సత్యం కాకపోయినట్లయితే 'చెయ్యవల్సినవన్నీ పూర్తిచెయ్యలేకపోయినా బాధను సహిస్తూ కూడా నిష్క్రియాత్మకంగా, నిశ్చేష్టులుగా పడుండే సోమరిపోతులెందరో మనకు కనిపిస్తూనే ఉంటారు.

ఏవిధంగానైనా సరే జీవితం సమాప్తమౌతుంది అనుకున్నప్పుడు అందులో వీలైనంత ఎక్కువ సమయమును సద్వినియోగం చేసుకొని తద్వారా శ్రేయస్కరమైన, శాశ్వతమైన లాభమును పొందగలగటం తెలివిగలవారి లక్షణం. ప్రతీ మనిషి తాను రాత్రి–పగలూ పరుగెత్తి పరుగెత్తి పనిచేస్తూ ఎక్కువ సుఖాన్నీ, శాంతినీ పొందటానికి జీవితమును సద్వినియోగము చేసుకుం టున్నానని అనుకుంటాడు. కానీ వాస్తవానికి జీవితమును ఏ దిశలో ఏవిధంగా గడిపితే అది సద్వినియోగమవుతుంది, ఏ దిశలో గడిపితే దుర్వినియోగమవుతుంది అన్న విచక్షణ కలిగిన వ్యక్తులు మనకు చాలా అరుదుగానే తారసపడతారనేది సత్యం!

అధిక శాతం ప్రజలు డబ్బు సంపాదించడమే జీవితాన్ని సద్వినియోగం చేసుకొనటమని భావిస్తుంటారు. ధనాన్ని కుప్పలుకుప్పలుగా సంపాదించితే దానితో అన్నిరకాలైన సుఖసంతోషాలను, కీర్తిప్రతిష్ఠలనూ పొందవచ్చునని వారి ఆలోచన. వాళ్ళ దృష్టిలో సుఖమూ, గౌరవమూ అంటే పెద్ద భవంతులు, పెద్దపెద్ద వ్యాపారాలు.

దానధర్మాలననుసరించి సంఘంలో గౌరవం, సన్మానాలూ... మొదలైనవాటికే పరిమితమైయుంటాయి. విశ్రాంతి తీసుకొన టానికి అత్యంత ఆధునికమైన సాధనోపకరణములను వీలైనంత ఎక్కువగా సమీకరించుకొనటమే వారి దృష్టిలో సుఖంగా ఉండటం. ఇంకొంచెం ముందుకు వెడితే భోగవిలాసాలు, ఇంద్రియములను తృప్తిపరచటం, ఫ్యాషన్ ప్రదర్శనలు, వీలైనంత ఎక్కువగా ధనాన్ని ఖర్చు చెయ్యటం... వగైరాలు ఉంటాయి. వాళ్ళ దృష్టిలో వీటిని మించిన సుఖం, గౌరవమూ మరేమీ ఉండవు.

వాళ్ళు సత్యంగా భావిస్తున్నదానిలో అసత్యమెంత ఉన్నదో తెలుసుకొనటానికి వాళ్ళ జీవితం మీద దృష్టి సారించాలి. వీలైనంత ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించటం వారి ధ్యేయం. కానీ కష్టం చెయ్యటం ద్వారా గానీ, నిజాయితీగా వ్యాపారం చెయ్యటం వల్లగానీ అంత మొత్తాలలో డబ్బును సంపాదించలేము. అందుకోసం ఇతరు లను పీడించాలి. ఉద్యోగాలలో ప్రభుత్వానికి కట్టవల్సిన ఏ రకమైన పన్నునైన కట్టకుండా ఎగవెయ్యాలి. లంచగొండి తనం, అవినీతి, నల్ల బజారు, అతివృష్టి, అనావృష్టి కారణంగా సంభవించే కరువు

**క్షమించడం వలన చాలా ఉపయోగాలు ఉన్నాయి**

కాలంలో అనుచితరూపంలో లాభాలనార్జించటం... ఇంకా ఇలాంటివే మరికొన్ని పనులు చేస్తే తప్ప ఎక్కువ ధనం సంపాదించలేము. ఇంకా వీటిని మించిన దుర్మార్గపు దారి మరొకటుంది. అదేమిటంటే ఇతరుల సొమ్మును దొంగిలించటం, ఇతరులను మోసగించి వారినుండి మొత్తం అపహరించటం, దొంగతనం, దోపిడి వంటివాటికి పాల్పడటం లాంటి హేయ మైన పనులను చెయ్యటం.

ఇలాంటి పనులు చేసి సంపాదించిన ధనం జీవితంలో ఒక్క క్షణమైనా సుఖశాంతులను ఇవ్వగలదా అన్నది ఆలోచించ వల్సిన విషయం. ఆ డబ్బుతో సమకూర్చుకున్న ఉపకరణాలు స్వల్పమైన విశ్రాంతినిచ్చి ఊరట చేకూర్చటానికీ 'నేను చేసిన తప్పులు బయటపడతాయేమో, ఇసుక గోడలను ఆధారం చేసుకుని కట్టిన ఈ ఆర్థిక భవంతి కూలిపోతుందేమో, ఎంతో నేర్పుతో కూడిన నయవంచనతో ఏర్పాటుచేసుకున్న ఈ వ్యాపారం ఎప్పుడైనా దెబ్బతింటుందేమో' అన్న ఆలోచనలు కొద్దిపాటి సుఖం కన్నా వెయ్యిరెట్లు అధికంగా ఆ వ్యక్తి యొక్క ప్రాణాలను పీల్చిపిప్పిచేస్తాయి. అంతేకాదు 'ప్రజలు నన్ను మోసగాడు, దుర్మార్గుడు, కపటి అని అనుకుంటారేమో అప్పుడు ఈ సంపాదించుకున్న పేరు ప్రతిష్ఠలన్నీ మట్టిపాలైపోతాయి కదా. నేను రహస్యంగా దాచుకున్న గుప్తధనం(బ్లాక్‌మనీ) ప్రభుత్వానికి తెలుస్తుందేమో. దొంగలు, దోపిడీగాండ్రు నా ధనాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి తెగబడతారేమో...' మొదలైన ఆలోచనలతో అతడు నిరంతర మానసిక సంఘర్షణకు లోనవు తుంటాడు.

పైన చెప్పినటువంటి భయాలన్నీ ఆ మనిషిని నిరంతరం ఎంత భయంకరంగా వేధిస్తాయంటే అతడికి మంచి రుచికరమైన ఆహారం విషం లాగానూ, హంసతూలికాతల్పం ముళ్ళపాన్పు లాగానూ అనిపిస్తుంటుంది. పైకి కనిపించే తళుకుబెళుకులు, వైభవం, ధనసంపదల వెనుక ఆలోచనల సెగ, అనుమానాల తాలూకా భయం ఎంతగా వేధిస్తుంటాయో దానిని అనుభవించే వాళ్ళే చెప్పగలరు. ఇంకా ఇంకా ఎంతగా ఎక్కువ డబ్బు సంపాదించటమే లక్ష్యంగా పెట్టుకొని దానిని పొందటానికి అనుచితమైన మార్గాలను అనుసరించే వారు పైన చెప్పుకున్నటు వంటి బాధలకు తప్పనిసరిగా గురికావల్సియుంటుంది.

కాబట్టి 'సుఖసంతోషాల కోసం ధనం సంపాదించటం ద్వారా జీవితాన్ని సదుపయోగం చేసుకుంటాము' అని చెప్పే వారి మాట అసత్యమని ఇక్కడ రుజువయింది. పైన చెప్పు కున్నటువంటి ఆలోచనలతో నిండిన బాధలు, వేదన, సమస్యలు మొదలైనవన్నీ 'వాళ్ళ జీవితాన్ని సద్వినియోగం కాదు-దుర్విని యోగం చేసుకున్నారు' అని స్పష్టంగా తెలియజెప్తున్నాయి.

ధనపిపాస ఉన్నవాళ్ళ విషయం వదలివేద్దాం. సాధారణ మానవుల విషయానికి వస్తే వాళ్ళ ధ్యేయం అంతులేని ధనాపేక్ష కోసం ఉండదు కానీ 'ఇంద్రియవాంఛలను తృప్తిపరచటమే సుఖసంతోషాలకు మూలం' అని వాళ్ళు ఆలోచిస్తుంటారు. మంచి భోజనాన్ని, మరింత రుచికరమైన ఆహారమును తినటం, మంచి బట్టలు ధరించటం, ఇంద్రియాలను తృప్తిపరచటం... ఇదే జీవితాన్ని సద్విని యోగం చేసుకొనటంగా వాళ్ళు భావిస్తుంటారు. ఏరోజు దొరికినదాన్ని ఆరోజే శుభ్రంగా తుడుచుకొని తినెయ్యటం, మరునాడు ఏమీ లేకపోతే దొంగతనం చేసో, దోపిడీ చేసో దొరికినదానిని తెచ్చుకొని తినటం-ఆరోజుకు ముగించటం. ఎంత వీలైతే అంత సంపాదించటం, తినటం, త్రాగటం, సరిపెట్టడం... ఇదే వారి జీవనలక్ష్యంగా ఉంటుంది.

ధనసంపాదన ఉన్నవాళ్ళకు ఎదురయ్యేటంత సమస్యలు వీరికి ఉండవు. అంతవరకూ బాగానే ఉంది కానీ వీరికి కూడా కొన్నిరకాలైన బాధలు, సమస్యలు, చిక్కుముళ్ళు ఉంటూనే ఉంటాయి. ఇలాంటి వ్యక్తులు ఈరోజు సంపాదించినదానితో ఇవ్వాళే తిని, త్రాగి, అనుభవించి మొత్తం ఖర్చు చేసేస్తారు. రేపు ఏదైనా జబ్బుచేసినా, ఇంకేదైనా అవసరం వచ్చినా ఇతరుల ముందుకు వెళ్ళి చేతులు చాపుతారు. వినయంగా వాళ్ళ ముందు అర్థిస్తూ నిలబడతారు. అప్పులు తీసుకొచ్చి, వడ్డీలు కట్టీ కట్టీ గిలగిల లాడుతుంటారు. పిల్లలకు బడికి కట్టే రుసుం సమయానికి

**శక్తికి మించి తలపెట్టిన పనులలో తప్పులు జరుగుతాయి**

కట్టకపోవటంతో వాడి పేరు బడినుండి తొలగిస్తారు. ఆడపిల్ల యుక్తవయస్కురాలవుతూంటుంది. చేతిలో చిల్లిగవ్వ ఉండదు. ముసలితనం తరుముకొస్తుంటుంది. దానికోసం ఎలాంటి ఏర్పాటూ చేసుకోలేదు. ఏ వ్యక్తి జీవితమైనా ఈ సమస్యలు చాలవా?

ఇంతేకాకుండా ఇంద్రియలోలుత్వము ఉన్న వ్యక్తి సహజం గానే నియంత్రణారాహిత్యంతో ఉంటాడు. నియంత్రణా రాహిత్యానికీ-ఆరోగ్యానికీ సంబంధం ఉంది. కాబట్టి నియంత్రణ లేని వ్యక్తికి వ్యాధులు త్వరగానే వస్తాయి. రెండు మూడు నెలలపాటు నియంత్రణ ఏమాత్రం లేకుండా ఇంద్రియ వాంఛ లను తృప్తిపరచినట్లయితే అది రెండు మూడు సంవత్సరాలపాటు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అప్పుడు మజా చెయ్యటమే జీవిత ధ్యేయంగా భావించిన వ్యక్తి జీవిత పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో ఊహించ శక్యం కాదు. కొద్దికాలం లోనే శరీరం గుల్లయిపోతుంది. అజీర్ణం, అరుచి మొదలైన రోగాలు పట్టు కుంటాయి. ముఖం ఎండిపోయి అందవికారంగా తయారవు తుంది. కోపం తీవ్రమౌతుంది. చిరాకు, అసహనం మనిషిని క్రుంగ దీస్తుంటాయి. భార్యాబిడ్డలు, కుటుంబసభ్యులు మొదలైన వారందరితోనూ తగాదాలు ఏర్పడుతుంటాయి. ఇలాంటి పరిస్థితులు చూసిన తర్వాత వాళ్ళు జీవితాన్ని సద్విని యోగం చేసుకున్నారనిగానీ లేదా చేసుకుంటున్నారనిగానీ ఎలా భావించగలము?

వాస్తవమేమిటంటే ఈ ప్రకారంగా గడపబడిన ఏ జీవితం కూడా సదుపయోగమైనట్లు కాదు. భౌతికమైన వాంఛలకు, ఇంద్రియాలను సంతృప్తిపరచటానికీ చేసే ప్రయత్నాలను తగ్గించి అదే సమయంలో భగవంతుని వైపు, ఆధ్యాత్మికత వైపు నియోగించాలి. తప్పులు పొరపాట్లతో నిండిన తళుకు బెళుకులతో మెఱిసే ఈ ఇంద్రజాలం వంటి ప్రపంచంలో నిజమైన శాశ్వత మైన సుఖసంతోషాలతో కూడిన ఆధ్యాత్మిక మార్గమే అసలైన సన్మార్గం. దీనికోసం ఎంత సమయం కేటాయిస్తామో ఆ సమయమే సదుపయోగ మైనట్లు లెక్క. మిగిలిన సమయమంతా ప్రాపంచికపు మాయ అనే ఉచ్చులో చిక్కుకొని కరిగిపోతూంటుంది. శోక సంతా పములను, పశ్చాత్తాపాన్నీ మానవులకు మిగులుస్తూంటుంది.

జీవితపు దిజంజాటంలో పడున్నప్పటికీ ఎవరైతే కొంత సమయమైనా ఇటువైపు వెచ్చించగలిగితే వారు ఇతరులకన్నా ఎక్కువ సుఖసంతోషాలతో శాంతిపూర్ణంగా జీవిస్తున్నట్లు మనం చూడగలం. సంసారచక్రంలో పడి అలసిపోతూన్న మానవులకు నిజమైన విశ్రాంతినిచ్చే శీతలచ్ఛాయ ఆధ్యాత్మికం. మిగిలిన సుఖాలు తత్సంబంధిత సాధనోప కరణాలు శోక సంతాపాలనిస్తాయే తప్ప మరేమీ ఇవ్వలేవు.

ధనాన్ని సామాజిక ప్రతిష్ఠగా భావించి మీరు స్వయంగా నాలుగువైపులా ఈ జంజాటాన్ని వ్యాపింపజేసుకుంటున్నారు. నియంత్రణ, నిరాడంబరత, సంతోషాలతో కూడిన జీవితం శోభనిచ్చేదిగా భావిస్తే కనుక ఆధ్యాత్మిక ప్రగతికి ఇంకా ఎంతో సమయాన్ని వెచ్చించగలరు.

అసలైన విషయమేమంటే అధిక శాతం ప్రజలు ఇంద్రియ లోలత్వము, ధనవ్యామోహం, లోకప్రతిష్ఠ.. వీటినే తమ జీవిత లక్ష్యంగా భావిస్తూ తమను తామే గాయపరచు కుంటున్నారు. ఎన్నోరకాలైన పనులలో నిమగ్నమైయున్న ప్పటికీ ఏదైనా ఆకస్మిక సంఘటన జరిగినా అనుకోనిది ఎదురైనా ఆపదల నుండి బయటపడవల్సి వచ్చినా దానికి తగినంత సమయాన్ని కేటాయించగలుగుతున్నప్పుడు ఆధ్యాత్మిక ప్రగతికోసం సమయాన్ని వెచ్చించలేమని చెప్పటం ఎంతవరకూ ఉచితం? ఇంద్రియ లోలత్వమూ, ఇంకా అనేక ఇతర వ్యామోహాలకు ఇచ్చే ప్రాముఖ్యతను మనుష్యులు అన్నింటికన్నా ఉపయుక్తమైన ఆధ్యాత్మికతకు ఇవ్వటం లేదు. ఆధ్యాత్మికత యొక్క ఉపయోగం ఆవశ్యకమైనదీ, మేలైనదీ అని భావించి దానికి ప్రాముఖ్యత నిచ్చినట్లయితే జనుల జీవనంలో అమితమైన దుఃఖాలు వేదనలూ వంటివేవీ ఉండవు. ఆధ్యాత్మికత యొక్క ప్రాముఖ్యతనూ, జీవితాన్ని సదుపయోగం చేసుకొనటం అనే అంశానికి సరియైన అర్థాన్ని బాగా తెలుసున్న వ్యక్తులు ఆనందంగా జీవించ గలరు.

– *అనువాదం: శ్రీమతి కామరాజు కృష్ణకుమారి*

**మనం చేసిన తప్పులు, పాపాల వలన మనస్సు మానసిక రోగాలకు నిలయమవుతుంది**

# పిల్లలను ఆరోగ్యవంతంగా ఎలా ఉంచాలి?

చిన్నపిల్లల ఎదుగుదల స్వాభావికము, సహజము మరియు ప్రాకృతిక క్రమంలో జరుగుతుంది. ఈక్రమంలో ఏవిధమైన అవరోధం వచ్చినా పెరుగుదలకు చెందిన ఈ సహజగతి ఆగిపోతుంది. ఏదైనా వ్యాధి చేత పిల్లవాడి ఆరోగ్యము దెబ్బతింటే దాని దుష్ప్రభావం తప్పకుండా ఆ బాలుడి ఎదుగుదల మీద పడుతుంది. అందువలన పిల్లల యొక్క స్వాభావికమైన, సహజమైన పెరుగుదల కొరకు చక్కని ఆరోగ్యము ఉండాలి అన్న విషయమును కొట్టి పారెయ్యలేము. వారి ఆరోగ్యము పట్ల అవగాహన ఉంచు కుంటూ మంచి చెడులను గమనిస్తూ చూడాల్సిన అవసరము ఉంది. పిల్లల ఆరోగ్యమునకు సంబంధించిన సాధారణ అవగాహనతో పాటు రోజూవారి పాటించవల్సిన నియమాలు తెలియకపోవటం చేత లేదా వారిని నిర్లక్ష్యము చెయ్యటం వలన పిల్లల ఆరోగ్యము పాడవుతుంది. సమయానికి అవసరమైన చికిత్స అందకపోతే వ్యాధి ఇంకా ముదిరిపో తుంది. దానితో సహజమైన ఎదుగుదల కుంటుపడుతుంది.

పసితనంలో పిల్లవాడు అమాయకంగా ఉంటాడు. వాడికి తనంతటతాను ఆహారం స్వీకరించడం, నీళ్ళు త్రాగటం, శుభ్రంగా ఉండటం వంటి పనులు చేసుకోవటం రాదు. ఈ పసిప్రాయంలో స్నానపానాదులు మొదలుకొని ఆరోగ్యం వరకు సమస్తము స్వయంగా బాలుని తల్లే చూసు కోవాల్సి ఉంటుంది. ఒకవేళ తల్లికే పసిబిడ్డ ఆరోగ్యమునకు– ఎదుగుదలకు సంబంధించిన సాధారణ పరిజ్ఞానము లేక పోతే ఇక అప్పుడు పరిస్థితి దారుణంగా ఉంటుంది.

పసివాడి ఆరోగ్యము దెబ్బతింటే దాని ప్రభావం కేవలం ఆ పిల్లవాడి మీద మాత్రమే కాక మొత్తం కుటుంబ వాతావర ణము మీద పడకుండా ఉండదు. పాపం ఆ పిల్లవాడు శారీరిక బాధను ఎటూ సహించాల్సి వస్తుంది. దానికితోడు వైద్యానికి డబ్బులు కూడా ఖర్చవుతాయి. ఒకవేళ బాలుడు అనారోగ్యంతోను – అవికసితంగానూ ఉంటే కనుక తల్లి దండ్రులు సైతం తీవ్ర మనోవేదనకు గురవుతారు. ఇలాంటి గడ్డు పరిస్థితులలో జీవనోపాధిని ప్రక్కనపెట్టి పసివాడి బాగోగులు చూస్తూ వైద్యం చేయించటంలోనే కాలాన్ని గడపాల్సివస్తుంది. అందుచేత కుటుంబంలో సదా సుఖం, శాంతి వెల్లివిరియటం కోసం పిల్లలను ఆరోగ్యవంతులుగా ఉంచటానికి అలాగే వారి వికాసం కూడా సరైన పద్ధతిలో సాగటానికిగాను తల్లి వారిమీద ఎక్కువ దృష్టిపెట్టాలి. పెద్ద రోగాలను తగ్గించటం అనేది అంత సహజమైన పద్ధతిలో సాగే మామూలు విషయం కాదు. కానీ చిన్నాపొన్నా రోగాలు రాకుండా చూస్తూ – ప్రాకృతిక ఎదుగుదల జరగటానికి వీలుగా తల్లి కొంతమేరకు అవగాహన కలిగి యుంటే దాని ఆధారంగా ఆమె తన బిడ్డను ఆరోగ్యంతో తొణికిస లాడేటట్లు ఉంచగలుగుతుంది. ఎంతకాలం వరకు బాలుడు తన గురించి తాను జాగ్రత్త తీసుకోలేడో, బాధ్యత గుర్తించలేడో అంతవరకు తల్లి యొక్క సంరక్షణ, ఆలనాపాలనా తప్పకుండా అవసరమవుతాయి.

పాలుత్రాగే పసిప్రాయంలో బిడ్డకు తల్లి పాలే శ్రేష్ఠం. తల్లి పాలతో చిన్నవాడి శారీరిక, మానసిక వికాసం సరైన పద్ధతిలో సాగుతుంది. ఒకవేళ తల్లి అనారోగ్యంతో బాధపడు తుంటే బిడ్డకు పాలివ్వకూడదు. పసివాడికి నెలలు నిండి పెద్దవుతున్నకొద్దీ ఆయా ఋతువులలో లభించే పండ్ల యొక్క రసాలను పరిస్థితులను బట్టి త్రాగిస్తే బిడ్డకు ఆవశ్యకమైన పోషకతత్త్వములన్నీ అందించబడతాయి. **కొంతమంది తల్లులు పిల్లవాడికి మంచినీళ్ళు పట్టడం హానికరమని అనుకుంటారు. అదేం లేదు. మధ్యమధ్యలో పసివాడి చేత కాస్తకాస్తగా మంచి నీళ్ళు త్రాగించడం పిల్లవాడి ఆరోగ్యము నకు మేలు కలిగిస్తుంది.** చిన్నవయస్సులోనే బిడ్డకు అన్నంతో చేసిన ఆహారపదార్థములను తినిపిస్తే అది బిడ్డ ఆరోగ్యము నకు చేటుచేస్తుంది. చిన్నారి యొక్క ప్రేగులు బలపడనంత వరకు వేళాపాళాలేకుండా ఎప్పుడు పడితే అప్పుడు అధిక మోతాదులో అన్నాహారమును తినిపించకుండా ఉండటమే

**యువత దేశం పట్ల తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలి**

మేలు. అలా తినిపిస్తే కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయి. పౌష్టికత పేరిట మందులను ఇవ్వటం కూడా మంచిది కాదు. దీనికంటే **నిత్యమూ తేనె కలిపిన నీటిని త్రాగించటం మంచిది.** ఇది ఆరోగ్యవర్ధకము కూడా! పిల్ల వాడి పొట్ట శుభ్రపడుతుంది. పైగా శరీరం రోగం బారిన పడదు. పిల్లలకు ఏది తినిపించినా, త్రాగించినా అది శుభ్రంగా–తాజాగా ఉండాలి. లేకపోతే లాభానికి బదులు నష్టమే ఎక్కువ జరుగు తుంది.

**స్వచ్ఛమైన గాలి వచ్చే చోట తిప్పాలి:** నులివెచ్చని ఎండలో పిల్లలను ఆడుకోనివ్వాలి. ఇది పిల్లల స్వస్థతకు ఎంతో హితకరం. పిల్లల వయస్సును బట్టి ఉదయం–సాయంత్రం వేళల్లో నిద్రపుచ్చటం, షికారుకు తీసికెళ్ళటం, ఆటలు ఆడించటం వంటివి ఎంతో ప్రయోజనకరమైన ఫలితాలనిస్తాయి. అలాచేయటం వలన ఆరోగ్యమును పెంచే ప్రాతః సాయం సంధ్యాకాల సూర్యకిరణాలు పిల్లల మీద ప్రసరింపబడతాయి. పరిశుభ్రమైన గాలి, లేతఎండ ఆరోగ్య మునకు ఔషధి వలె గుణకారకమైనవి. ఇవి సోకటం వలన శరీరం ఎదుగుదల బావుంటుంది. పోషణకు కావల్సిన శక్తి లభిస్తుంది. అంతే కాకుండా చర్మరోగాలు వచ్చే అవకాశం ఉండదు. బారెడు పొద్దెక్కాక వచ్చే ఎండ పిల్లలకు హాని కలిగిస్తుంది.

పిల్లలకు ఋతువుననుసరించి బట్టలను ధరింపజెయ్యాలి. మెత్తని, శుభ్రమైన బట్టలనే తొడగాలి. మాసిపోయిన, బిగుతుగా ఉన్న బట్టలు ఆరోగ్యమును పాడుచేస్తాయి. ఇలాంటి బట్టలు వేస్తే పిల్లలలో సహజమైన ఎదుగుదల ఆగిపోతుంది. బిగుతైన బట్టలను వెయ్యటం చేత శరీరములో సన్నని రక్తనాళముల మీద ఒత్తిడి పడి రక్తప్రసరణలో అంతరాయం ఏర్పడుతుంది. చర్మం పెళుసుబారుతుంది.

**వాళ్ళంతట వాళ్ళను ఆడుకోనివ్వాలి:** ఒక్కొక్కసారి చాలా సార్లు స్నానం చేయించాల్సివస్తుంది. కాళ్ళుచేతులు కడగాల్సి ఉంటుంది, బట్టలు పాడైపోతే ఉతకాల్సివస్తుంది అనే భయంతో పిల్లలను వాళ్ళంతట వాళ్ళే నేల మీద హాయిగా ఆడుకోకుండా అడ్డుపడటం, ఎప్పుడూ బిడ్డను ఎత్తుకుని తిరగటం అన్నవి ఆధునిక సభ్యతకు గుర్తు అని అనుకుంటు న్నారు ఈకాలం మహిళలు. ఇది తప్పు అభిప్రాయము. **మట్టి స్పర్శను పొందుతూ ఆడుతూ–తిరుగుతూ ఉంటే 'చర్మం దృఢంగానూ, శరీరం పుష్టి గానూ అవటంతోపాటు పెరుగుదల బాగుంటుంది.** రోజంతా ఎత్తుకుని తిప్పటం చేత బిడ్డ శరీరంలోని అవయవములు ఎదుగుదలకు అవసరమైన రీతిలో చక్కని కదలికలు–స్పందనలు లేకుండా ఎక్కడివక్కడ చలనం లేకుండా ఉండి పోతాయి. పైగా పిల్ల వాడు తాను తనంతట తాను ఆడుకోవా లని తహతహలాడు తుంటాడు. దానికి కూడా ఇది గొడ్డలిపెట్టు. అందుకని పిల్లలను వాళ్ళనే ఆడుకోనివ్వటం మంచిది.

మట్టి–దుమ్ములో ఆడుకోవటం వలన పిల్లవాడికి మంచి వ్యాయామం కూడా జరుగుతుంది. రోజంతా పరుగులు, ఉరుకులు పెడుతూ తనకు తాను స్వంతంగా ఆడుకోవటంతో రాత్రయ్యే సరికి గాఢనిద్ర వచ్చి పిల్లవాడు హాయిగా ఆదమరచి నిద్రపోతాడు. ఎందుకంటే అలా ఆడుకోవటం వల్ల శరీరంలోని మాలిన్య మంతా చెమటరూపంలో బయటకుపోతుంది. అన్నం బాగా అరుగుతుంది. పిల్లలను వాళ్ళకుగా వాళ్ళను ఆడుకోనివ్వకపోతే తిన్న ఆహారం జీర్ణమవదు. రాత్రికి మంచి నిద్ర కూడా రాదు. ఈ రెంటి లేమి బిడ్డ ఆరోగ్యం మీద చెడు ప్రభావమును చూపిస్తుంది.

**కలసిమెలసి ఉండాలనే భావన పెరగాలి :** పిల్లలు అలా అలా పెరుగుతున్నకొద్దీ వారితో ఆడుకోవటానికి సాటి పిల్లలు అవసరమౌతారు. ఇంట్లోని నాలుగు గోడల మధ్యకే పరిమితమవ్వటానికి వారు ఇష్టపడరు. ఇరుగుపొరుగున ఉన్న తోటి పిల్లలతో ఆడుకోవాలనే వారి ఉబలాటాన్ని అణచి వేయటం అంటే అది ఇక పిల్లల్లో కలసిమెలసి బతకాలనే భావన, సామాజిక స్పృహ అనే ప్రవృత్తి పెరగకుండా వారికి ఒక అడ్డుకట్ట వేసి ఆపడమే అవుతుంది. పిల్లల తినే, త్రాగే పదార్థములకు సంబంధించి వారిలో ఏమైనా దురలవాట్లు వచ్చి చేరుతున్నాయా? లేక ఇదివరకటి లాగానే ఉన్నారా? అని తెలుసుకునేందుకు అప్పుడప్పుడు ఇంటి బయట వారు ఆడుకుంటున్న చోటుకు వెళ్ళి గమనిస్తూ ఉండాలి. కేవలం

**మానసిక ఒత్తిడి రకరకాల రోగాలను ఉత్పన్నం చేస్తుంది**

బయట మాత్రమే కాదు ఇంట్లో ఉన్నప్పుడు కూడా ఆహార పానీయాలకు సంబంధించి, ఆటపాటలు అలాగే నిద్రకు సంబంధించిన అలవాట్ల మీద ఎప్పుడూ ఓ కన్నేసి ఉండటం ఎంతో అవసరము. అన్నం తిన్న వెంటనే ఆడుకోవటం, పరి గెత్తడం, తిట్టడం, విసుక్కోవటం, విరగ్గొట్టడం, ముక్కలు చెయ్యటం వంటి అలవాట్లు చూడటానికి చిన్నవిగానే కనిపిస్తాయి. కానీ వీటివల్ల ఎంత నష్టం వాటిల్లుతుంది అనేది పోనుపోను తెలుస్తుంది.

పిల్లల ఆలనా పాలనా చూడటంతో పాటు పైన చెప్పిన విషయములలోని మంచిని, గొప్పతనాన్ని వారికి అర్థమయ్యేలా చెపుతూ ఉండాలి. ఎందుకంటే వారు తమ భావి జీవితంలో వాటి ప్రాధాన్యతను తెలుసుకుని ఆచరణలో పెట్టుకోవాలి కనుక. ఇల్లు, కుటుంబానికి చెందిన ఇతర పనుల వలెనే పసి వారి పాలన-పోషణ మరియు ఆరోగ్యము పట్ల దృష్టి పెట్టడం, పిల్లలను గురించిన పూర్తి అవగాహన ఎంతగానో ఉండటం అన్నది తల్లికి సంబంధించినంతవరకు ఎంతో ప్రాముఖ్యత గల అంశం. పైన చెప్పిన విషయాల మీద సరిగా దృష్టినుంచినచో పిల్లల ఆరోగ్యము మరియు సహజమైన ఎదుగుదలలో చాలామటుకు సహజత్వం తొణికిసలాడుతుంది.

– *అనువాదం: శ్రీమతి లక్కరాజు లక్ష్మీరాజగోపాలు*

## అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞ కార్యక్రమ వివరములు

2018 జనవరి 5 నుంచి 8 తేదీలలో మంగళగిరి పట్టణం నందు ఉన్న ఎన్.ఆర్.ఐ. వైద్యకళాశాల, ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించబడనున్న అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం కార్యక్రమ పూర్తి వివరాలు.

**5 జనవరి 2018 శుక్రవారం**

| | |
|---|---|
| మ॥ 2 గం॥ | పదకొండువేల కలశాలు, వివిధ ధార్మిక ఇతివృత్తాల కలిగిన ప్రదర్శనలతోపాటు, మంగళ శోభాయాత్ర |
| సా॥ 5 గం॥ | పరమపూజ్య గురుదేవుల పండిత శ్రీరామశర్మ ఆచార్యవారి జీవితం, మరియు సాహిత్యాల మీద ఏర్పాటు చేసిన ప్రదర్శనశాల ప్రారంభోత్సవం ఆదరణీయ డా॥ ప్రణవ్ పండ్యా గారు & శైలాబాలా పండ్యాగార్ల దివ్య కర కమలములచే |
| సా॥ 6 గం॥ | సాంస్కృతిక కార్యక్రమాలు |

**6 జనవరి 2018 శనివారం**

| | |
|---|---|
| ఉ॥ 7.30 గం॥ | అశ్వమేధిక దేవపూజనం / అశ్వమేధిక వైదిక యజ్ఞం |
| సా॥ 5 గం॥ | సంగీత విభావరితోపాటు మహాత్ముల దివ్య ప్రసంగాలు |

**7 జనవరి 2018 ఆదివారం**

| | |
|---|---|
| ఉ॥ 7.30 గం॥ | అశ్వమేధిక వైదిక యజ్ఞం / షోడశ సంస్కారాలు |
| ఉ॥ 9.30 గం॥ | గాయత్రీ మహామంత్ర దీక్ష – గౌ॥ శ్రీమతి శైలాబాలపండ్యా మరియు డా॥ ప్రణవ్ పండ్యాగారి సముఖం నుంచి |
| సా॥ 5 గం॥ | దివ్య సంగీతంతోపాటు మహాత్ముల విశేష ప్రసంగాలు & గౌరవనీయులైన డా॥ ప్రణవ్ పండ్యాగారు, శ్రీమతి శైలా బాల పండ్యాగారిచే |
| సా॥ 7 గం॥ | 24,000 దీపాలతో దీపమహాయజ్ఞం |

**8 జనవరి 2018 సోమవారం**

| | |
|---|---|
| ఉ॥ 7.30 గం॥ | అశ్వమేధిక వైదిక యజ్ఞం / షోడశ సంస్కారాలు |
| ఉ॥ 9.30 గం॥ | గాయత్రీ మంత్ర దీక్ష గౌ॥ శ్రీమతి శైలా బాల పండ్యాగారు మరియు డా॥ ప్రణవ్ పండ్యా గార్ల సముఖం నుంచి |
| మ॥ 1 గం॥ | మహాపూర్ణాహుతి / దేవతలకు వీడ్కోలు |

**చేసే పనులు ఆనందంగా చేయాలి**

# అనుభూతినుండి వచ్చినదే జ్ఞానము

జ్ఞానము మానవ జీవితములో ఆచరణలోకి వచ్చినప్పుడే సార్థకమవుతుంది. ఒకవేళ మన జ్ఞానం ఆలోచ నల వరకే పరిమితమై అనుభూతిలోకి రాకున్నచో అటువంటి జ్ఞానము వల్ల ఎట్టి లాభమూ ఉండబోదు. కొంతమంది మనుష్యులు వ్యావహారిక జ్ఞానమును పొందేబదులు అనేక పుస్తకాలను చదువుతూ ఉంటారు కానీ చెప్పబడిన విషయ మును సరిగ్గా ఆకళింపుజేసుకొనలేరు. ఎందుకంటే ఆ జ్ఞాన మును క్రియ రూపంలోకి తేలేదు కనుక. శాస్త్రములు, గ్రంథములు, పుస్తకాలు కేవలం మనకి ముందుకెళ్ళటానికి మార్గమును చూపిస్తాయి. ఒక్కసారి సరైన త్రోవను తెలుసుకుంటే కనుక ఇక శాస్త్రములు, పుస్తకముల పరిజ్ఞానము అజాగళ స్తనము వలె నిరుపయోగము. ఎందుకనగా ఇక ఆ దారిలో నడుస్తూ ముందుకుసాగటము ఒక్కటే మిగిలి ఉన్నది.

ఈ సందర్భములో ఒక కథా సారాంశము చెప్పటం జరుగుతుంది. ఒకసారి ఒక వ్యక్తికి తన స్వగ్రామం నుండి ఒక ఉత్తరం అందింది. అతని బంధువులకు ఇక్కడినుండి కొన్ని వస్తువులు కానుకగా పంపాలి అన్న విషయము అందులో వ్రాయబడి ఉంది. అతను 'వస్తువులు కొనేముందు మళ్ళీ ఒక్కసారి ఆ ఉత్తరాన్ని చదివితే అందులో వ్రాయబడిన వస్తువులను సరిగ్గా కొనగలను కదా' అని అనుకున్నాడు. ఆ ఉత్తరం ఎక్కడ పెట్టాడో అతనికి ఓపట్టాన దొరకలేదు, కనిపించలేదు. అతను గాబరాపడి ఉత్తరం కోసం మళ్ళీ వెతకడం మొదలెట్టాడు. కొంతసేపు వెతికిన మీదట ఆ వ్యక్తికి ఉత్తరం దొరికింది.

'5 కిలోలు బర్ఫీ – ఒక డజను పెద్దనారింజకాయలు – 8 ధోవతులు మరియు ఫలానా ఫలానా సామాన్లు పంప గలరు' అని దానిలో వ్రాసుంది. ఆ వస్తువులు ఏమిటో తెలుసుకున్న తరువాత ఇక అతనికి ఆ ఉత్తరంతో పనిలేదు. అతను ఆ ఉత్తరాన్ని ఇంటివద్దే ఉంచి ఆ వస్తువులను సేకరించేందుకు వెళ్ళిపోయాడు. ఈరకంగా చూసినప్పుడు ఆ ఉత్తరం యొక్క ప్రయోజనం అతనికి అందులో చెప్పబడిన సామాన్లు ఏమిటి అనేది తెలిసేంతవరకే! ఒకసారి ఆ జాబులో వ్రాయబడిన విషయమును ఆకళింపుజేసుకున్న తరువాత ఇక అతనికి ఆ ఉత్తరంతో ఏ అవసరమూ లేదు.

ఈవిధంగానే శాస్త్రములు, గ్రంథాలు మరియు పుస్తకా లలో ఈశ్వరుని వద్దకు చేరే మార్గము చెప్పబడి ఉంటుంది. అలాగే జీవితంలో ప్రగతిని ఎలా సాధించటం, సాధన చేసే ప్రక్రియ, విధివిధానము వర్ణించబడి ఉంటుంది. వాటిని చదివి అవగాహన చేసుకోవటం వరకు సబబే కానీ దాన్ని మన జీవితంలో, నడవడికలో క్రియాన్వితం చేయనంత వరకు ఆ చెప్పబడిన విషయముల యొక్క విశేష ప్రభావం మన జీవితం మీదమాత్రం ఉండబోదు. దర్శనం, న్యాయము, వ్యాకరణము మున్నగు శాస్త్రములన్నీ తాము అందించిన జ్ఞానమును మనం అనుభవంలోకి తెచ్చుకోనంతవరకు తమ లాభమును మనిషికి అందించలేవు అంటే వాటి ద్వారా మనిషి లాభమును పొంద లేదు.

ఒకే విషయమును పలు పుస్తకాలలో రకరకాల కోణాలలో చదవటంతో మనస్సు భ్రమకు లోనవుతుంది. ఐతే అందులో చెప్పబడిన విషయమును అనుభూతిలోకి తెచ్చుకుంటే ఆ జ్ఞానమే నిజమైన జ్ఞానం అవుతుంది. ఇక అప్పుడు మనం ఆ పొందిన అనుభవాన్నే అనేకరకాలుగా అభివ్యక్తీకరించగలం. దానిగురించి విస్తారంగా వ్యాఖ్య చెయ్యగలం. ఎప్పటివరకైతే మనం ఆ జ్ఞానమును అనుభూతి లోకి తెచ్చుకోలేమో అప్పటివరకు మనస్సులో దానిపట్ల సందేహము, సంశయము మరియు ప్రశ్న తలెత్తుతూనే ఉంటుంది. సుప్రసిద్ధ సన్యాసి శ్రీశ్రీరామకృష్ణ పరమహంసకు పుస్తకజ్ఞానం లేదు. కానీ ఆయనది అనుభవంతో వచ్చిన జ్ఞానం. అందుచేత నిగూఢ ఆధ్యాత్మిక జ్ఞానం గురించిన

**ఇష్టంతో చేస్తే ఏ పని కష్టం కాదు**

విషయములను సైతం రోజువారి జరిగే సంఘటనల నుండి ఉదహరిస్తూ చాలా సరళమైన పద్ధతిలో అర్థమయ్యేటట్లు బోధించేవారు. కబీరుదాసు కూడా ఈ కోవలోకే వస్తాడు.

జ్ఞానవృద్ధికి పఠనం కంటే శ్రవణం చాలా మంచిది. వినటం కంటే కూడా వీక్షించటం లేదా అనుభూతి చెందటం మరింత మెరుగైన పద్ధతి అని పెద్దలు చెబుతూంటారు. ఉదా॥ స్వయంగా చదువుకునే బదులు అనుభవం కలిగిన ఆచార్యుని ముఖతః సత్యమును గూర్చి శ్రవణం చేయటమే శ్రేష్ఠము. ఎందుకంటే ఆయనకు ఆ విషయమును గురించి లోతైన ఆకళింపు ఉంటుంది. స్వయంగా సత్యానుభూతిని పొందటం దీనికంటే కూడా మరింత ఉత్తమము. ఎందు కనగా ప్రత్యక్షంగా దర్శించినచో అనుమానము లేదా సందేహము ఉండే పరిస్థితి తొలగిపోతుంది.

ఒకవేళ ఎవరైనా వ్యక్తి కాశీపట్టణం గురించి కేవలం పఠించటం వరకే పరిమితమైతే అలా చదువుతున్నంత మాత్రాన అతనికి కాశీ గురించిన జ్ఞానం కలుగబోదు. ఐతే ఎవరైనా కాశీ వెళ్ళివచ్చిన వ్యక్తి నోటి నుండి ఆ కాశీపురి గురించి వినటమే మేలైన పద్ధతి. అన్నింటికన్న ఉత్తమం ఏదంటే స్వయంగా కాశీనగరం వెళ్ళి అంతా తిరిగి దర్శించటం. ఇలా స్వయంగా తానుగా వెళ్ళిరావటమే అనుభవజన్యజ్ఞానం.

ఏ వ్యక్తియైతే ఈనోటా ఆనోటా విన్న విషయముల బరువును మోస్తూ ఉండడో, ఎవరి మనస్సైతే పరుల నుండి సేకరించిన ఆలోచనతో నిండి ఉండదో ఆ వ్యక్తి ఆత్మ జ్ఞానము నకు అధికారి కాగలడు. ఎవరైతే విషయాసక్తి కలిగి ఉంటాడో ఆతని మనస్సు అతనిని వ్యర్థమైన తర్క వితర్కాలు చేయటంలో నిమగ్నమయ్యేలా చేస్తుంది. ఈ కారణంగా అతను సత్యానికి దూరమైపోతాడు. పుస్తకాలు మరియు శాస్త్రములను చదవటం వల్ల దానికుండే గొప్ప లాభం దానికుంది. ఎందుకంటే ఒకవేళ స్వాధ్యాయపరంపరే లేకపోతే సత్యమును తెలుసుకోవాలనే జిజ్ఞాస ఎన్నటికి పుట్టదు. దీనితోపాటు పుస్తకాలలో లిఖించబడిన వాక్యాలను చదవటం వరకే జీవితాన్ని కుదింప జేసుకోవటం అంటే తనను తాను శాశ్వత సత్యానుభూతి నుండి దూరం చేసుకోవటంతో సమానం అన్నది కూడా నిజం. ఇందువల్ల మనం తప్పకుండా స్వాధ్యాయం చెయ్యాలి. దానికి తోడు శాస్త్రములలో ఇవ్వబడిన శిక్షణ(విద్య)లను అనుభూతులుగా మార్చుకునే ప్రయత్నం చెయ్యాలి. ఎందుకంటే అనుభవం నుండి పుట్టిన జ్ఞానమే పరమసత్యమని చెప్పబడుతుంది.

*– అనువాదం: శ్రీమతి లక్కరాజు లక్ష్మీరాజగోపాల్*

## విప్లవ వనిత దుర్గాదేవి

*భగవతిచరణ్ బోహరా బాంబును తయారుచేస్తూ ఉండగా లాహోరులో మరణించారు. ఆయన జీవించి ఉన్న కాలంలోనే అశిక్షితురాలైన భార్యను బాగా చదివించాడు. ఆమె ఉపాధ్యాయ వృత్తి చేపట్టింది. కానీ ఆ భార్య భర్తలిద్దరిలో ఎవరు మిగిలితే వారు విప్లవవీరుల సముదాయం కోసం పనిచేయాలని ప్రతిజ్ఞ చేసుకొన్నారు. అందువల్ల బోహరా మరణానంతరం దుర్గాదేవి తన కర్తవ్యాన్ని పూర్తి సమర్పణతో నిర్వహించింది, విప్లవ వీరులు ఈమె వద్ద ఆశ్రయాన్ని పొందేవారు. అస్త్ర శస్త్రాలను పదిలంగా దాచిపెట్టటం, సమాచారాలను అందించటం వంటి అనేక పనులకు ఈమె ఇంటిని వారు కేంద్రంగా చేసుకొనేవారు. స్త్రీ అయి ఉండి కూడా ఈమె పురుషుల కంటే అధిక సాహసాన్ని, సమయ స్ఫూర్తిని, తెలివితేటలను ప్రదర్శించేది. పిరికివాళ్ళు, అబలలుగా చేతకాని వాళ్ళుగా జీవించే మహిళలు ఈమె ముందు సిగ్గుతో తలవంచు కునేటట్లు జీవించి వేలాది మంది ప్రభావితులను చేసింది. స్త్రీ అబలకాదు ఆదిశక్తి అని నిరూపించింది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**మానవత్వానికి సముచితస్థానం, గౌరవం లభించాలి**

# మనం సదాలోచనలకు కేంద్రం కావాలి

మనిషి జీవితానికి, ఆలోచనలకి ప్రగాఢమైన సంబంధం ఉంది. మనిషి కావాలనుకున్నా, వద్దనుకున్నా ఆలోచనలు వస్తూనే ఉంటాయి. ఏ ఆలోచనల మీద ఎక్కువ ధ్యాస పెడతాడో అవే ఆలోచనలు మళ్ళీ మళ్ళీ వస్తూంటాయి. మనిషి ప్రవృత్తిని బట్టి ఆలోచనలు వస్తాయి. ఏ పనైనా చేయాలనే ప్రేరణనిచ్చేవి ఆలోచనలే, ఏమీ చేయనివ్వకుండా బద్ధకస్తుడిగా మార్చేవీ ఆలోచనలే. ఏ ఆలోచనలతో సామీప్యం పెంచుకుంటే, అతని వ్యక్తిత్వం కూడా అలాగే మారుతుంది.

ఆలోచనలను ఓక్ వృక్షంతో పోలుస్తారు. ప్రతి సంవత్సరం లెక్కలేనన్ని పళ్ళు కాస్తాయి, అలాగే మనిషి మెదడులో కూడా లెక్క లేనన్ని ఆలోచనలు వస్తూంటాయి. ఆ కాయలన్నీ విత్తనాలై, వాటిలో ప్రతీదీ మొలకెత్తి వృక్షమైతే కొన్ని సంవత్సరాలలోనే భూమి అంతా ఓక్ చెట్లతో నిండి పోతుంది. కాని అలా జరగదు. వాటిలో చాలా కాయలు పక్షులు తినేస్తాయి. మిగిలినవి సారం లేని గట్టి నేల మీద పడతాయి. ఆలోచనల పరిస్థితి కూడా అంతే. వేల ఆలోచనలలో ఒకటో రెండో మాత్రమే మొలకెత్తగలుగు తాయి. మిగిలినవన్నీ పనికిరానివే.

ఆలోచనలు నశ్వరమైనవి. అంటే అవి పుడతాయి, మన గుప్పెట్లో బంధించకపోతే తొందరగా చెరిగిపోతాయి. గుప్పెట్లో బంధించిన వెంటనే ఉత్పత్తిదాయకంగా మారి పోతాయి. లేకపోతే వాటికే విలువ లేదు. గుప్పెట్లో బంధించడం అంటే ఆ ఆలోచనని వెంటనే అంటిపెట్టు కోవడం. అందుకే అంటారు, మంచి ఆలోచన వస్తే వెంటనే అమలుచేయాలి అని. 'వచ్చిన ఆలోచనలను గ్రహించి, వాటిని అమలుపరిచే సామర్థ్యాన్నే విద్వత్తు అంటారు', అని ప్రఖ్యాత ఆఫ్రికా రచయిత్రి ఎలిస్ వాకర్.

ఆలోచనలను అమలు చేయాలి అంటే, వాటిని ముందు గ్రహించి, వాటి బాగోగులు చూసుకుని, అవి పుష్పించేలా చూసి, ఆ తరువాత మానవత్వానికి పనికొచ్చే విధంగా ఉపయోగించడం. ఆలోచనలే రాని మనిషి ఉండడు. కాని ఏదో ఒక ఆలోచనను లక్ష్యంగా చేసుకుని, దాన్ని సాధించిన వారే విజయవంతులు అయ్యారు. తమ జీవితాలలో సదాలోచనలను సాకారం చేసుకుని, అందరికీ మంచి ఆలోచనలను పంచినవారే మహామానవులు అయ్యారు.

ఆలోచనలు సకారాత్మకమైనవి కావచ్చు, నకారాత్మక మైనవి కావచ్చు. సకారాత్మకమైనవి మంగళకరమైన భావాలతో సంబంధం పెట్టుకుంటాయి. నకారాత్మకమైనవి అమంగళకరమైన భావాలతో పెట్టుకుంటాయి. అందుకే ఆలోచనలను గ్రహించిన వెంటనే మనలోని భావాలు వాటితో సంబంధం పెట్టుకుని మనల్ని ప్రభావితులను చేస్తాయి. మనిషికి ఆలోచించి, అనుభూతి చెంది, భావాలను వ్యక్తపరిచే అద్భుత సామర్థ్యం ఉంది. మనిషి గనక ప్రావీణ్యంతో ఆలోచనలను నిర్వహించడం నేర్చుకుంటే, తన చైతన్యంలోని కొత్త కోణాల్లోకి ప్రవేశించగలడు. కాని అందుకు చాలా చురుకుగా, అప్రమత్తంగా ఉండాలి. చాలా మంది తమ ఆలోచనలను పట్టించుకోకుండా విచ్చలవిడిగా వదిలేస్తూంటారు.

వేగంగా పోతున్న బండికి బ్రేక్ వేయకపోతే దుర్ఘటన సంభవించినట్లే నియంత్రణ లేని ఆలోచనలు కూడా మనిషిని విక్షిప్తం చేస్తాయి. అటువంటి వారిలో ఆలోచనలు అదుపు లేకుండా వస్తూనే ఉంటాయి. వాటిని వారు గ్రహించనూ లేరు, ఒకదానితో మరొకదానికి సామరస్యాన్ని చూడలేరు. వారి ఆలోచనలు అస్పష్టంగా ఉంటాయి కాబట్టే, వారు వాటిని వ్యక్తపరచలేరు. అవతలి వారి ఆలోచనలను అర్థం చేసుకోలేరు. అలా కాకుండా, మహామానవుల మెదడు పరిపక్వంగా ఉంటుంది. గొప్ప మనసున్నవారి ఆలోచనలు చాలా స్పష్టంగా, సువ్యవస్థితంగా ఉంటాయి. వారి ప్రతి

**మానవీయ సద్గుణాలే గొప్పవని గుర్తించాలి**

ఆలోచన, ఇతర ఆలోచనలతో గట్టి సంబంధం ఉంటుంది. వారి ఆలోచనలను ఇతరులకు చేర్చి, వారి ఆలోచనలను స్పష్టంగా అర్థం చేసుకోగల సామర్థ్యం వారికి ఉంటుంది.

ఎక్కువగా ఆలోచించడం అనేది ఎక్కువగా తినడంతో సమానం అంటారు నిపుణులు. ఎక్కువగా తినడం వల్ల కడుపు గడబిడగా అయిన్నట్టే, ఎక్కువగా ఆలోచించడం వల్ల మనసు భారమవుతుంది. తేలికగా అనిపించదు. అలా కాకుండా కొన్నింటినే గంభీరంగా ఆలోచించడాన్ని మననం అంటారు. అలా చేయడం వల్ల ఆలోచనలను జీర్ణం చేసుకుని, అవలంభించుకోవడానికి సహాయకారిగా ఉంటుంది.

చాలా మంది ఇతరుల ఆలోచనలను చదువుతారు, వింటారు, బట్టీపడతారు, తరువాత వాటిని అలాగే అప్ప చెబుతారు. చివరికి మరచిపోతారు. ఎందుకంటే వారు వాటిని అవలంభించుకోలేదు కాబట్టి. ఆలోచనలను ఊరికే బట్టిపట్టి, అప్ప చెప్పడం కూడా మనిషి వికాసానికి అడ్డే.

"ఆదర్శవంతమైన ఆలోచనలలోనే మనిషి యొక్క ఆత్మ ప్రతిబింబిస్తుంది." అంటారు యుగఋషి పరమపూజ్య గురువు గారు. మన గ్రంథాల్లో, సాహిత్యాల్లో సదాలోచనల గని నిండి ఉంది. వాటిని మనం ఊరికే చదివి వదిలేస్తే అవి మనకి ఏ మాత్రం మంచి చేయలేవు. ఆలోచనలు మన మనసులో – మెదడులో పాతుకుపోయి, మన జీవితా లలో భాగమైతే తప్ప వాటికి సార్థకత లేదు. కాబట్టి మనం జీవితంలో ఆలోచనలను గుర్తుపట్టడం నేర్చుకోవాలి, సదాలో చనలను గ్రహించి, వాటికి ఆశ్రయాన్నివ్వడం నేర్చుకోవాలి. అప్పుడు మన మనస్సు కూడా సదాలోచనలకు కేంద్రం అవుతుంది. అప్పుడు వాటిని మన జీవితాలలో సాకారం చేసుకోగలం.

*– అఖండజ్యోతి, ఆగస్టు 2017*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

---

## ఊర్మిళ

*శ్రీనగర్-కాశ్మీర్‌లో జన్మించిన ఊర్మిళ ఒక ధనవంతుని కుమార్తె. ఆమె చదువుకొంటూ చదువురాని వారిని చదివిస్తూ బాల్యంలోనే మహిళల అభ్యున్నతికి పాటుపడింది. యుక్తయవస్కురాలైన ఈమెను ధర్మేంద్రనాథ్ శాస్త్రికి ఇచ్చి వివాహం చేశారు. ఊర్మిళ కూడా విద్యాధికురాలు కావటం వలన అధ్యాపక వృత్తిని స్వీకరించింది. గృహకృత్యాల అనంతరం భర్తతో కలసి సమాజసేవలో పాల్గొంటూ స్త్రీ జనోద్ధరణకు ఎక్కువ కృషి చేసేది.*

*30వ సంవత్సరంలో స్వాతంత్ర్య సంగ్రామం ఆరంభమైంది. దానిని ముందుకు నడిపించటంలో ఊర్మిళ పూర్తిగా నిమగ్నమైంది. ఆ విధంగా ఆమె మీరట్ పట్టణాన్నేగాక రాష్ట్రాన్ని జాగృతం చేసింది. సత్యాగ్రహ ఆందోళనలో ఆ ప్రాంతం ప్రథమస్థానాన్ని సంపాదించింది. విడిగా 5000 మంది మహిళలతో ఈమె ఒక మహిళా కార్యకర్తల సముదాయాన్ని తయారు చేసింది. అనేకసార్లు జైలుజీవితాన్ని గడిపి పూర్తి సమర్పణతోను, సాహసంతోను స్వాతంత్ర్య పోరాటం జరిపిన ఈమె లక్ష్మీభాయికి మారుపేరుగా గౌరవించబడింది. ఆమె ద్వారా స్థాపించబడిన ఊర్మిళా శిశువిద్యాలయం ఇప్పటికీ చాలా ప్రయోజనకరంగా నడుస్తోంది. వాస్తవానికి ఆ దంపతులు ఇప్పుడు జీవించిలేరు. కానీ వారిద్దరూ కలసి దాంపత్య జీవితం ద్వారా నెలకొల్పిన ఆదర్శాలు మాత్రం ఇప్పటికీ జీవించి ఉన్నాయి.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

---

**సద్గుణవంతులకు గౌరవం, గుర్తింపు లభించాలి**

బోధకథ

# నిష్కామకర్మ యొక్క శక్తి

చక్రవేణుమహారాజు తనదైన న్యాయతత్పరతకూ ప్రజా వాత్సల్యమునకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచాడు. అంతేకాదు చక్ర వర్తైయ్యుండి కూడా తన బ్రతుకుతెరువుకు తానే కష్టపడి సంపా దించుకునేవాడు.

చక్రవేణు చక్రవర్తి సామ్రాజ్యం ఎంతోమేర విస్తరిం చింది. కోట్లాది బంగారునాణెములు సుంకం రూపంలో వస్తుండేవి. కానీ వాటినన్నింటినీ రాజ్యపరిపాలనకే ఖర్చు చేసేవాడు. తన తిండి, బట్టలు, ఇతర అవసరాల కోసం తానే ఏర్పాటు చేసుకునే వాడు. వ్యవసాయానికి అనుకూల మైన భూమి రాజుకు హక్కుగా వచ్చింది. రాజు-రాణి ఇరువురూ తమ జీవనోపాధి కోసం స్వయంగా వ్యవసాయం చేసేవారు. రోజులో 6 గంటలపాటు అతి సాధారణమైన రైతు జీవితమును గడిపేవారు. ఆ తరువాత మిగిలిన సమయమును రాజ్యపాలనకు కేటాయించేవారు.

కష్టంచేసి మనిషి జీవితాంతమూ సంపాదించగలడు. కానీ తక్కువ పనిచేస్తూ ఎక్కువ అవసరాల కోసం తపనపడితే దానిని పరిగ్రహం అంటారు. లోభము, దురాశ, విషయ వాసనలు, కోర్కెలు చక్రవర్తికి అల్లంత దూరంలో ఉండేవి. కాబట్టి డబ్బును కూడబెట్టవల్సిన అవసరం కూడా వారికెన్నడూ కలుగలేదు.

తన స్వహస్తాలతో పండించుకున్న ఆహారమును తినే వ్యక్తులకు శక్తి, స్వాభిమానం అనంతంగా ఉంటాయి. తమ పొలంలో వచ్చే దూదితో రాణి ఇద్దరికీ వస్త్రాలను తయారు చేసేది. శారీరిక శ్రమతో కూడిన జీవనవిధానంతో పాటు కృత్రిమత్వం పట్ల విరక్తిని కలిగియుండటం చేత వారిరువురి ముఖాలూ ప్రత్యేకమైన తేజస్సుతో భాసిల్లుతుండేవి.

'యథారాజా తథాప్రజా' అన్నట్లు సభాసదులు, పదాధి కారులే కాక యావత్ ప్రజానీకము వారి అడుగుజాడలలో నడిచేవారు. ఎవ్వరికి ఎలాంటి లోటు ఉండేదికాదు. కృషితో కూడిన స్వయంసమృద్ధి కలిగిన ఈ రాజ్యంలోకి దీనత్వము, వ్యాధులు, దుఃఖము మొదలైన అంశాలేవీ ప్రవేశించగలిగేవి కావు.

## సంఘటనలేవీ జరుగకుండా చరిత్ర నిర్మాణమెలా సాధ్యమౌతుంది?

చరిత్ర లేకపోతే తరువాత తరాలవారికి ప్రేరణ ఎలా లభిస్తుంది? అలాగే ఒకానొకరోజు చక్రవర్తి జీవితంలోకి అగ్ని పరీక్షాదినం రానేవచ్చింది.

ప్రజల స్థితిగతులను తెలుసుకొనటం కోసం మహారాజు ప్రతిసంవత్సరము రాజకీయ సమావేశం ఏర్పాటుచేసేవాడు. ఇప్పటివరకూ అందులో పురుషులు మాత్రమే పాల్గొంటూండే వారు. కానీ ఈ సంవత్సరము దేశంలోని విదుషీమణులైన వనితలు, రాజకీయ వార్తాహరుల ద్వారా 'స్త్రీలకు పరిస్థితు లను అవగాహన చేసుకొనటానికీ, సార్వజనిక సమస్యలలో పాలు పంచుకొనటానికీ హక్కు లేదా ఏమిటి? ఉంటే కనుక దేశంలోని సగభాగం ప్రజలను ఆ హక్కునుండి దూరం చెయ్యటం ఎంత వరకూ న్యాయం?' అనే సందేశమును మహారాణికి పంపించారు.

విషయం సరైనదే కాబట్టి అంగీకరించబడినది. సత్యాన్ని స్వీకరించటంలో మహారాజు ఇప్పటివరకూ ఎప్పుడూ తప్పు చెయ్యలేదు. అందుచేతనే ఒక్క పౌరుడు కూడా ఆయనతో విభేదించలేకపోయాడు. సదస్సులో మహిళలు కూడా పాలు పంచుకొనటానికి నిశ్చయించబడినది. వారికి ప్రత్యేకమైన శిబిరాలు ఉంటాయి. వాటిని స్వయంగా మహారాణే పర్యవేక్షిస్తుంది. విషయం తెలుసుకున్న మహిళలకు చాలా సంతోషం కలిగింది. సమావేశంలో పాల్గొనేందుకు తగిన ఏర్పాట్లు చేసుకొనటంలో వారు మునిగిపోయారు.

**సజ్జనులందరు కలవాలి, సన్మార్గ దర్శనం చెయ్యాలి**

అంతఃపురంలో స్త్రీలు వాళ్ళలోవాళ్ళు సమావేశమైనారు. పరస్పరం బాగోగుల గురించి చర్చించుకున్నారు. కానీ స్వభావరీత్యా స్త్రీలు తమ మానసిక దౌర్బల్యాన్ని వెలిబుచ్చ కుండా ఉండలేకపోయారు. మహారాణిని అతి సాధారణ వస్త్రాలలో, ఎటువంటి ఆభరణాలు లేకుండా చూసి వారంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. మహారాణి ఓర్చుకొనలేని రీతిలో ఆమెపట్ల వ్యంగ్యభావాన్ని ప్రదర్శించారు కూడా. 'మేమందరం ఆభరణాలు ధరించాము. రాజమాతయైన మహారాణి అతి సాధారణమైన స్త్రీ వలె ఉండుటం దేశానికి అపశకునమును సూచిస్తున్నది' అని స్త్రీలంతా తమ అభిప్రాయమును వ్యక్తం చేశారు. ఈ చర్చతో స్త్రీల సమావేశం ముగిసింది.

ఇప్పటివరకూ అపశకున మేమీ కాలేదు. కానీ ఇప్పుడు జరిగింది. దుర్బలత తాలూకూ ఒక చిన్న రంధ్రం కూడా మానవుడి పతనానికి హేతువు కాగలదు. ఈ దుర్బలత రాణి మనస్సులోకి ప్రవేశించింది. ఒకరోజు ఆమె సందర్భాన్ని చూసుకొని చక్రవేణిమహారాజుకు సమావేశం నాటి మహిళల అభిప్రాయమును వినిపించింది. రాజు ఎంతో నచ్చజెప్పి నప్పటికీ రాణి మదిలో ఆభరణాల పట్ల కోరిక ఎంత తీవ్ర రూపమును దాల్చినదంటే ఆమె తన పట్టుదలనుండి ఒక్క అంగుళం కూడా జరగటానికి ఇష్టపడలేదు. ఇటువంటి బలహీనతలు ఉండటం మానవ జీవితంలో సహజం. సాధారణ మానవులు వాటికి ఎంతో ప్రాముఖ్యతనిచ్చి చూస్తుంటారు. కాబట్టి ఒక్క బలహీనత ద్వారా ఎన్నో చెడు అంశాలకు తలుపులు తీయబడతాయి. చక్రవేణి మహా రాజుకు ఈ సంగతి తెలుసు. అందుచేత అతను వెంటనే ఈ విషయం గురించి స్పందించలేదు. ఇటువంటి పరిస్థితు లలో మానవుని స్వార్థప్రవృత్తి లేదా కోరిక ఆదర్శ వాదులను కూడా పదభ్రష్టులను కావిస్తుంది. అందుచేతనే రాజు ఈనాటివరకూ ఏ పనినీ కూడా కోరికతో చెయ్యలేదు. 'నిష్కామ కర్మ' యోగమును అమలుచెయ్యటం దీనిద్వారా భగవత్ ప్రాప్తి దృఢమౌతుంది. 'నిష్కామకర్మయోగమును' అమలుచెయ్యటం వల్ల సేవ, సంయమము, సదాచారము యొక్క వ్రేళ్ళు బలోపేతమౌతాయి. చక్రవేణిమహారాజు తన జీవనోపాధికై తన ప్రజల విషయములో ఎలా నిష్కామంగా వ్యవహరించాలో – భార్యపట్ల కూడా అదే పద్ధతిని అనుసరిం చాడు.

'ప్రజల వద్దనుండి మరింత పన్నులను వసూలుచేసి ఆ ధనాన్ని నా స్వార్థం కోసం ఉపయోగించుకోలేను. ఐతే నా ఆదాయమును బట్టి ఆలోచిస్తే నీకోసం ఆభరణాలు కొనేటంత ధనం మన వద్ద లేదు. కాబట్టి ఈ విషయమై మరొకసారి ఆలోచించటం మంచిది' అని భార్యకు నచ్చజెప్ప చూచాడు రాజు. కానీ ఆయన మాటలు ఆమె మీద ఎటువంటి ప్రభావ మును చూపలేకపోయాయి.

రాజు తన మంత్రిని పిలిపించి 'లంకాధిపతియైన రావణుడు నా మిత్రుడు. మీరు ఆయన వద్దకు వెళ్ళి మహా రాణికి ఆభరణాలు చేయించటానికి అవసరమైనంత బంగార మును అడిగితీసుకు రండి' అని చెప్పాడు. మంత్రి రాజు ఆజ్ఞను అనుసరించి లంకకు పయనమయ్యాడు. రావణునితో విషయమంతా సవివరంగా వెల్లడించాడు. ఈనాటివరకూ చక్రవేణి లంకేశుడైన రావణుని ముందు తలవంచలేదు. అహంకారియైన రావణా సురునికి ఇది బంగారం లాంటి అవకాశం. 'నిస్సందేహంగా మేము మీ రాజుకి మా కోశాగారం తలుపులు తెరుస్తాము. కానీ ఇప్పుడు కాదు. వారు స్వయంగా వచ్చి మమ్మల్ని యాచిం చిన పిదప ఎంత స్వర్ణరాశి కావాలంటే అంత దానం చేస్తాము' అని రావణుడు చక్రవేణిరాజు యొక్క మంత్రితో చెప్పాడు.

మహారాణికి అకస్మాత్తుగా ఆభరణాల మీద మోహం కలగటం వల్ల మంత్రి బాధపడ్డాడు. తమ చక్రవర్తి పట్ల, తమ రాజ్యం పట్ల కించపరుస్తూ అవమానపూర్వకంగా రావణుడు పలికిన మాటల వల్ల మంత్రికి ఇంకా ఎక్కువ దుఃఖం కలిగింది. 'మహారాజుకు స్వయంగా దేనిమీదా కోరిక లేదు. ఆయన మహారాణిని కూడా తన ప్రజలలో ఒకరిగానే భావించి ఆమెకు మంచిని తెలియజెప్పటానికి ప్రయత్నించాడు.

**కీర్తి ప్రతిష్టల వెనుక పడకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించాలి**

కానీ అది సాధ్య పడలేదు. అందుచేత ఇప్పుడు ఆయనే స్వయంగా యాచనకు రావల్సిన పరిస్థితి ఎదురైంది. స్వాభిమానం కలిగిన దేశ పౌరుడిగా నేను దీనిని ఎట్లా సహించగలను?' అని మంత్రి పరిపరివిధాలుగా వేదన చెందాడు.

మంత్రి సముద్రతీరానికి చేరుకున్నాడు. సముద్రపు మట్టితో కృత్రిమ లంకా నగరాన్ని ఎంతో అందంగా ఆకర్షణీయంగా నిర్మించాడు. తిరిగి లంకకు వచ్చి రావణుడిని సముద్రతీరానికి తీసుకువచ్చి తాను నిర్మించిన కృత్రిమ లంకా నగరాన్ని చూపించి 'ఇదిగో చూడు నీ లంకను. కావాలనుకుంటే ఇప్పుడే ఈ క్షణాన్నే నీ లంకను సముద్రంలో ముంచివెయ్యగలను. ఇది నీ లంకయేనా? కాదా?' అని ప్రశ్నించాడు.

రావణుడు తదేకంగా చూచాడు. మట్టితో కట్టినదైనా అచ్చం లంగాపురిలానే ఉంది. మంత్రిగారి కళానైపుణ్యాన్ని మెచ్చుకుంటూనే ఒకసారి నవ్వి 'అమాత్యా! ఈ లంకను నీటిలో ముంచటం వల్ల మాకు కలిగే నష్టమేముంది? అని అన్నాడు.

'అంతటా నష్టమే జరుగుతుంది.' మంత్రి ఎంతో స్వాభిమా నంతో ఇలా అన్నాడు. 'మీకు తెలుసో తెలియదో కానీ చక్రవేణి మహారాజు రాజ్యంలోని ప్రతి ఒక్క పౌరుడు తాను కష్టించి సంపాదించిన ధనంతోనే లేదా వారసత్వపు హక్కుగా వచ్చిన ధనంతోనే బ్రతుకుతారు. అందుచేత వారు బౌద్ధికంగా, ఆత్మికంగా తేజోవంతమైన ప్రతిభ కలవారు. దానికి ఈ కృత్రిమ లంకా నగరమే నిదర్శనం. నీకు అర్థం కాలేదుకానీ నేను ఒక్క చూపులోనే నీ వైభవమును వెలకట్టాను. నీకు ఎంత సంపద ఉన్నదో అన్ని బలహీనతలు కూడా వున్నాయి. దీన్ని చూపించటానికే నిన్ను ఇక్కడకు తీసుకొచ్చాను. చక్రవేణిరాజును నీవు హీనంగా చూపించదలచుకుంటే మా దేశంలోని ప్రజలందరూ కలసి నిన్ను ఒక్కరోజులోనే అంతం చెయ్యగలరు.'

మంత్రి మాటలు విన్న తరువాత రావణుడికి పరిస్థితి అర్థమైంది. ఏ దేశంలోని ప్రజలు ఇంత వీరులుగా ఉన్నారో ఆ దేశపు చక్రవర్తిని మిత్రత్వంతో బంధించుకొనటమే మంచిది అని ఆలోచించి రావణుడు సంతోషపూర్వకంగా బంగారమును బహూకరించాడు.

అయితే అమాత్యులవారు రాజధానికి తిరిగివచ్చేసరికి మహారాణి తన పొరపాటును గ్రహించింది. చక్రవేణి ఆ బంగారమును తిరిగి రావణునికి పంపించివేశాడు. ఈవిధంగా తన ప్రజలను లోభమోహముల పట్ల పొరపాటుగా కూడా వ్యామోహితులు కాకుండా రక్షించుకున్నాడు.

*- అఖండజ్యోతి, ఏప్రిల్ 1970*
*అనువాదం: శ్రీమతి కామరాజు కృష్ణకుమారి*

## మేలేగాని కీడేమిలేదు

*ప్రసిద్ధ రచయిత డా॥ క్రొనిన్ చాలా పేదవాడు. డాక్టరు అయినర తర్వాత సంపదతోపాటు అతని మనస్సు కూడా డబ్బు మాయమైపోయింది. అది గమనించిన భార్య మనం పేదవాళ్ళలాగా ఉన్నప్పుడే దయాహృదయం కలిగి జాగా ఉండేవాళ్ళము. ఇప్పుడా హృదయాన్ని కోల్పోయి లూటీ చేయబడిన వాళ్ళంత దరిద్రంగా తయారైనాము. ఆర్థిక దారిద్ర్యం కంటే భావ దారిద్ర్యం అతి భయంకరమైనదని బాధపడింది. ఆ మాటలు క్రొనిన్‌ను బాగా ఆలోచింప చేసేయి. వ్యక్తి ధనం ద్వారా కాక, మనస్సు ద్వారా మాత్రమే సంపన్నుడవుతాడని గుర్తించాడు. చక్కని మార్గదర్శనం చేసిన భార్యకు కృతజ్ఞతలు తెలుపుకొంటూ "నీవు సమయానికి నా కళ్ళు తెరిపించేవు. లేకుంటే మన పరస్పర స్నేహ సూత్రం కూడా బలహీనంగా తయారై ఏదో ఒకనాడు తిరిగి ముడి వేయలేనంత దారుణంగా తెగిపోయి ఉండేది" అని అభినందించేడు.*

- ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**ప్రక్కవాళ్ళు ఏమనుకుంటారో అని అనుకోకుండా వివేకాన్ని విచక్షణను వినియోగించాలి**

శిష్య సంజీవని-8

# సద్గురువు చేతనత్వముతో ఏకాకారము

'శిష్య సంజీవనీ' యొక్క అసలైన అర్థం శిష్యత్వాన్ని అభివృద్ధి చేసుకొనటం. తన శిష్యత్వములోని నిజాయితీని కాపాడుకొనటానికి అప్రమత్తంగా, తార్కికంగా, క్రియాన్వితంగా ఉండని వ్యక్తి యొక్క మనస్సు ఉండుండి డోలాయమానమవుతుంటుంది. సాధనాపథంలోని కిష్టమైన పరీక్షలు అతడి ధైర్యమును వణికి స్తూంటాయి. ఫలితంగా అతడి ఉల్లాసమూ, ఉత్సాహమూ ఏదో ఒక క్షణాన నేలమట్టమవుతాయి. సందేహాలు, భ్రమలతో నిండిన ప్రభంజనాలు, అతడి నమ్మకాలను ఎండుటాకులను ఎగరగొట్టినట్టు ఎక్కడికో విసరివేస్తాయి. ఇటువంటి అపశృతులు జీవితంలో సంభవించకుండా ఉండాలంటే తన శిష్యత్వాన్ని ప్రతిక్షణం నిజాయితీగా ఉంచుకొనటము ఒక్కటే సమర్థవంత మైన పరిష్కారము. 'శిష్య సంజీవనీ'ని నిరంతరము నియమిత రూపంలో సేవిస్తూండటమే శిష్యత్వాన్ని పరిపాక మొనరించు కొనటానికీ, నిగ్గుతేల్చుకొనటానికీ ఏకైక సాధన. అదే పరిష్కారము కూడా! దీనిని సేవిస్తూన్నవారికి ఇప్పటికే దీని లక్షణాలు అనుభవమవుతూంటాయి.

ఈ అనుభూతి ఇంకా ఎక్కువ స్పష్టం కావటానికీ, తన శిష్యత్వం మరింతగా ఋజువుచెయ్యబడటానికీ శిష్యత్వ సంజీవని యొక్క ఈ 8 వ సూత్రం చాలా ఉపయోగపడుతుంది. మార్గమును శోధించు. కొంచెం ఆగి ఆలోచించు. నిజంగా గురుభక్తిమార్గమును పొందాలనుకుంటున్నావా? లేక నీ మనస్సులో ఏదో ఒక ఉన్నతమైన స్థితికి వెళ్ళాలనీ, అభివృద్ధి పథంలో ముందుకుసాగి ఒక గొప్ప భవిష్యత్తును నిర్మించు కోవాలనే కలలు ఉన్నాయా? అని శోధించి చూడు. జాగ్రత్త! కేవలం గురుభక్తి కోసమే ఈ మార్గమును అనుసరించాలి. మహత్వాకాంక్షలను నెరవేర్చుకొనటానికి నీ గురుభక్తి దానిని కళంకితం చెయ్యకూడదని గుర్తుంచుకో. ఇందుకోసం బాహ్య ప్రదేశాలలో అన్వేషించడం కన్నా అంతరంగంలోనే మార్గమును శోధించు. భౌతిక జీవితాన్ని పవిత్రంగా తయారు చేసుకుంటూ ధైర్యాన్నంతా కూడదీసుకొని మార్గమును శోధిస్తూ ముందుకు సాగిపో! సాధనాపథం పైన పయనించాలని కోరుకునే వ్యక్తి తన స్వభావాన్నంతటినీ తెలివితో ఉపయోగించుకొనటం మరచి పోగూడదు. 'ప్రతి మనిషి తనకు తానే స్వయంగా ఒక మార్గమూ, ఒక సత్యమూ, ఒక జీవితమూ!' అని చెప్పవచ్చు. ఈ సూత్రాన్ననుసరించి ఆ మార్గమును వెదుక్కో. జీవితంలోనీ, ప్రకృతిలోనీ నియమాలను అధ్యయనం చేస్తూ ఆ మార్గమును అన్వేషించు. నీ యొక్క ఆధ్యాత్మిక సాధనా-పరాప్రకృతిని గుర్తించటం ద్వారా ఆ మార్గమును అన్వేషించు! సద్గురువు యొక్క చేతనత్వం తోటి నీ సాన్నిహిత్యము ఘనిష్టమయ్యేకొలదీ, నీ ఉపాసన ప్రగాఢమయ్యేకొద్దీ ఆ పరమమార్గం నీ దృష్టిపథం మీద స్పష్టంగా కన్పట్టుతుంది.

ఆ వైపునుండి వస్తూన్న కాంతి నీవైపు ప్రసరిస్తుంది. ఇప్పుడు నువ్వు మార్గంలోని ఒక అంచును పట్టుకోగలవు. సద్గురువు యొక్క ప్రకాశం నీవు దేహధారిగా చూసిన సద్గురువు యొక్క కాంతి ఒక్కసారిగా ఇప్పుడు అనంతమైన వెలుగురూపమును ధరిస్తుంది. నీలోపల కన్పిస్తున్న ఆ దృశ్యమును చూచి భయపడొద్దు. ఎందుకంటే నీ సద్గురువే ఆ సర్వేశ్వరుడు.

ఈ సత్యమును గ్రహించేందుకు ముందుగా నీ లోపలున్న అంధకారమును గ్రహించు. అసలు కాంతి స్వరూపమునే దర్శించనివారు ఎంతటి అసహాయస్థితిలో ఉన్నారో, వారి ఆత్మ ఎంత చిక్కటి చీకటిలో కూరుకుపో యున్నదో అర్థమవుతుంది. 'శిష్య సంజీవనీ' యొక్క ఈ సూత్రం చాలా అసంబద్ధమైనదిగా ఉన్నప్పటికీ గొప్ప జ్ఞానంతో కూడుకునియున్నది. శిష్యునికి గురువు లభించినప్పటికీ మార్గమును అన్వేషించవలసి ఉంటుంది. 'గురువు దొరికితే మార్గం దొరికినట్లే

**లోకోపకారాలు ప్రశంసనీయము**

కదా! ఇదేమి విచిత్రం?' అని తెలిసీ తెలియని వ్యక్తులు ప్రశ్నించవచ్చు. కానీ అది అంత తేలికైన విషయం కాదు. అజ్ఞానులు, గురువు లభించగానే ఆయనను సిద్ధపురుషుడిగా భావిస్తారు. ఆయన శక్తులను కేవలం తమ స్వార్థమును నెరవేర్చుకొనుటకు, లోభం కోసం, లాభం కోసం గుర్తిస్తారు. మన కోరికలు ఏవిధంగా నెరవేరు తాయా అన్న తపనతోనే ఆయన చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. తమ యొక్క ఈ మూర్ఖత్వానికి వారు గురుభక్తి అని పేరు పెట్టుకుంటారు. తమ స్వార్థం కోసం చేసే పనులను సాధన అని చెప్పు కుంటారు.

ఐతే శిష్యత్వాన్ని తమ జీవనసారంగా భావించేవారు ఈ మూర్ఖత్వానికి నవ్వుకుంటారు. గురుదేవుల దర్శనమైతే ఈ చర్మ చక్షువులకు లభిస్తుంది కానీ ఆయన చెప్పిన మార్గం కోసమైతే అంతరంగంలోకి ప్రవేశించి అంతశ్చక్షువులతో అన్వేషించవలసి ఉంటుంది. భౌతికంగా వెదికేవారు అలా వెదుకుతూనే ఉంటారు. బయటకు కనిపించేది ప్రతీక మాత్రమే కానీ సత్యం కాదు. చిహ్నం మనలను సత్యం వైపు నడిపిస్తూంటుంది కానీ అదే సత్యం మాత్రం కాదు. సత్యం కోసం హృదయమనే గుహలో కూర్చుని ఉపాసించ వలసి ఉంటుంది. జీవితాన్ని సంస్కరించుకొని పవిత్ర మొనరించుకొనవలసి ఉంటుంది. గురుదేవులు తమ జీవితాన్ని పవిత్రమొనరించుకున్న రీతిలోనే మనమూ స్వచ్ఛపరచు కోవాలి.

ఏమైనప్పటికీ ఇది చాలా సాహసంతో కూడుకున్న పని. ఎందుకంటే భౌతిక జీవనాన్ని పవిత్రమొనరించుకొనగలిగిన వారు - ఎటువంటి పరిస్థితులనూ, మహత్వాకాంక్షలనూ, అహంకారమునూ, విషయవాసనలనూ సంతృప్తి చెందిం చటం... మున్నగు అంశాలను త్యాగం చేసిన తరువాతనే పవిత్రత అనే మార్గం పైన ముందుకు సాగగలరు. ఇది చాలా సాహసో పేతమైన పని. ఏవిధంగా చూసినా అంత సులువైనదేమీ కాదు. ధైర్యవంతులైనవారు మాత్రమే ఈ దారిలో ముందుకు సాగగలరు. అలా సాగిపోయినవారికి జీవన రహస్యము స్పష్టంగా బోధపడుతుంది. వారు భౌతిక ఆధ్యాత్మిక ప్రవృత్తులను అర్థం చేసుకొనగలరు. సద్గురువు యొక్క జ్యోతియే ఆత్మజ్యోతి. అదే భగవంతుని యొక్క అనంతమైన ప్రకాశం కూడా! అన్న రహస్యము వారికి బోధపడుతుంది.

ఈ సందర్భంగా 'రజ్జబ్' అనే మహాసాధుపుంగవునికి సంబంధించిన ఒక కథ తెలుసుకుందాం. ఆయనకు దాదూ అనే సద్గురువు యొక్క అనుగ్రహమైతే లభించింది కానీ అంతరంగం ప్రకాశవంతం కాలేదు. గురువు లభించినా మార్గం లభించలేదు. ఏం చెయ్యాలి? ఎక్కడకు వెళ్ళాలి? ఈ ప్రశ్నలను దాదూసాహెబ్‌ను చాలాసార్లు అడిగినప్పటికి వారు నవ్వి ఊరుకునేవారు. ఇలా ఎన్నోసార్లు అడిగినమీదట 'గురువును దేహమాత్రంగా భావించేవారు దారితప్పి తిరుగు తూనే ఉంటారు. గురువును చేతనత్వంగా భావించినవారికి మార్గం ప్రకాశవంతమవుతుంది' అని మాత్రం సెలవిచ్చారు. అంతకు మించి అధికంగా మరేమీ చెప్పలేదు. రజ్జబ్‌కి ఇంకా ప్రశ్నిం చేందుకు ధైర్యం చాలలేదు. విసిగి, వేసారి చివరకు ఆయన తన గురుదేవుల రూపమును అంత రంగంలో ప్రతిష్ఠించుకున్నారు. తన హృదయంలో భక్తి, ప్రేమ, అనురాగం... మొదలైన వాటినన్నింటినీ ఏక మొత్తంగా వారి రూపానికి అంకితం చేశాడు. ఆ రూపం అతని హృదయంలో ప్రతిష్ఠితం అయింది. ధ్యానం ప్రగాఢ మయ్యేకొద్దీ గురుదేవుల రూపం రజ్జబ్ యొక్క చేతనత్వ ములో ఆత్మజ్యోతిగా మారి వెలగసాగింది. రజ్జబ్ అక్కడితో ఆగకుండా తన సాధనను కొనసాగించాడు. ఒకానొక శుభ ఘడియలో ఆత్మజ్యోతి అనంత ఈశ్వరీయ ప్రకాశరూపాన్ని దాల్చింది. సమాధి యొక్క పరమభాగవత దశలో అతనికి సద్గురువూ-భగవంతుడూ ఒక్కడే అనే సమాధానం దొరికింది. ఎవరైనాసరే తమ తమ అంతరంగంలోకి మార్గమును అన్వేషించటానికి వ్యాకులపడుతుంటారో వారికి రజ్జబ్ యొక్క సాధనా పథంలోని ఈ రహస్యము బోధపడుతుంది. శిష్యుల యొక్క వ్యాకులతకు సమాధానం శిష్యసంజీవనిలోని తరువాతి సూత్రంలో నిహితమై ఉన్నది.

*- అనువాదం: శ్రీమతి కామరాజు కృష్ణకుమారి &*
*శ్రీమతి లక్కరాజు లక్ష్మీరాజగోపాలు*

**సత్సంగం మనిషి ఆత్మను ప్రభావితం చేస్తుంది**

# కలల యొక్క సత్యమును గురించిన రహస్యము ఏమిటి?

'గుడ్ నైట్ సర్' అంటూ ఒక మిత్రుడు అమెరికా ప్రెసిడెంట్‌కు విందు తరువాత వీడ్కోలు చెప్పాడు. అందుకు సమాధానంగా ప్రెసిడెంట్ 'గుడ్ బై ప్రియతమ క్రుక్' అన్నాడు. ఈ పదము గుడ్‌బై అనేది అతని మిత్రులనందరినీ ఆశ్చర్యపరిచింది. ఆంగ్లేయుల సాంప్రదాయం ప్రకారం సాధారణంగా గుడ్ బై అనే పదము దీర్ఘకాల వియోగము వచ్చినప్పుడే ఉపయోగిస్తారు. కానీ లింకన్‌కు అక్కడ అలాంటి సందర్భమేదీ లేదు. వైట్‌హౌస్, లింకన్‌కు బైట కార్యక్రమాలున్నట్లు కూడా ప్రకటించలేదు. ఒకరోజు ముందుగా లింకన్‌కు ఒక కల వచ్చింది. తనను ఎవరో కాల్చివేసినట్లు. తన మృత శరీరము భూమిమీద పడి ఉన్నట్లు కనిపించింది. తన జీవితంలో అతడు ఎన్నో కలలను చూశాడు కానీ ఈ కల అతని అంతఃకరణపై విపరీతమైన ప్రభావాన్ని చూపింది. ఈ స్వప్నము గురించి తన మిత్రుడు క్రుక్‌కి వివరించి చెప్తూ, 'ఈ కల వచ్చినప్పుడు అది వాస్తవ మవుతుందని నాకనిపించింది' అన్నాడు. క్రుక్ నవ్వుతూ దానిని కొట్టిపారేశాడు. కానీ ఎప్పుడైతే విందు అయిపోయాక వైట్‌హౌస్‌కు వెళ్తూ గంభీరంగా గుడ్‌బై చెప్పాడో అప్పుడు అందరూ గంభీరంగా మారిపోయారు. 1865 ఏప్రియల్ 14వ తేది మరుసటి రోజు, అదేరోజున లింకన్‌గారిని కాల్చి హత్యచేశారు.

వైజ్ఞానికులకు వచ్చిన ఒక ప్రశ్న ఏమిటంటే మానవుడు కూడా వృక్ష వనస్పతుల వలె కేవలం రసాయనిక అస్థిత్వమునో లేక జడత్వమునో కలిగి ఉన్నవాడైతే కనుక పెద్దపెద్ద మిషన్లు కూడా కనిపెట్టలేని విషయములు ఎలా తెలుస్తాయి? స్వప్నం ద్వారా ముందుగా జరుగబోయే విషయములు తెలియడం అనేది ఆలోచించడానికి వివశం చేస్తుంది. ఆత్మ అనేది ఏదో ఒక చేతనాత్మకతత్వము కాదని, అది అమరత్వము, సర్వ వ్యాపకత్వమును, సర్వాంతర్యామి తత్వములనే గుణము లతో పరిపూర్ణమైనదని గ్రహించాలి. అందుచేతనే నిద్రా స్థితిలో కూడా అది యంత్రాల ద్వారా కూడా గ్రహించేందుకు వీలుకాని ఎన్నో విషయాలను గ్రహించగలుగుతున్నది.

భౌతిక లేదా పదార్థ విజ్ఞానములననుసరించి మనిషి ఎంత గాఢంగా నిద్రలోకి జారిపోతే అంత గాఢంగా ప్రాపంచిక విషయాలను విస్మరిస్తాడు, కానీ ఎలక్ట్రో ఎన్ సెఫైలో గ్రామ్ (మనిషి మస్తిష్కము నుండి ఉద్భవించే తరంగాలను లెక్కించే యంత్రము EEG) ద్వారా ప్రసిద్ధ వైజ్ఞానికుడు డా॥ క్లిటిమన్ నిద్రాస్థితి ఎంత లోతుగా ఉంటే కలలు అంత స్పష్టంగా ఉండి నిజమవుతాయని నిరూపించాడు. గాలి పీల్చటం లాగే కలలు రావటం కూడా జీవుని యొక్క స్వాభావిక ప్రక్రియ అని ఆయన ప్రతిపాదించాడు. స్వాభావిక క్రియలు సత్య విషయ జ్ఞానమును కలిగిస్తే కనుక ఆ అనుభూతిని ఇచ్చే తత్వమును మనం జడం అని అనకూడదు. రాత్రి నిద్రలో గాఢ నిద్రాస్థితి అనేది ఒకటి లేదా రెండు గంటలు మాత్రమే ఉంటుంది. రాత్రిళ్ళు ఎక్కువ సేపు సార్థక్యమయ్యే కలలు రావు కనుక ఆ అనుభూతి ఎక్కువ సేపు ఉండదు. ప్రాతఃకాలములో బాహ్య ప్రకృతి కూడా స్వచ్ఛంగా ఉంటుంది, అప్పుడు మనిషి కూడా గాఢనిద్రలోకి జారుకుంటాడు. అప్పుడు వచ్చే కలల్లో సత్యమయ్యే సంఘటనలకు సంబంధించిన భవిష్యజ్ఞానము మనకు లభిస్తుంది.

స్వప్నములు ఆత్మచేతనత్వమునకు ప్రమాణములు అయితే మరి అందరికీ ఎందుకు అలాంటి కలలు రావు అనే తర్కమును పైన చెప్పిన విషయముల ద్వారా ఖండించవచ్చును. బాగా కారంగా, ఘాటుగా ఉండి ఉత్తేజపరచే భోజనం సేవించటం వలన శరీరమందలి స్థూలప్రకృతి ఉత్తేజితమై కలలు సరిగ్గా కనిపించవు. చేతనత్వము ఎప్పుడు లోతుల్లోకి దిగుతుందో అప్పుడు వాస్తవమయ్యే కలల శృంఖల మొదలవుతుంది.

ఈ రకమైన కలల గురించి పోలెండ్‌లో ఒకసారి విపరీతమైన చర్చలు జరిగాయి. అప్పటి నుండి అక్కడ ఉండే వేలాది మంది లోతైన ఏకాంత స్థితిలో కూడా అంత దగ్గరగా వాస్తవ ఘటనల అనుభూతిని అందించగలిగే అచేతనత్వం ఏమిటి? అనేది తెలుసుకోవాలి అనుకున్నారు.

ఈ రకమైన జిజ్ఞాసను అందరిలో కలిగించిన ఆ సంఘటన ఒళ్ళు గగుర్పొడిచేలా ఉంటుంది. మేరనా అనే

**సత్సంగంలో పాల్గొనే వ్యక్తి కాలక్రమంలో యోగ్యుడు పండితుడు అవుతాడు**

యువతికి సైన్యంలో సిపాయిగా పనిచేసే ఒక యువకుడితో వివాహం నిశ్చయమైంది. వివాహానికి కొద్దిరోజుల ముందు అతను సెలవులు గడిపేందుకై తన ఊరికి వచ్చాడు. ఇంతలో యుద్ధం ప్రకటించటంతో అతను తన బెటాలియన్ కోసం తిరిగి వెళ్ళవలసి వచ్చింది. మేరనా అశ్రునయనాలతో అతనికి వీడ్కోలు చెప్పింది. ఆమె హృదయంలో అతని పట్ల ఉండే ప్రేమ చాలా గాఢంగా ముద్రించుకుపోయింది. ఆమె నిజమైన హృదయంతో ఆత్మ సమర్పణ చేసుకొని కాబోయే భర్త తలపులతో నిండిపోయి ఉంది.

యువకుడు 'స్టెనిస్లాస్' కూడా తన బాధ్యతలు నిర్వహించేందుకు వచ్చినా మేరనా పట్ల ఉన్న ప్రేమ గాఢమవటం చేత పదే పదే ఆమె తలపులలో మునిగిపోతున్నాడు. ఒకరోజున వేలాది మంది సిపాయిలు శత్రుసేనలకు చిక్కారు వారందరూ ఎటుపోయారో ఎవరికీ తెలియలేదు.

1618 అక్టోబర్ నెలలో మొదటిసారిగా ఒకరోజు రాత్రి ఆమెకు ఒక భయంకరమైన కల వచ్చింది. కలలో స్టెనిస్లాస్ ఒక సొరంగంలో బంధింపబడి ఉన్నాడు. అతను వెలుగుతున్న ఒక క్రొవ్వొత్తితో అడ్డుగా ఉన్న రాయిని తొలగి బైటికి రావాలని ప్రయత్నిస్తూ సహాయం కోసం మేరనా పేరును గట్టిగా అరుస్తూ పిలుస్తున్నాడు. ఈ భయంకర స్వప్నం తరువాత ఆమెకు ఇక నిద్ర పట్టలేదు. ఆమె గుండె వేగం పెరిగింది. మెదడు అలసి పోయిన అనుభూతి కలిగింది. డా॥ క్లీటమన్ సహాయకుడైన యూగేన్ ఎసేరికన్ స్వప్నములను గురించి విశ్లేషణ చేస్తూ ఒకచోట ఇలా వ్రాశాడు. మనిషి నిద్రావస్థలో, కలను చూస్తున్న ప్పుడు కల యొక్క తీవ్రతననుసరించి అతని కనుగ్రుడ్లు కూడా కదలాడతాయి. ఒకరాత్రిలో రెండు నుండి ఐదుసార్లు కనుగ్రుడ్లు తిరుగుతాయి. ఇలా కొన్ని గంటల పాటు జరుగుతుంది. దానితో పాటు కలలోని దృశ్యాల క్రమముతో హృదయముతో పాటు కొన్ని మర్మస్థానాలు కూడా ప్రభావితమవుతాయి. దీని వలన కలలకు, మనిషికి మధ్య చాలా దృఢమైన సంబంధం ఏర్పడి ఉంటుంది. ఆత్మ శరీరములోనే కాదు ఒక విలక్షణమైన వేగంతో, రూపంతో కలలో దృశ్యములు కనిపించే స్థానాలలో కూడా ఉంటుంది. మేరనా దృశ్యము చూసినప్పుడల్లా ఇలాంటి స్థితే ఏర్పడుతున్నది. ప్రతిరోజూ రాత్రి చివరి ఝాములో ఇదే కల కనబడుతున్నది.

అవి వేసవి రోజులు. 1616 సంవత్సరం. కలలో ఒక రోజున ఉన్నట్టుండి మార్పు కనిపించింది. రాత్రి మేరేనా ఒక విశాలమైన కోటను చూసింది. ఆమె చేతనత్వం చిన్న చిన్నగా ఒక చోటుకు చేరుకున్నది. ఒక ద్వారం అక్కడ విరిగిపడి ఉన్నది. ఆ ఇటుకల కుప్పక్రింద ఆమెకు ముందు పరిచయం ఉన్న ముఖమే కనిపించింది. క్రొవ్వొత్తి యొక్క మసక వెలుతురులో ఆ కుప్పల మధ్యన పడి ఉన్న స్టెనిస్లాస్ కొన్ని రాతి ముక్కలను ప్రక్కకు తొలగించుకుంటూ మధ్య మధ్యన ఎంతో భయంతో సహాయం కోసం అరుస్తున్నాడు. మెరేనా చేతనత్వ శరీరం అక్కడికి వెళ్ళగానే మేరేనా కూడా అరుస్తున్నది. ఈవిధంగా స్టెనిస్లాస్, అతని గొంతు వింటుండగానే ఆమెకు నిద్రాభంగమైంది. ఆమె తల్లి, కుటుంబ సభ్యులూ ఆమె శారీరిక పరిస్థితిని చూసి భయపడి డాక్టరును పిలిపించగా అది ఒక రకమైన ప్రేమోన్మాదంగా ఆయన నిర్ధారించారు. ప్రజలంతా ఆమెను చూసి నవ్వుకున్నారు. చర్చిలో ఉన్న ఫాదరు దగ్గరకు వెళ్ళి ఆమె తన విషయమంతా చెప్పగా ఆయన కూడా నవ్వుతూ ఈ ప్రేమావేశం ఏదో ఒకరోజున నిన్ను పిచ్చిదానిని చేస్తుంది అని అన్నాడు.

మేరేనా రెండో రోజున కూడా అదే కలను చూసింది. మూడవరోజు, నాల్గవరోజున నిరంతరం ఆమెకు అదే కల రాసాగింది. ఆమె కళ్ళముందర నిరాశాపూరితుడైన స్టెనిస్లాస్, అతను చిక్కుబడి ఉన్న ఆ కోట తిరుగాడుతూ ఉన్నాయి. ఆమె ఎవరితో మాట్లాడినా దాని గురించే మాట్లాడుతున్నది. ఈ సంఘటనను వెలుగులోకి తెచ్చిన డాక్టరు ఫ్రాంక్ ఎడ్వర్డ్ దీన్ని గురించి వ్రాస్తూ చివరకు ఆమె పిచ్చిది అనే ముద్ర వేశారని వ్రాస్తాడు. వారు మాత్రం ఏ కోటలో అని వెతకగలరు? సానుభూతి చూపించటం మినహా మరే విధమైన సహాయము చేయలేకపోయారు. ఒకరోజున మేరేనా ఇంటినుండి బయటకు వచ్చేసింది. ఆమె తన కల నిజమని నిరూపించుకొని, తనకు కాబోయే భర్తను వెతకాలని నిర్ణయించుకున్నది. చాలా నెలల పాటు కాలినడకన యాత్ర చేస్తూ అన్ని కోటలను దర్శించింది. కానీ కలలో కనిపించి కోట ఇంకా దూరంగానే ఉంది. మార్గమధ్యంలో ఆమెను పేదరాలిగా భావించిన ప్రజలు ఆమెకు తినడానికేదైనా పెట్టేవారు. భగవంతునిపై భారం వేసి మేరేనా తన యాత్రను

**ఉన్నతమైన వ్యక్తిత్వమే సామాన్య జనులను ప్రభావితం చేయగలడు**

కొనసాగించింది. 1620 ఏప్రిల్ 25వ తేది నాటికి ఆమె దక్షిణ పోలెండులోని 'జోట్లా' అనే పేరుగల నగరానికి చేరింది. అక్కడికి దగ్గరలోనే ఉన్న ఒక పర్వతం ప్రక్కగా నడుస్తుండగా ఆమె దృష్టి ఒక కోట మీద పడింది. అవును ఇదే నేను చూసిన కోట. ఇదే ప్రతిరోజూ నా కలల్లో కనబడేది, అని ఆనందాతిశయంతో అరుస్తూ మూర్ఛ వచ్చి పడిపోయింది. స్థానికులైన గ్రామస్తులతోపాటు పోలీసు అధికారులు కూడా అక్కడికి చేరుకున్నారు. ఆమెపై నీళ్ళు చల్లి స్పృహ తెప్పించారు. ఆమె చెప్పిన కల వివరణ విని అందరూ పగలబడి నవ్వారు. పోలీసు అధికారి మాత్రం ఆమెను విసుక్కుంటూ ఇలా అన్నాడు, 'చూడమ్మా, కొన్ని నెలలుగా ఈ కోట బాగోగులను నేనే చూసుకుంటున్నాను. ఇక్కడ ఎవరూ లేరు. నీ పిచ్చితనం వదలి ఇంటికి వెళ్ళు.' కానీ అతని మాటలు ఆమెపై ఎలాంటి ప్రభావాన్ని చూపించలేదు. ఆమె లేచి నిలబడి కోట వైపుకు పరుగెత్తింది. జనమంతా ఆమె వెనుక పరుగెత్తారు. ఆమెకు కలలో కనిపించిన ప్రాంతం వైపుకు ఆమె పరుగెత్తి, అక్కడ కుప్పగా పడి ఉన్న ఇటుకలను వేగంగా తొలగించసాగింది. అక్కడున్న ప్రజలు కొంతమంది ఆమెను అర్థం చేసుకొని ఆమెకు సహాయం చేశారు. సగానికి పైగా రాళ్ళను తొలగించిన తరువాత నిజంగానే లోపల ఒక దర్వాజా బయటపడింది. ఆ లోపలి నుండి ఒక మనిషి గొంతు చాలా స్పష్టంగా వినబడసాగింది. ఇటుకలన్నీ తొలగించాక ఒక వ్యక్తిని బయటకు తీయటానికి వీలైనంతగా తలుపు తెరుచుకున్నది. ప్రజలంతా ఆశ్చర్యచకితులై చూస్తుండగానే అందులో ఇరుక్కుని ఉన్న వ్యక్తి బయటకు వచ్చాడు. అతనే స్టెనిస్లాస్. ఇన్ని రోజులుగా అంధకారంలో చిక్కుకుని ఉన్న కారణంగా అతను వెలుతురును చూడలేకపోయాడు. బట్టలు చిరిగిపోయి, శరీరం క్షీణించి పోయి ఉన్నది.

అతను యుద్ధ సమయంలో స్టోరుకు కాపలా కాస్తుండగా శత్రుసైన్యం నుండి ఒక గుండు వచ్చి ఆ ప్రదేశాన్ని అతలా కుతలం చేసింది. ఇన్ని రోజులుగా అతను క్రొవ్వొత్తులు వెలిగించుకుంటున్నాడు. తినటానికి ఎండిపోయిన బిస్కెట్లు, తాగేందుకు మత్తుపానీయాలు ఉండటం వలన వాటి సహాయంతో ఇన్ని రోజులు బ్రతికి ఉన్నాడు. ఈ సంఘటన సైనికాధికారిపై చాలా పెద్ద ప్రభావాన్నే చూపించింది. అతను స్టెనిస్లాస్‌ను గౌరవ, సమ్మానాలతో పంపించి, మేరీనాతో వివాహం జరిపించాడు. ఈ సంఘటన మొత్తం పోలెండ్‌ను ఆలోచనలో పడవేసింది. జీవితంలో లోతైన సత్యాలు ఎన్నో ఉన్నాయని, కలలు వాటిని మనకు చూపిస్తాయని, ఆ సత్యాలను మనం ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించకూడదని వారు తెలుసుకున్నారు. కాంబెల్ అండ్ కంపెనీ, రిచ్‌మండ్ సూరీ యొక్క డైరెక్టర్ ఎ.ఎమ్.వి.కాంబ్‌వెల్ ఒక సంఘటన గురించి చెప్తూ కలల్లో కొన్ని సత్యాలు తెలుస్తాయని, కలలకు మానవ జీవితానికి చాలా దగ్గర సంబంధం ఉందని అంగీకరిస్తూ చాలా చెప్తున్నారు. 1647 సంవత్సరం నవంబర్ 10వ తారీఖున ఎం.ఎం.జెర్మన్ అనే పేరుగల ఒక లండన్ వాసి తనతో లెష్టర్‌లోని గుఱ్ఱపుపందాలలో 20-20 నెంబరు గల గుఱ్ఱము ప్రథమ స్థానములో వస్తుందని చెప్పాడు. నవంబర్ 17వ తేది పత్రికలలో పైన చెప్పిన సంఘటనను గురించి వ్రాస్తూ ఆ పోటీలో 20-20 నెంబరు గుఱ్ఱమే ప్రథమ స్థానంలో వచ్చిదనే విషయాన్ని చదివి పాఠకులు ఆశ్చర్యపోయారు. కలలు నిరర్థకం కావనే విషయం, ప్రజలకు అనుభవంలోకి వచ్చింది. జీవితంలోని అదృశ్య భాగమంతా కలల్లోనే దాగి ఉంటుంది. యోగవాశిష్టములో ఈ సత్యాన్ని గురించి చెప్తూ వశిష్టులవారు ఇలా వ్రాశారు.

*ఇదం ఆదయం స్వప్న ఇతి నాశ్యేవ భిన్నతా ।*
*సత్యే దస్తుని నిఃశ్శేష సమయోర్యా భూతితః*
*(6-2-16-124)*

*ఆది గృహేహి చిత్స్వప్నో జాగ్రదిత్యభిషబ్దతే ।*
*అద్యః రాత్రౌ చితేః స్వప్నః స్వప్న ఇత్యభిధీయతే ॥*
*(6-2-55-9)*

స్వప్నానికి, జాగ్రదావస్థకు ఎలాంటి భేదమూ లేదు. రెండింటి అనుభవాలు ఎప్పుడూ సమానంగానే ఉంటాయి. సర్గ యొక్క మొదటి భాగంలో ఆత్మ యొక్క స్వప్నము జాగృత మని పిలువ బడుతుంది మరియు సర్గలో ఉన్నది స్వప్నమని చెప్పబడుతుంది. రెండు స్థితులలోనూ ఆత్మ యొక్క స్థితి, అస్థిత్వము రెండూ సమానమే.

*- అఖండజ్యోతి, జనవరి 1970*
*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**ఆదర్శాల గురించి మాట్లాడేవారు ముందువాటిని ఆచరించాలి**

మనం మన ఆరోగ్యం

# పవిత్ర వృక్షం - చందన వృక్షం

చందనం సువాసన మరియు చల్లదనం కలిగించే ఒక దివ్యమైన వస్తువు. ఇది పరిసర ప్రాంత వాతావరణంలో సువాసనలు నింపుతుంది. మత్తును కలిగిస్తుంది. ఈ చందనపు దివ్య సుగుణాలతో మన శరీరం చల్లగాను, మనస్సు ప్రసన్నతతో, హృదయం పవిత్రతతో నిండిపోతుంది. ఇది సాత్వికమయిన సుగంధపూరిత విశేషగుణం కలిగి నందున ప్రతి ధార్మిక కార్యక్రమములో విశేషంగా ఉపయోగించబడుతుంది. ఇది ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలలోనే కాకుండా రోగనివారణ ఔషధాలలో కూడా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. విభిన్న రోగాలకు ఇది అమోఘమైన గుణమిచ్చే ఔషధంగా కూడా ఉపయోగించబడుతుంది. దీని విభిన్న గుణాల వల్ల ఆధునిక ఆరోగ్య చికిత్సా విధానంలో ఉపయోగింపబడడంతో పాటు ఔషధ పరిశోధన విభాగంలో ఆశ్చర్యకరమైన అద్భుతగుణాలు ఉండినట్లు కనుగొన్నారు.

గంధపుచెట్టు నిరంతరం వసంతశోభతో పచ్చపచ్చగా సంవత్సరం పొడవున పెరుగుతుంది. ఇది దాదాపుగా 24 నుండి 30 అడుగుల ఎత్తు పెరుగుతుంది. (6.4 నుండి 9.0 మీటర్ల వరకు) వృక్షశాస్త్రజ్ఞులు దీని ఆకులు అండాకృతిని పోలి ఉంటాయని చెప్తారు. పూవులు వంగరంగులో గుత్తులుగా పూస్తాయి. దీని పండ్లు వంగరంగు కలబోసినట్లు ఉంటాయి. ఏప్రియల్, మే మధ్యలోను, అక్టోబర్, నవంబర్ నెలలో పంటకు వస్తుంది. గంధపుచెట్లు పూర్తిగా పరిపక్వ స్థితికి రావటానికి దాదాపుగా 60 సం॥ పడుతుంది. కానీ తక్కువ వయస్సులో ఉన్న చెట్లను కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ వృక్షాలు తమిళనాడు, కర్ణాటక దక్షిణ ప్రాంతంలో 200 కి.మీ. మేర వ్యాపించి ఉన్నవి. దక్షిణ ప్రాంతంలో ఈ వృక్షాలు ఏపుగా పెరుగుతాయి. ఇవి స్వతః సిద్ధంగా పుట్టి పెరుగుతున్న వృక్షాలు.

ఈ ప్రాంతంలో విపరీతమయిన వేడితో పాటు వాతావరణంలోని గాలులు ఈ వృక్షములు పెరుగుటకు ఎంతో అనుకూలంగా ఉంటాయి. ఇక్కడి వాతావరణం అత్యంత సమృద్ధితో పాటు సాత్వికతతో నిండి ఉంటుంది. దీని చుట్టుప్రక్కల ఏర్పడిన వాతావరణం ఇక్కడ నివసించే వ్యక్తుల మనసు మీద ఏవిధమైన ప్రభావం చూపుతుందో తెలుసుకోవలసిన విషయం. మనో వైజ్ఞానికులు రసాయనిక రూపంలో చందననూనెలో ఆల్ఫా, బీటా, సెంటాలాల్, ఆల్డీహైడ్, కీటోన్ మొదలైనవి ఉన్నవి అని తెలుసు కున్నారు. చందన ధూపం సుగంధ వాసనతో పాటు దుర్లభమైన తత్త్వంతో కూడి మనోభూమి మీద ఇది ప్రభావం చూపిస్తుంది. వాతావరణ నిపుణులు చెప్పే వివరణ ఏంటంటే ఒక గంధపుచెట్టు యొక్క సుగంధం దాదాపుగా వందమీటర్ల వైశాల్యంలో వ్యాపిస్తుంది. కృత్రిమంగా తయారైన సుగంధం 24 గంటలలో ఇంత వైశాల్యంలో వ్యాపింపచేయటానికి ఎన్నో వేల రూపాయిలు ఖర్చు చేయవలసి ఉంటుంది. కానీ ప్రకృతిసిద్ధమైన చందన సువాసనలు సహజంగా ఎల్లప్పుడు వెదజల్లబడతాయి. ఈవిధంగా ఒక చందనవృక్షం సువాసన దాని పరిసర ప్రాంతాలలో విస్తరించటమే కాకుండా ప్రాణవంతమైన ఆక్సిజన్ ఉత్పత్తిని ఎక్కువగా చేస్తూ ఉంటుంది. అందువలన మనిషి దీని పరిసర ప్రాంతంలోనికి వస్తూనే తెలివైనవానిగా, ప్రాణవంతునిగా, చైతన్యవంతునిగా మారగలడు.

పూర్వం మన ఋషులు ఈ చందనం యొక్క దివ్య విశేషాలు ఎరిగినవారే. అందువల్లనే వివిధ దేవకార్యాలలో చందనం యొక్క చెక్కలను ఉపయోగించేవారు. ప్రస్తుతం ఈ చందనం నుండి లెక్కలేనన్ని సుగంధద్రవ్యాలు, లేపనాలు, నూనెలు ఉత్పత్తి చేస్తున్నారు. కానీ వీటిని మన భోగాల

**చెప్పేది చేసేది ఒకటి అవడం వలన చెప్పేవారి మాటలకు శక్తి వస్తుంది**

కోసం మాత్రం ఉపయోగించుకుంటున్నాము. కానీ భావనాత్మక మనఃస్థితి కొరకు ఉపయోగించలేకున్నాము. చందనాన్ని ఆధ్యాత్మిక భావాలు, దైవకార్యాలలో వినియోగిం చుకుంటే మన హృదయాలు సాత్వికంగా మారి పవిత్ర వాతావరణంతో నిండిపోవడం ఖాయం.

ఇతిహాసకారులు వ్రాసిన విషయాలను లోతుగా గమనిస్తే క్రీస్తు పూర్వం 5వ శతాబ్దికి ముందు నుండే భారత దేశంలో చందన ఉపయోగాలు ఉన్నవి అని తెలుస్తుంది. 18వ శతాబ్ది మధ్యకాలం వరకు మన దేశం చందనాన్ని ముఖ్యమైన వస్తువుగా పరిగణిస్తుండేది. భారతదేశంలో తెల్ల చందనం, ఎఱ్ఱచందనం, పసుపుచందనం అనే 3 జాతులు ఉండేవి. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం మొదటి శతాబ్ది నుండి మూడవ శతాబ్ది వరకు ప్రముఖంగా రోమ్ దేశస్థులు మన దేశం నుండి ఈ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనేవారని ఎన్నో ప్రమాణాలున్నవి. 6వ శతాబ్దంలో అరబ్బులు మన దేశం నుండి చందన నూనెలు దిగుమతి చేసుకొనేవారు. ఈవిధంగా చందనం పంట వ్యవసాయపరంగాను, వ్యాపార పరంగాను అతి ప్రాచీనకాలం నుండి ప్రసిద్ధమైంది. మన భారతదేశం పురాతన కాలం నుండి చందనాన్ని ఆయుర్వేద వైద్యంలో వాడటం ఉన్నది.

చందనం యొక్క ముఖ్యమైన ఔషధగుణాలు ఈ క్రింది విధంగా ఉన్నవి. శారీరక చల్లదనం కొరకు, రక్తలేమిలోను, విషహారిణిగాను, అతిమూత్రం, వాతపిత్త సంబంధ మందులుగాను ఉపయోగంలో ఉన్నది. ఇన్ని గుణాలు కలిగి నందువల్లనే జ్వరసమయంలో, రక్తహీనతలో, వాంతులు విరోచన సంబంధవ్యాధులను, అతిమూత్ర సంబంధ వ్యాధులకు, పాండురోగాలకు రకరకాల చర్మ వ్యాధులకు, విషకారక వ్యాధులలోను, అతి ఉష్ణ కారకాలైన అనేక వ్యాధులకు ఈ చందనాన్ని ఉపయోగిస్తున్నారు. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే దీని ఉపయోగాలు తెలుసుకోవలసి ఉంటుంది. ఆయుర్వేద వైద్యుల అభిప్రాయాల ప్రకారం నీటితో అరగదీసిన గంధాన్ని నొప్పి వద్దగాని, వాపు వద్ద గాని వ్రాస్తే లేక జ్వరం వస్తే శరీరం మీద లేపనంగా పూసినట్లయితే త్వరగా ఉపశమనం కలుగుతుంది. విషహరణంలోను, శారీరిక మంటలు ఉన్నప్పుడు చల్లదనం కొరకు అరగదీసిన గంధం వ్రాయాలి. వివిధ చర్మరోగాలకు కూడా ఈ గంధం ఎంతో లాభదాయకంగా పని చేస్తుంది. బాగా దప్పికగా ఉంటే గంధాన్ని కొబ్బరినీళ్ళలో కలిపి త్రాగిస్తే త్వరగా దప్పిక తీరుతుంది. రక్తహీనతకు బియ్యపు కడుగులో గంధం, తేనె, పటికబెల్లం కలిపి త్రాగిస్తే రోగం తగ్గిపోతుంది. వాంతులకు ఉసిరికరసంలో గంధం కలిపిస్తే తగ్గిపోతుంది. గంధపునూనెను ఉపయోగించి ఎన్నో రోగాలు నయం చెయ్య వచ్చు. మూత్రశుద్ధికి, వీర్యవృద్ధికి ఉపయోగకరం. క్రిముల నాశనకారి, కఫాన్ని అరికడుతుంది. కడుపులో మంటగా ఉంటే చందనం నూనెను ప్రతిరోజు 15 లేక 20 చుక్కలు వరకు సేవిస్తే లాభం ఉంటుంది. చందనపు నూనె, చిన్న యాలకులు, సొంఠితో కలిపి సేవించితే కడుపు మంట తగ్గుతుంది. మూత్రాశయం రోగాలకు, వాతరోగాలకు చందన నూనెను పాలతో కలిపి తీసుకోవలసి ఉంటుంది.

ఇంతేకాకుండా కఫం, దగ్గు మొదలయిన వ్యాధులకు కూడా చందనం ఉపయోగించుకోవచ్చు. చెవిపోటు, దంత బాధలకు చందననూనెను తీసుకోవటం మంచిది. దురదలు, పొడలు ఉంటే గంధపునూనెలో ఆవనూనెను సమపాళ్ళలో కలిపి రాసుకుంటే త్వరగా ఉపశమనం కలుగుతుంది. భారతదేశంలో దొరికే చందనంతో హృదయ సంబంధిత వ్యాధులను నివారణ చెయ్యవచ్చు. చైనా దేశంలో దొరికే ఎఱ్ఱచందనం మూత్రాశయ రోగాలకు మంచి మందుగా ప్రసిద్ధి చెందింది.

అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఎలోఫన్ హెల్త్ కేర్ సెంటర్‌లో డా॥ నికల్సన్ గారు భారత్‌లో దొరికే చందనానికి అత్యంత రోగనిరోధకశక్తి కలదని నొక్కి వక్కాణించారు. దీని ద్వారా ఎన్నో రకాల వ్యాధులను ముఖ్యంగా హృదయ సంబంధ రోగాలను నయం చెయ్యవచ్చని అన్నారు. డా॥నికల్సన్ తన చికిత్సా విధానంలో గమనించిన విషయం

**ప్రేమ తొణికిసలాడే హృదయంలో కోపం ఎప్పుడూ తలెత్తదు**

ఏమిటనగా ఈ చందనాన్ని వివిధ రూపాలలో ప్రయోగించటం వలన అది రక్తధమనుల్లో పేరుకుపోయిన "కొలస్ట్రాల్"ని తగ్గిస్తుంది. ధమనుల గోడలు పలుచబడి రక్తసరఫరాకి అడ్డంకులు పోతాయని తెలిపారు.

తెల్లచందనం చల్లదనాన్ని కలిగిస్తుందని డా॥ నికోల్సన్ తెలిపారు. వడదెబ్బ, అతిసారము, కఫం, బొబ్బలు, శ్వాసకోశవ్యాధులు, జ్వరం, మంటలు, కాలేయం, పిత్తాశయమునకు సంబంధించిన అనేక రోగాలను దూరం చెయ్యవచ్చు. ఊపిరితిత్తుల వ్యాధులను కూడా ఈ చందనం బాగా తగ్గిస్తుంది. జర్మను దేశపు వైద్యులు చందనంతో మూత్రాశయంలో వచ్చే రాళ్ళను మొదలయినవాటిని తొలగించే విధానంలో విజయం సాధించారు. ఇలాంటి ప్రయోగాలే కాకుండా ప్రపంచంలో ఉన్న అనేక ప్రయోగ శాలల్లో చందనం యొక్క వివిధ ఉపయోగాల్ని తెలుసు కోవటం కొరకు అనేక ప్రయోగాలు చేస్తున్నారు. మంచి ఫలితాలు చందనం ద్వారా పొందుతున్నారు. మనం కూడా చందన వినియోగ విషయంలో ఎప్పటికప్పుడు ప్రయోగాలు చేస్తూ ఉండాలి.

ఈ చందనంలో అత్యంత విలువైన ఆధ్యాత్మిక విషయాలు నిక్షిప్తమై ఉన్నాయి. మెదడు శాంతిగా చల్లగా ఉండి సుగంధపు వాసనలతో ప్రసన్నంగా ఉండేందుకు మనం చందనాన్ని తిలకంగా దిద్దుకుంటున్నాము. దీని సువాసనలలో మన అంతరంగం సంతోషం, ఆనందంతో నిండుతుంది. ఈ కారణంగానే చందనం పవిత్రమైనది. పావనమైనది, పాపనాశకమైనది, లక్ష్మీనిలయమైనదిగా, ఆపద-విపత్తుల నుండి రక్షించేదని చెప్పబడింది. ఈ విధంగా దివ్య సుగంధతత్త్వాన్ని తెలుసుకుని భౌతిక, ఆధ్యాత్మిక రంగాలలో లాభాలు పొందవచ్చును. కాబట్టి మనం చందనాన్ని దైవసంబంధ కార్యాలలో, పూజా విధానాలలో మాత్రమేగాక అనేక రకాలుగా ఉపయోగించుకోవచ్చు.

*- అఖండజ్యోతి, జనవరి 2005*
*అనువాదం : జి. చెన్నకేశవరావు*

## దాంపత్య జీవితం యొక్క సుఖ సంతోషాలు

*వనవాస సమయంలో పాండవులు కామ్యకవనాన్ని చేరుకొన్నారు. అక్కడ వారిని శ్రీకృష్ణుడు ఒకసారి సత్యభామా సమేతంగా వెళ్ళి కలుసుకున్నాడు. ద్రౌపది పట్ల పాండవులు యొక్క ప్రసన్నతను, పూర్ణసంతృప్తిని చూచి సత్యభామ ఆశ్చర్య చకితురాలైంది. తాము ఇంత పట్ట మహిషులు ఉండి కూడా శ్రీకృష్ణుని మనస్సును గెలవలేకపోతున్నాం. అటువంటిది ఐదుగురు భర్తలను ఇంతగా ప్రసన్నుల్ని చేసుకోగల్గిన రహస్యం ఏమిటో తెలుపుమని సత్యభామ ద్రౌపదిని కోరింది.*

*దానికి ద్రౌపది "ప్రసన్నంగా ఉండటానికి వినోద విలాసాలే ఆధారంగా భావిస్తున్నారు మీరు. కానీ సత్పరామర్శ, సద్వ్యవస్థల ఆధారంగా నేను నా భర్తల యొక్క అనేక సమస్యలను పరిష్కరిస్తూ ఉంటాను. అంతేకాక వారు ఐదుగురు చేసే శ్రమ కంటే నేను అనేక రెట్లు ఎక్కువ శ్రమిస్తూ ఉంటాను. అందువల్ల నేను నల్లనిదానను, ఒంటరిదానను అయినా కూడా ఐదుగురు భర్తలకు, అత్తగారికి కూడా ప్రాణప్రియురాల్ని కాగలుగుతున్నాను. మీరు కూడా విలాసాలను ప్రక్కన పెట్టి ప్రయోజనకరమైన పనుల పట్ల ఆసక్తిని పెంచుకోగలిగితే మా అన్నగారి మనస్సును అవలీలగా గెలువగలరని చిరునవ్వుతో బదులు పలికింది. ఈ వాస్తవాన్ని సత్యభామ మనసారా స్వీకరించి మిగిలిన పట్టపురాణులందరికీ కూడా తెలియజేసింది. ఆవిధంగా వారందరూ కూడా లాభాన్వితులు కాగలిగేరు.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*
*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

## భక్తి ఉన్నచోట ద్వేషం మనజాలదు

# పద్యం నేపథ్యం

ప్రకృతి నుండి మనిషి ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకుని, ఆ ప్రకృతి విశేషాలను తన ప్రవృత్తితో అన్వయించుకుంటే మనిషి, 'మనీషి'గా మారడం తథ్యం. ఈ సత్యాలను మన పరిసరాలతో అన్వయించి తెలియజేసేవే మన పద్యాలు. భర్తృహరి తన నీతి శతకంలో వివిధ వ్యక్తిత్వాలు, భిన్నధోరణులను వివరించి మార్గదర్శకులయ్యాడు.

"విద్యా వినేయన శోభతే" విద్య వినయంగా ఉన్నప్పుడే శోభిల్లుతుంది. వినయశీలతను, విచక్షను ఇచ్చేదే అసలైన 'పర విద్య'. అన్నీ ఉన్న ఆకు అణిగిమణిగి ఉంటుంది' అనే సామెత కూడా వీరికి వర్తిస్తుంది.

***తరువు లతిర సఫల భార గురుతఁగాంచు***
***నింగి వ్రేలుచు నమృత మొసంగు మేఘం***
***దుద్ధతులుగారు బుధులు సమృద్ధి చేత***
***జగతి నుపకర్తలకు నిది సహజ గుణము***

ఫలములను కల్గి ఉన్న చెట్టు, ఆ ఫలములు అందరికీ అందుబాటులో ఉండాలన్న సత్సంకల్పంతో ఎప్పుడూ తన కొమ్మలను వంచి, వియనశీలతకు ప్రతీకగా ఉంటుంది. నీటితో కూడిన మేఘములు అందరికీ వర్షాలను అందించాలన్న తపనతో, అతి దగ్గరగా ఆకాశంలో వంగి ఉన్నట్లు అగు పిస్తాయి. నీరులేని మేఘాలు అతిదూరంలో అటు ఇటు ఊగుతున్నట్లుంటాయి. అలాగే విషయ పరిజ్ఞానం కల్గిన మేధావులు వినయంగా, అతి తక్కువగా మాట్లాడుతూ అవకాశం వచ్చినప్పుడు మాత్రమే వినయంగా, అతి తక్కువగా మాట్లాడుతూ అవకాశం వచ్చినప్పుడు మాత్రమే తమ విజ్ఞానాన్ని ప్రదర్శిస్తారు. కావున సమయం, సందర్భాలను అనుసరించి, అహంకారం లేకుండా ఆదర్శప్రాయులవుతారు.

కావున మనం నిత్యవిద్యార్థులమన్న భావనతో ఇతరులు మాట్లాడే విషయాలలో మనకు కావలసిన అంశాలను స్వీకరించి, ఇతరులతో విజ్ఞానాన్ని పంచుకోవాలన్న విషయాన్ని కవి వివరిస్తూ, చెట్టు నుండి మేఘం నుండి నేర్చుకోవాల్సిన అంశాలను చక్కగా వివరించారు భర్తృహరి.

పుత్రుడు ఎలా ఉండాలి? 'భార్య' అనే పదానికి పరిపూర్ణత్వం, 'మిత్రుడు' సన్మాత్రుడు కావాలంటే ఎటువంటి ప్రవర్తనను కల్గి ఉండాలి? అనే వ్యక్తిత్వ వికాస ధర్మాలను ఈ క్రింది పద్యంలో ఇలా వివరించారు కవి.

***జనకుని ఁబూజులంగడుఁ బ్రసన్నుని***
***జేయునతండు పుత్రుడే***
***వనిత మెలంగు భర్తృవశవర్తినియై యది సత్కళత్వమే***
***జనుడు విపత్తి సౌర్యా సదృశక్రియలుఁడాతఁడు***
***బునుజగతిన్ లభించుఁగడుఁ***
***బుణ్యముఁ జేసినయట్టి వారికిన్ ॥***

తల్లిదండ్రులను, తన సద్గుణములతో రంజింపచేసెడి "రాముడు" వంటివాడు మాత్రమే యదార్థ పుత్రుడు. తల్లిదండ్రుల మాటను జవదాటక, వారి ఆశలను, ఆశయాలను తెల్సుకుని వాటికి అనుగుణంగా ప్రవర్తిస్తూ, తల్లిదండ్రులకు, వంశానికి మంచి గౌరవాన్ని తెచ్చేవాడే పుత్రుడు. భర్త కష్ట సుఖములలో తోడుగా ఉండి, వాటిని సహిస్తూ, 'పతియే ప్రత్యక్ష దైవం' అన్న ఆర్యోక్తికి అర్థవంతంగానిల్చి, కుటుంబ గౌరవాన్ని, పిల్లలను తీర్చిదిద్దుతూ అత్తమామలు, తల్లిదండ్రులను ఒకే రీతిలో ప్రేమించే వనితయే యదార్థ 'భార్య'. సీతదేవి, ద్రౌపది, చంద్రమతి, సావిత్రి, అనసూయ మొదలైన పతివ్రతలు మన పురాణగాథలలో ఆదర్శ పతివ్రతలుగా నిత్యపూజలందుకుంటున్నారు. 'మిత్రుడు' సన్మిత్రుడుగా ఎపుడు పేర్కొనబడతాడంటే కేవలం శుభాలలో, ఆనంద సమయాలలో మాత్రమే కాకుండా కష్ట కాలంలో, ఆపత్కాలంలో అంటి పెట్టుకుని ఉంటూ, మైత్రి బంధానికి చిరునామాగా నిల్చి, 'సన్మిత్ర' పదానికి సార్థకత చేకూర్చేవాడే సన్మిత్రుడు. 'కర్ణుడు' దుర్యోధనునితో గల మైత్రిబంధానికి

**మన మనస్సులో ఎవరిపట్ల కోపం, ద్వేషం ఉండకూడదు**

విలువనిచ్చి, చివరి క్షణం వరకు స్నేహ ధర్మాన్ని పాటించిన సన్మిత్రుడు కర్ణుడు. అయితే దుర్జన మైత్రి కావడం వల్ల అతని నిష్కల్మష స్నేహానికి మాయని మచ్చగా మిగిలింది. 'దుష్ట చతుష్టయం'లో ఒకడిగా చెడ్డపేరు ఉన్నప్పటికీ, స్నేహం కొరకు సమస్త జీవితాన్ని త్యాగం చేసిన ఆదర్శమిత్రుడు కర్ణుడు.

శరీరంలో అవయవాలు కేవలం భౌతిక అవసరాలకు మాత్రమే కాకుండా, ఆధ్యాత్మిక, సామాజిక ధర్మాలను ఈ క్రింది పద్యంలో భర్తృహరి ఇలా వివరించారు.

***కరమున నిత్యదానము, ముఖంబున సూనృతవాణి***
***యోందలం గురుచరణాభివాదన***
***మకుంఠిత వీర్యము దోర్యుగంబుననన్***
***వరహృదయంబునన్ విశదవర్తన***
***మంచిత విద్య వీనులన్***
***సురుచిర భూషణంబు లివి***
***శూరలకున్ సిరిలేని యప్పుడన్॥***

చేతులు కేవలం భౌతిక అవసరాలైన భోజనం తినడం, వస్తువులను పట్టుకోవడం వంటి పనులకు మాత్రమే కాక, 'దానగుణం'తో పండితులకు సత్కారం, యాచకులకు దానం చేయడం అనే పారమార్థిక ప్రయోజనాలకు ఉపయోగించి నపుడే వాటికి పరిపూర్ణత.

ముఖం అంటే నోరు కేవలం రుచికరమైన పదార్థాలను రుచి చూడడం కొరకు మాత్రమే కాకుండా 'సత్యభాషణం' అనే విశేష గుణానికి అన్వయించాలి. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందన్న సామెత కూడా సత్యభాషణం ఉంటేనే సార్థకత కలుగుతుంది.

శిరస్సు కేవలం కిరీటధారణకు మాత్రమే కాకుండా, శిరోజ అలంకరణకు మాత్రమేకాక, గురువులకు, పెద్దలకు శిరస్సు వంచి ప్రణమిల్లడం అనే విశేష గుణాన్ని కల్గి ఉండాలి. భుజములు, భుజకీర్తులకు మాత్రమే కాకుండా శౌర్యానికి, పరాక్రమానికి చిహ్నంగా, రక్షణకు ప్రతీకగా ఉండాలి. బలమైన బాహువులు సమాజ పరిరక్షణకు తోడ్పడాలి. హృదయం నిర్మలంగా, మనస్సు లో ఎటువంటి చెడు ఆలోచనలు లేకుండా, నిష్కల్మషంగా పరుల హితాన్ని కోరుతూ, నిష్కామతత్త్వంతో ఉండాలి.

చెవులకు కేవలం కర్ణాభరణాలు మాత్రమే కాదు, మంచి మాటలు, శాస్త్రీయ విషయాలు, పౌరాణిక విషయాలు వంటివి వినడం లక్ష్యంగా ఉండాలి. ఇతర లౌకిక విషయాలకు, చెడు విషయాలకు దూరంగా ఉండాలి.

ఇవి సహజపరంగా ఆ భగవంతుడు మహనీయులకు ప్రసాదించిన సద్గుణాలు. వీటి సహకారంతో సజ్జనులు సంపదలు లేనప్పుడు కూడా సహజ గుణాలతో ప్రకాశిస్తారు.

కావున ప్రతి ఒక్కరూ తమ దేహాన్ని, అవయవాలను భౌతికంగా కాకుండా, పారమార్థికంగా అంకితం చేసినపుడే మానవజన్మకు సార్థకం అంటారు ఏనుగు లక్ష్మణ కవి తమ అనువాదంలో.

– సాధన నరసింహాచార్య


దైవీశక్తుల తోడ్పాటుకై
కష్ట నష్టముల నివారణకై
చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై
జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై
జీవితంలో స్థిరపడుటకై

యుగశక్తి  గాయత్రి

మాసపత్రిక చదవండి !
చదివించండి !!
ప్రతుల కొరకై సంప్రదించండి:
ఫోన్: 040-39560330, 7799444248


**లోక కళ్యాణం కోసం చేసే పనుల వల్లనే పుణ్యం లభిస్తుంది**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# కుటుంబమే సమాజ నిర్మాణానికి ప్రయోగశాల

*ఏదైనా ఒక నిగూఢమైన విషయమును అత్యంత సహజంగా, అర్థం చేసుకొనగలిగే రీతిలో అద్భుతమైన రూపంలో మనకు లభించేది పరమపూజ్య గురుదేవుల వాణిలో మాత్రమే! ఇటువంటి అవకాశము మనకు మరెక్కడా లభించదు. సమాజము అభివృద్ధి చెందటానికి కేంద్రబిందువు కుటుంబమే. కాబట్టి మనందరమూ మన కుటుంబాల వికాసానికి పాటుపడాలని ప్రస్తుత ప్రవచనములో వారు ప్రబోధిస్తున్నారు. 'మానవుడు సంఘజీవి. కాబట్టి ఆ సంఘం యొక్క ఉన్నతిని కాంక్షించినట్లయితే అతడు ముందర ఆ ప్రయోగమును తన కుటుంబమనే ప్రయోగశాలలో విజయవంతంగా నిర్వహించాలి. సమాజము యొక్క భౌతికమైన అభివృద్ధిగానీ, దాని యొక్క ఆధ్యాత్మిక ఉన్నతిగానీ ఈ రెండింటి కోసం సంస్కారము, సహకారములనే లక్షణాలను కుటుంబంలో వికసింపజెయ్యటం ద్వారా సర్వత్రా వ్యాపింపజెయ్యవచ్చు' అని కూడా వారు తెలియజేస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమం చేసుకుందాం!*

## వ్యక్తిత్వమే అన్నింటికన్నా గొప్పది

వ్యక్తిత్వ వికాసము సద్గుణములను వృద్ధిచేసుకొనటము మీద ఆధారపడి ఉంటుంది. మానవుడు ఆధ్యాత్మిక, ప్రాపంచిక జీవితాలలో సఫలీకృతుడు కావటానికి ముఖ్యంగా కావల్సింది వ్యక్తిత్వమనే సంపద!! మనిషి దేనిలోనైనా విజయం సాధించాలంటే డబ్బు, సాధనోపకరణములు, ఇతరులకు సహాయసహకారములు మాత్రమే సరిపోవు. ఇవి కూడా కొంతవరకు అవసరమే అయినప్పటికీ అతడి వ్యక్తిత్వమే అన్నింటికన్నా గొప్ప ఆయుధము.



'వ్యక్తిత్వాన్ని ఎలా ఔన్నత్యపరచుకోవాలి? సద్గుణములను, సత్ప్రవృత్తులను ఏవిధంగా అభివృద్ధిచేసుకోవాలి?' అన్నది అన్నింటికన్నా పెద్ద ప్రశ్న. దీనికి ఎవరైనా సమాధానము పొందగలిగితే అతడు ఉజ్జ్వలమైన భవిష్యత్తును నిర్మించుకొనటంలో సగభాగము సఫలీకృతుడైనట్లేయని భావించవచ్చు.

'వ్యక్తిత్వాన్ని ఎలా ఔన్నత్యపరచుకోవాలి?' దీనికోసం ప్రత్యేక మైన స్థలం కానీ, ఏదైనా మార్గం కానీ ఉన్నదా? ఈత నేర్చుకొనటానికి చెఱువులూ-విద్య నేర్చుకొనటానికి పాఠశాలలు-సాంకేతికవిద్య నేర్చుకొనటానికి కర్మాగారాలు వంటి ప్రత్యేక ప్రదేశములు ఉన్నట్లే వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకొనటానికి కార్యక్షేత్రమేదైనా ఉన్నదా?'

## కుటుంబమే వ్యక్తిత్వ వికాసానికి ప్రయోగశాల

వ్యక్తిత్వ వికాసానికి ఒక వ్యక్తి స్వయంగా తనకుతాను ఆలోచించు కోవాలి, ఉపాసన చెయ్యాలి. భావ నలతో పాటు క్రియాన్వితుడు కావాలి. క్రియాన్వితము కావటానికి అవసరమైన కార్యక్షేత్రము కుటుంబమే! ఒక మనిషి తన సద్గుణములను, సత్ప్రవృత్తులను అభ్యసించటానికీ, అభివృద్ధి చేసుకొనటానికీ కుటుంబమే ప్రముఖంగా ఉపయోగపడే స్థానము.

మనిషి ఒంటరిగా ఉంటే అడవిలో ఉన్నట్లే! మనిషి అడవిలో ఉంటే ఎవరితోనూ మాట్లాడలేదు, నేర్చుకొనలేదు,

**ఆధ్యాత్మిక సాధనలు కేవలం పూజా పునస్కారాలకే పరిమితం చేయకూడదు**

ఏమీ చెయ్యలేడు. అడవిలోని ఇతర జంతువులవలె వ్యర్థంగా అటూ ఇటూ తిరగటం తప్ప. ఫలితంగా అతడి జీవితము పూర్తిగా వ్యర్థమైపోతుంది. మనిషి పనిచెయ్యా లంటే నాలుగు దిక్కులా అతని లాంటి మనుషులే ఉండాలి. దానినే కుటుంబము అంటాము. కుటుంబములో ఎన్నోరకాలు, వివిధ స్థాయిల్లో, విభిన్న మనస్తత్వములతో ఉండేవారు ఉంటారు. ఏ స్థాయి మనుష్యుల ఆలోచనావిధానము ఎలా ఉంటుంది? వారి అవసరాలు ఏమిటి? వారి భావములు ఎలా ఉంటాయి? వారితో మెలగటం ఎలా?... ఇవన్నీ నెరవేర్చుకుంటూ తన తెలివితేటలను అభివృద్ధిచెందించుకునే అవకాశము కేవలము కుటుంబము మధ్యనే లభిస్తుంది. అందుచేతనే మనిషిని సంఘజీవి అన్నారు.

## సామాజిక వికాసానికి కూడా కుటుంబమే అవసరము

ఒక పిల్లవాడు ఒక్కడే ఉంటే ఏమవుతుంది? ఆవుదూడ లాగానో, కోతిపిల్లలాగానో చదువుసంధ్యలు లేకుండా, మంచి మర్యాద లేకుండా మొరటుగా తయారవుతాడు. అదే కుటుంబసభ్యుల మధ్య ఉన్నట్లైతే మంచి పరిణతిని, అభివృద్ధిని పొందుతాడు. అలాగే ఆడపిల్లలు కూడా తల్లినుంచీ, ఇతర కుటుంబ సభ్యుల నుంచీ, తోటి స్నేహితు రాళ్ళనుంచీ ఎన్నో అంశాలను నేర్చుకునే అవకాశము ఏర్పడుతుంది. ప్రాపంచికజ్ఞానము ఆడపిల్లలకు కుటుంబంలోనే అలవడు తుంది. ఒంటరిగా ఉంటే జీవనోపాధికి ఉద్యోగం చేసి ధనం సంపాదించగలరు కానీ లోకజ్ఞానం, అనుభవము సంపాదించుకునే అవకాశము వారికి లభించదు. ఒకవేళ కుటుంబము కాకపోయినా మీ బంధువులు, స్నేహితులు, ఆత్మీయులకు చెందిన కుటుంబముతో అయినా కలసి ఉండటము అన్ని విధాలా శ్రేయస్కరము. కుటుంబము నుండి విడివడి ఒంటరిగా ఉండాలనే ఆలోచన చెయ్యటం చాలా తప్పు. కొంతమంది వ్యక్తులు తాము వ్యక్తిగతముగా తమ యొక్క బౌద్ధిక, భావనాత్మక, ఆలోచనాత్మకమైన అభివృద్ధి కోసం కొంతకాలం ఒంటరిగా ఉండాలని కోరుకుని ఇంటినుండి దూరముగా వెళ్తుంటారు. అది వేరే విషయము. ఉపాసనా పరంగా కొందరు గుహలలో నివసించటానికి వెళ్తుంటారు. అందులో తప్పు కూడా లేదు. ఐతే సాధారణ జీవితాలలో అభివృద్ధి లేదా ఔన్నత్యము అనేవి కేవలము కుటుంబ జీవితములో ఉన్నప్పుడే సాధ్యమౌతాయి. అందువలన పిల్లలు మొదలుకొని స్త్రీలు, వృద్ధులూ అందరూ కూడా తమ యొక్క వ్యక్తిత్వ వికాసమునకు కుటుంబములో ఉండటము చాలా అవసరము.

## కుటుంబము యొక్క ప్రాముఖ్యతను అర్థము చేసుకోండి

కుటుంబము యొక్క ప్రాముఖ్యతను తెలుసుకున్న తరువాత ముఖ్యంగా అర్థం చేసుకోవల్సినదేమిటంటే 'కుటుంబ జీవితములో సుఖముగా బ్రతుకు గడపటానికి కావలసిన సౌకర్యాలన్నీ లభించటమే కాదు, విషయవాంఛలను అనుభవించటము మొదలుకొని నవ్వుతూ, ఆడుతూ నిత్యకర్మ లన్నింటినీ నెరవేర్చటానికి కావల్సినవన్నీ పొందగలగటమే కాదు అన్నింటికన్నా ముఖ్యంగా ఇందులో వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకొనటానికి, సద్గుణములనే సంపదను అభివృద్ధి చేసుకొనటానికీ అందరికీ అవకాశము దొరుకుతుంది. అందులో మీరూ, మీ కుటుంబసభ్యులూ ఉంటారు. ప్రత్యేకించి ఇంటి యజమానికి అందరి కన్నా అధికముగా అవకాశము లభిస్తుంది. ఉద్యోగ జీవితములో, వ్యాపార జీవితములో, వ్యవసాయ జీవితములో... వీటన్నింటిలో విడివిడిగా పొంద గలిగిన లక్షణములన్నింటినీ ఒక్క కుటుంబ జీవితములోనే పొందగలము, అభివృద్ధిపరచు కొనగలము కూడా! మీరు ఆత్మీయులుగా భావించేవారి యొక్క, మీరు ప్రేమించేవారి యొక్క వ్యక్తిత్వము వికసించటానికి తగిన సహాయము చెయ్యండి.

కుటుంబములో ఉన్నప్పటికీ ఒక ఖైదీ వలె జీవనము గడిపితే అది ఇంకా పొరపాటు. కుటుంబసభ్యుల యొక్క బాగోగుల గురించి ఆలోచించకుండా, వారి అభివృద్ధికి, వారి ఔన్నత్యమునకూ ఏమాత్రమూ కృషిచేయకుండా,

**ఆధ్యాత్మిక సాధనలతో పరమార్థ ప్రయోజనాలను జోడించాలి**

బాధ్యతా రహితముగా, కేవలము మీపాటికి మీరు భోజనము చేస్తూ కాలం గడుపుతూ కుటుంబములో ఉండటము కూడా నేరమే. కుటుంబసభ్యుల ఉన్నతి పట్ల ఏమాత్రము కుతూహలము చూపించలేని వ్యక్తి తాను కూడా వ్యక్తిగతంగా అభివృద్ధి చెందలేడు. ఎక్కడ మీరు నివసిస్తున్నారో, ఆహారము తీసుకుంటున్నారో, వస్త్రములు ధరిస్తున్నారో, నిద్రిస్తున్నారో, ఉదయము నిద్రలేచి బయటకు వెడుతున్నారో ఆ ఫలానా ప్రదేశము (కుటుంబము)లోని వ్యక్తుల అవసరాలను గానీ, ఇబ్బందులని గానీ, భావసంవేదనలనుగానీ పట్టించుకోనప్పుడు మీరు ఆ ఇంట్లో ఉన్నా ఒక్కటే లేకున్నా ఒక్కటే.

**కౌటుంబిక సిద్ధాంతము - వసుధైవ కుటుంబకమ్**

'వసుధైవ కుటుంబకమ్' అనే అభిప్రాయమును మీలో పూర్తిగా నింపుకోవాలి. 'ఆత్మవత్ సర్వభూతేషు' అనే సిద్ధాంతమును అమలుపరచటానికిగాను, వేదాంత శాస్త్రములను అధ్యయనము చెయ్యటంతోపాటు ఈ సిద్ధాంతమును అభ్యాసములోనికి తీసుకురండి. దీన్ని అభ్యాసములోకి తీసుకురావటానికి భగవంతుడు మనకు ప్రసాదించిన కుటుంబముకన్నా మించిన గొప్ప ప్రయోగశాల ఈ ప్రపంచములో మరొకటి ఏమున్నది? మీరు స్వయముగా ప్రాపంచిక వ్యవహారములో అనుభవజ్ఞులు కాగలరు. కుటుంబములో ఎన్నోరకాలైన వ్యక్తులు ఉంటారు. పిల్లలతో ఎలా వ్యవహరించాలి? పెద్దల నెలా ఆదరించాలి? బంధు జనులతో ఏవిధంగా మెలగాలి? మీ సహవయస్కులతో మీ ప్రవర్తన ఎలా ఉండాలి? కలసిమెలసి భుజించుటలో ఎటువంటి ఆనందం పొందగలము? మొదలైన వన్నీ కుటుంబ జీవితములోనే లభ్యమవుతాయి అని అర్థము చేసుకోండి.

సుఖసౌకర్యములను, బాధలను వేదనలను ఒకరితో నొకరు పంచుకొనటము వల్ల మనిషి ఎంత సుఖముగా, సమున్నతముగా ఉండగలడో కేవలము మీరు కుటుంబ జీవనంలోనే ప్రత్యక్షముగా అనుభవించటము నేర్చుకొనగలరు. కుటుంబమనే ఈ చిన్న ప్రయోగశాలలోనే విభిన్న స్థాయిలలోని వ్యక్తులతో వారివారి స్థాయికి తగినట్లు మర్యాద మన్ననలు నెరవేరటము తెలుస్తుంది. పిల్లలను ఒక కంట ప్రేమిస్తూనే మరొక కంట వారిని సంస్కరిం చటము కూడా అలవడుతుంది. వాళ్ళు అల్లరిచేస్తే బుజ్జగించటము, అవసరమైతే దండించటము... ఇవన్నీ మీరు నేర్చుకొనటమే కాక కుటుంబములోని ఇతరులకు బోధించటము కూడా జరుగుతుంటుంది.

ఇంట్లో ఉంటూ కుటుంబానికి సంబంధించిన ఎన్నో పనులు చెయ్యగలరు. సంఘసేవ కూడా చెయ్యవల్సి ఉంటుంది. 'కుటుంబానికే ఇంత సమయము కేటాయించవల్సి వస్తున్నది. ఇక సంఘసేవ ఎలా చెయ్యగలము?' అని భావించవద్దు. మీ కుటుంబసభ్యులను మంచిమర్యాద మన్ననలతోటి, సంస్కారవంతమైన ప్రవర్తనతోటి రత్నాల వలె తీర్చిదిద్దితే అది పరోక్షముగా సంఘసేవయే అవుతుంది. మీ కుటుంబ వాతావరణమును మంచి సంస్కారవంతముగా ఉంచండి. పిల్లలను ఆరంభము నుంచీ అంతం వరకూ మంచి అలవాట్ల తోటి, మర్యాదలతో జీవించేవిధముగా తర్ఫీదునివ్వండి. తప్పకుండా వారు స్వావలంబులుగా సంస్కారవంతులుగా తయారుకాగలరు.

స్వావలంబులు, సంస్కారవంతులుగా తయారు కావటమనేది ఎక్కువగా వారు నివసించే గృహవాతావరణము మీద ఆధారపడి ఉంటుంది. ఇది పాఠశాలల్లో నేర్పించబడేది కాదు. లేదా ఎవరో ఉపదేశములనిచ్చి మీ హృదయములోకి దింప గలిగేదీ కాదు. మొత్తము కుటుంబం వాతావరణమంతా ఒక ప్రత్యేకమైన రీతిలో ఏర్పాటుచెయ్యబడి, కుటుంబములోని ప్రతి ఒక్కరినీ అందుకు అనుగుణముగా మలచినప్పుడే ఇది సాధ్యమవుతుంది. వాతావరణము మనిషిని తీర్చిదిద్దుతుంది. ఇది మీరు నమ్మితీరాలి.

**కుటుంబములో మంచి సంస్కారములను పెంపొందించండి**

ఇందుకోసము మీరు గృహవాతావరణములో తెలివితేటలు, నిజాయితీలతో కూడిన బాధ్యతాయుతమైన ప్రవర్తన

**ఆధ్యాత్మిక ప్రతిఫలం దేవత్వం**

ప్రతి ఒక్క కుటుంబసభ్యునిలో ఉత్పన్నమయ్యేలా వారిని తీర్చిదిద్దాలి. తద్వారా వారు అందము, తెలివితేటలు, మంచి చదువు, గొప్ప ఉద్యోగము... మొదలైనవాటిని కలిగి ఉండటము వల్ల పొందే గౌరవమర్యాదలకన్నా అధికమైన మర్యాదను పొందగలుగుతారు. దీనికోసం ఇంటిలోనే మంచి శిక్షణా వ్యవస్థను అమలుచేయాలి. మేనేజిమెంట్ అనగా మంచి వ్యవస్థా విధానమును ఇంటిలోనే అమలుచెయ్యటము ఆరంభించాలి. ఒక పెద్ద దేశమునో, ఒక కర్మాగారమునో మీకు అప్పగిస్తే దానిని ఎలా నిర్వహిస్తారో ఆవిధముగా ఇంటిలోని వాతావరణమును కూడా రూపొందించుకోవాలి.

ఇందుకోసము ఏయే గుణములు, లక్షణములు, తెలివితేటలు అవసరమో వాటిని స్వయముగా మీరు నేర్చుకొనటమే కాకుండా కుటుంబములోని ఇతర సభ్యులకు కూడా నేర్పాలి.

## కుటుంబ నిర్మాణముతోనే సమాజ నిర్మాణము జరుగుతుంది

మీరు సంపాదించిన దేదైతే ఉన్నదో దానిని ఒక లెక్క ప్రకారము ఖర్చుచెయ్యండి. అవసరమనుకున్నదానికోసము కొంత మొత్తమును పెంచండి. వ్యర్థమైన పనుల కోసం చేసే ఖర్చుకు అడ్డుకట్టవెయ్యండి. ఈవిధముగా మీరు మంచి ఆర్థిక శాస్త్రవేత్త కాగలరు. ఇంటిని చక్కగా వ్యవస్థీకరించ గలిగినప్పుడు మీరు సాంఘికాభివృద్ధికి కూడా తోడ్పడగలరు. సమాజములో ఎన్నో మంచి అంశములు ఉన్నాయి. చెడు అంశములూ ఉన్నాయి. మంచివాటిని ఏవిధముగా పెంపొందించవచ్చో మీకు అడుగడుగునా అవకాశములు లభిస్తాయి.

నిజానికి ఒక్కొక్క కుటుంబము సంపూర్ణమైన సమాజముగా చెప్పుకోవచ్చు. సమాజములో కోకొల్లలుగా వ్యాపించియున్న మూఢాచారములను సమూలముగా తొలగించి వెయ్యాలి. ఇందుకోసము ఎక్కడికి వెళ్ళాలి? ఎవరెవరిని కలవాలి అంటే మీరు మీ ఇంటినుండే దానిని ప్రారంభించాలి. స్త్రీ పురుషులిరువురూ సమానమే అనే నినాదమును మనము పదేపదే చెప్పుకుంటూ ఉంటాము. దీనిని మీరు ముందుగా మీ ఇంటిలోనే అమలుచెయ్యాలి.

ఇలాగే మరెన్నో ఇబ్బందులు ఉన్నాయి. అందులో సోమరిగా తిరుగుతూ అడుక్కునేవారికి దానము చెయ్యటము, పరిశుభ్రత, పారిశుద్ధ్యము... మున్నగు ముఖ్యమైన అంశములెన్నో ఉంటాయి. వీటన్నింటికోసము, దేశములో స్వచ్ఛత కోసము పోరాటాన్ని లేవనెత్తాలి. దానికి ప్రారంభ వేదిక మీ ఇల్లే కావాలి. మీ ఇంట్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి మరొకరు... వారిని చూచి ఇంకొకరు... ఇలా ఒకరిని చూసి మరొకరు ప్రేరణను పొందగలరు. తద్వారా వాటి ప్రాముఖ్యతను అర్థం చేసుకొనగలరు. మీకు నెలసరి ఆదాయము కొంచెము తక్కువగా ఉంటే కూరగాయలు, ఆకుకూరలు మొదలైనవాటిని ఇంట్లోనే పండించుకోవచ్చును. చిన్నచిన్న కుటీరపరిశ్రమలను నిర్వహించగలిగే మనస్తత్వాన్ని కుటుంబ సభ్యులు పెంపొందించు కోవాలి. దీనివలన మంచి సమీకృతాహారము అందరికీ లభిస్తుంది. తద్వారా బలహీనమైన ఆహారం కాకుండా చక్కని పోషకాహారమును కుటుంబ సభ్యులందరూ పొందవచ్చు.

## సహకారపూరితమైన వాతావరణమును ఏర్పాటు చెయ్యాలి

మరెవ్వరూ చెయ్యలేనంత గొప్పగా మీరు అన్ని సంస్కారములను మీ ఇంటిలోనే చక్కగా అభివృద్ధిచెయ్యండి. కలసిమెలసి ఉండే తత్త్వము, పరస్పరము సహకారమును అందించుకునే విధానము నేటి జీవితములో ఎంతో అవసరము. ఇంటిలోని ప్రతి ఒక్కరూ కలసిమెలసి పని చేసుకునే అలవాటు పెంపొందించుకోవాలి. ఆడవాళ్ళ పని వేరు - మగవాళ్ళ పని వేరు అనే రీతిలో మన గృహ కృత్యములు నిర్వహిస్తూంటాము. ఆడ వారి పనులలో మగవారి సహకారము చాలా తక్కువగా ఉంటుంది. పిల్లలు తల్లిదండ్రులకు పనులలో సహాయము చెయ్యకుండా వాళ్ళ ఆటపాటలతో వాళ్ళు కాలక్షేపము చేస్తూ ఉండటము కూడా తప్పు. ఇంటిలో వృద్ధులైన తాత-అమ్మమ్మ-బామ్మల వంటి వారు ఉంటారు. వారికి చిన్నచిన్న పనులు చేసుకొనటములో

**సంఘర్షణ అనేది జీవితానికి పదును పడుతుంది**

కూడా ఇతరుల సహాయము ఎంతో అవసరము. పెద్దవాళ్ళు పిల్లలకు కావల్సినవన్నీ చేసిపెడుతూనే ఉంటారు. పిల్లలు కూడా పెద్దల పనులలో తమవంతు సహకారమును అందించాలి. ఇంటిలో ఇలాంటి వాతావరణము ఏర్పడి నప్పుడు వాళ్ళు పెరిగి పెద్దయిన తరువాత సమాజము నకు సహకారమును అందించే వ్యక్తులుగా తయారవుతారు. కలసి భోజనము చెయ్యడ మనే ఆధ్యాత్మిక సామ్యవాదమును మీ ఇంటినుండే ప్రారంభించాలి.

'సంయుక్తము' అంటేనే దానిపైన ప్రతి ఒక్కరికి హక్కు ఉంటుంది. అందులో ప్రతిఒక్కరికీ భాగముంటుంది. నేను ఎక్కువ సంపాదిస్తున్నాను గదా అని ఎక్కువగా ఖర్చు చెయ్యకండి. **మీ సంపాదన మీద కుటుంబసభ్యులందరికీ సమానముగా హక్కు ఉంటుంది.** పిల్లల చదువుకు ఎంతో ధనము అవసరమవుతుంది. కుటుంబము పట్ల నిజాయితీతో ఉండండి. మీ కుటుంబము ఒక చక్కని వాతావరణమును ప్రతిబింబిస్తున్నది అని అర్థము చేసుకోండి. ఆ భావన మీకు నిజాయితీని, బాధ్యతనూ నేర్పిస్తుంది. దానిని స్వయముగా మీరు నేర్చుకొనటమే కాదు కుటుంబసభ్యులందరికీ నేర్పించండి. ఇలా చెయ్యగలిగితే మీ కుటుంబము మీకే కాక మీ కుటుంబసభ్యులందరికీ సుఖశాంతులను సమకూర్చగలదు. చందనవృక్షం నుండి వెలువడే సుగంధము నలుచెరగులా వ్యాపించినట్లుగా ఈ శాంతిపూర్ణమైన వాతా వరణము మీ ఇంటిలో మాత్రమే కాదు యావత్ సమాజము లోనూ వ్యాప్తిచెందుతుంది.

'మీరు మీ స్వభావములో సద్గుణములను, మంచి సంస్కారములను అలవరచుకొనగలిగితే యావత్ సమాజ మును అభివృద్ధిపరచి సమున్నతము గావించుటలో మీరు సమర్థులు కాగలరు' అని విశ్వసించండి. మీ కుటుంబము పట్ల బాధ్యతలను నిర్వహించటము కూడా ప్రతి ఒక్కరూ చెయ్యవలసి ఉన్నది.

*– అఖండజ్యోతి, ఏప్రిల్ 2017*

*అనువాదం: శ్రీమతి లక్కరాజు లక్ష్మీరాజగోపాలు*

## వివాహాలలో విలువ ఇవ్వవలసింది గుణానికే గాని వయస్సుకు కాదు

*ఇంగ్లండు చరిత్రలో ప్రఖ్యాతి చెందిన ప్రధానమంత్రి డిజ్రేలీ జీవిత ఆరంభ దినాల్లో దుర్భర పేదరికాన్ని అనుభవించాడు. పత్రికల్లో చిన్న చిన్న వ్యాసాలు వ్రాసి, వచ్చిన కొద్ది మొత్తంతో రోజులు గడుపుకొనేవాడు. ఆయన తనకంటే 12 సం॥ పెద్దదైన స్త్రీని వివాహం చేసికొన్నాడు. ఆమె రూపవతి కాదు, కాని సుగుణాల రాశి. వయస్సుతోపాటుగా పరిపక్వత స్థితినొందిన బుద్ధి, సూక్ష్మదృష్టి గలిగి ఉండేది. భార్య పెద్దదనే విషయం తెలిసి బంధుమిత్రులు హేళన చేస్తూ ఉండేవారు. వాటిని ఈయన కాస్త కూడా పట్టించుకోక తమకంటే చిన్న వయస్కులైన భార్యలు భర్తలకిచ్చేది చపలత్వం, లాలసత్వం, అధికబరువు బాధ్యతలు తప్ప గొప్పవేముంటాయి? కానీ అనుభవజ్ఞురాలైన తెలివిగల ఇల్లాలి ద్వారా లభించే సలహా సంప్రదింపులు భర్తలకు ఉత్కృష్ట మార్గదర్శనాన్ని చేస్తాయి. నేను నా భార్య ద్వారా లభించిన సలహా సత్పరామర్శల వల్లనే ప్రగతి పథంలో అతి వేగంగా పయనించగల్గిన ప్రధాన మంత్రినయ్యాను" అని తెలియజేశాడు.*

*ఈ జంట మధ్యగల గాఢమైత్రి, అన్యోన్యత, అనాటి సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేసేవి. వీరిని ఆదర్శంగా పెట్టుకొని ఆనాడు అనేకమంది యువకులు వయస్సుకికాక, బుద్ధికి, తెలివితేటలకు ప్రాధాన్యతనిచ్చి, వయస్సులో తమకంటే పెద్దవారిని ఆనందంగా వివాహమాడేవారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి గౌరీ సావిత్రి*

**సంఘర్షణ మనలను క్రియాన్వితం చేస్తుంది**

# యుగ సృజేత - జనవరి 2018 నాగపూర్‌లో జరుగనున్న యువక్రాంతి ముగింపు ఉత్సవాలు



2016లో మొదలైన యువ క్రాంతి వర్షోత్సవాల ఫలితంగా దేశంలో ఒక విలక్షణమైన క్రాంతి రూపుదిద్దుకుంది. ఒక భారతదేశంలోనే కాక దేశ విదేశాలలో కూడా ఎన్నో కార్యక్రమాలు జరిగాయి. ఏ దేశానికైనా ఆ దేశయువతనే వెన్నుముక. యువత శక్తివంతులు, ఆరోగ్యవంతులు, వ్యసనాలు లేనివారు, ఆశావాద దృక్పథం కలిగినవారు, ఆత్మావలంబనపై నమ్మకం ఉన్న వారు అయితే ఆ దేశ భవిష్యత్తు ఉజ్జ్వల మైనది అని అర్థం చేసుకోవచ్చు. 1931లో భగత్‌సింగ్ వీరమరణం పొందినప్పటి వాతావరణం, 1942 క్విట్ఇండియా ఆందోళన జరిగినప్పటి వాతావరణం, మళ్ళీ యువక్రాంతి తరంగాల రూపంలో పుట్టుకొచ్చినట్టు అనిపిస్తోంది. ఇది విశేషమైన కాలం. 2016 నుండి 2026 వరకు గల ఈ విశేషమైన కాలవ్యవధిలో తొమ్మిది సంవత్సరాల మాతృశక్తి శ్రద్ధాంజలి మహాపురశ్చరణ చేయాలన్న నిశ్చయం జరిగింది. ఇది గురు పౌర్ణమి, 9 జులై 2017న ప్రారంభమైంది. ఈ కార్యక్రమం విశేషమైనది మళ్ళీమళ్ళీ చెప్పడానికి ఇదే కారణం.

### ముఖ్య ఉద్దేశం

యువతలోని ప్రఖరమైన వ్యక్తిత్వ నిర్మాణాని కోసం సాధనాత్మక జీవనశైలి పట్ల ప్రేరణ కలిగించి, శిక్షణనివ్వడం.

సాధన అంటే ఏదో ప్రత్యేకమైన ఉపాసనా పద్ధతి కాదు. సాధన అంటే స్వీయ నిర్వహణ (సెల్ఫ్ మేనేజమెంట్). ప్రతి ఒక్కరికీ అవసరమైనదే. ఒక ఆదర్శవంతమైన దేశభక్తి కలిగిన యువతను నిర్మించడానికి అవసరమైన శిక్షణనివ్వాల్సిన తరుణం ఇది. ఉపనిషత్తులలో యువత అంటే ఇచ్చిన నిర్వచనానికి తగ్గట్టుగా వారిని తయారుచేయడానికి ఒక కార్యశాల రూపొందించాలి.

**1) "యువస్యాత్ సాధుయువా అధ్యాయకః అశిష్టో దృఢిష్టో బలిష్ఠః"** (తైత్తరీయోపనిషత్ 2వల్లీ అష్టమ అనువాకం) – శ్రేష్ఠ ఆచరణ కలిగినవాడు, అధ్యయనశీలుడు, పాలనా నైపుణ్యం కలిగిన వాడు, దృఢకాయం మరియు ఇంద్రియాలు కలిగినవాడు, అన్నిరకాలుగా బలవంతుడు, ఈ విధంగా యువతకు ప్రశిక్షణ ఇవ్వగలగాలి.

**2)** యువత నైతికంగా, బౌద్ధికంగా మరియు సాంస్కృతికంగా వికసించాలి అంటే స్వాధ్యాయం, చింతన, మనన అనేవి అలవాటుగా మారాలి. వారి నిత్య కార్యక్రమాల్లో భాగమైపోవాలి. **శ్రేష్ఠమైన ఆలోచనల్లో రమించడమే స్వాధ్యాయం.** ఆలోచనలకు తగ్గట్టుగా వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది, ఇది సత్యం. నేడు యువత నిరాశతో జీవిస్తోంది. చాలా త్వరగా నీరుకారి పోతున్నారు. నిరంతరం ఇటువంటి మానసిక స్థితిలో ఉండడం వల్ల వ్యక్తిత్వ వికాసానికి, విజయానికి అడ్డుపడుతుంది. ఇటువంటప్పుడే చెడు వ్యసనాలకు అలవాటుపడతారు. అక్కడి నుంచి పతనం మొదలవుతుంది. వీటన్నిటికీ మందు స్వాధ్యాయం. స్వాధ్యాయానికి మంచి పుస్తకాలను ఎన్నుకోవడం చాలా ముఖ్యం. పరమ పూజ్య గురువుగారు వ్రాసిన సాహిత్యం ఎంతో ప్రేరణ నిస్తాయి, మార్గదర్శనాన్నిస్తాయి.

**3)** సంయమనం వల్ల శక్తి సమకూర్చుకోవడానికి ప్రేరణ లభిస్తుంది. ఆరోగ్య సంరక్షణతో పాటు జీవశక్తి సంవర్ధనకు, నిరంతర చైతన్య పురోభివృద్ధికి సంయమనం చాలా అవసరం. సంయమనంతో వ్యక్తి తన స్వాభిమానాన్ని

సంఘర్షణ ఎలా బ్రతకాలో నేర్పిస్తుంది

జాగృతపరచగలడు; ఆత్మావలంబన కోసం ప్రచండశక్తి లభిస్తుంది. సంయమనానికి చాలా వ్యాపకమైన అర్థం ఉంది. పతంజలి యోగసూత్రాలలో విభూతి పాదంలోని నాలుగవ సూత్రం – **"త్రయమే ఏకత్ర సంయమః".** అంటే, ఏదో ఒక ధ్యేయం మీద ధారణ, ధ్యానం మరియు సమాధి అన్నీ ఒకే సారి జరగడాన్ని సంయమనం అంటారు. సంయమనం వల్ల బుద్ధి వికశిస్తుంది. సంస్కారాలు ప్రబలమవుతాయి. చిత్తం ఏకాగ్రతమవుతుంది. నేడు యువతకు ఇది చాలా అవసరం. కొన్ని చోట్ల సంయమనం శరీరానికి మాత్రమే సంబంధించింది అనుకుంటారు. కాని అది ఆధ్యాత్మిక, మానసిక మరియు శారీరిక తలాలలో జరుగు తుంది. ఆభా మండలం మొదలుకుని మనిషికి తెలసిన సిద్ధులన్నీ సంయమనంతో పొందవచ్చు.

సంయమనం ఉన్న యువత మాత్రమే స్వాభిమానాన్ని జాగృతపరుచుకుని, తమలోని శక్తులను మేల్కొల్పుకుంటారు. స్వావలంబులవుతారు. అన్ని క్షేత్రాలలో, ఏ దృష్టితో చూసినా స్వావలంబన అత్యవసరం. ఆర్థికంగానే కాదు, మానసిక ఆత్మావలంబన మనిషిని అన్ని విధాలుగా సమర్థుడిగా చేస్తుంది. దేశం స్వతంత్రంగా వికసించి, సమృద్ధి చెందాలి అంటే సంయమశీలురైన యువతకు శిక్షణనివ్వడం అవసరం.

**4)** సంవేదన వికసించడం ద్వారా సేవాభావన వికసిస్తుంది – భావ సంవేదన వికసించినవారే ఎదుటివారి బాధలను పంచుకోగలరు. అప్పుడే వారు సేవను సాధనగా చేయగలరు. ఎన్నో రకాల వ్యక్తుల ప్రత్యేక మిశ్రణమే ఒక సమాజం. జాతి, కులం, వర్గాల పేరుతో ఎవరికి వారు గిరి గీసుకునే వారు ఉన్నారు, ఇతరులను ఆ గీత దాటకుండా వివశుల్ని చేసే వారున్నారు, ఆర్థికంగా వెనకబడ్డవారున్నారు, అవ్యవస్థిత విద్యా విధానం వల్ల నిరక్షరాస్యులు ఉన్నారు, పండితులని చెప్పుకునే వారున్నారు, చదువుకున్నా కూడా ప్రావీణ్యం తక్కువున్నవారు ఉన్నారు, అవకాశం దొరకలేదని అస్తమానం ఫిర్యాదు చేసేవారు లెక్కలేనంత మంది ఉన్నారు, ఉన్నత పదవులు ఏలుతున్నవారి కాలి కింద అణిగిపోతున్న వారు ఉన్నారు. చాలామందికి ఆకలి తీర్చుకునేంత ఆహారం కూడా దొరకదు. అబలలనే పేరుతో నారీశక్తిని ఇంట్లోనే బంధిస్తున్నారు. ఒకరి మీద ఆధారపడి, మూఢనమ్మకాలకు బలవుతూ, పురుషుల వల్ల, కుటుంబ మర్యాదల పేరుతో శోషణకు గురవుతున్నవారు కూడా ఉన్నారు.

వీరందరినీ వారి కష్టాలనుండి ముక్తి కలిగించడానికి యువత ఎవరైనా ముందుకొస్తారా? సేవ మరియు సంవేదన లనే రచనాత్మక ప్రక్రియ క్రియాన్వితమైతే వంచితులకి న్యాయం అందుతుంది. వారికి కావలసిన సాధనలు సమ కూర్చిపెడుతుంది. నిజానికి అన్నిటికన్నా పెద్ద ధర్మం సేవాధర్మం. ఎవరి హృదయంలో ఇది మొలకెత్తుతుందో, వారు ఊరికే కూర్చోలేరు. తరువాత ఒకర్ని కాదు, లెక్క లేనంతమందికి సహాయం చేయడానికి ముందుకొస్తాడు. ఇటువంటి సేవా పరాయణుల సముచ్చయమే భారతావని. మన యువత తలుచుకుంటే సంవేదనాపరులందర్నీ ఒకటి చేయగలరు. వారంతా లెక్కలేనన్ని సేవాకార్యాలకు తెర తీయగలరు.

"యుగసృజేత" కార్యక్రమంలో మరో ముఖ్య ఉద్దేశం, దేశంలోని యువతను ఈ నాలుగు క్షేత్రాల్లో సక్రియంగా చేసి రాష్ట్ర ఆరాధనకు అంకితం చేయాలి. ఇంతకుముందు చెప్పుకున్నట్టు నవజాగృతికి ఇది విశిష్ట సమయం. యువత మేలుకుంటే సాధన, స్వాధ్యాయం, సంయమనం, సేవ అనే నాలుగు సోపానాలతో ప్రగతి సాధించి దేశానికి కొత్త ఆధ్యాత్మిక "యుగసృజేత" కార్యక్రమం ద్వారా ఉద్భవించిన యుగ సృజేతలకు నాలుగు పనులు అప్పచెప్పబడతాయి.

**1) వెతకడం:** ఔత్సాహిక, చరిత్రవంతులైన, దేశభక్తి కలిగిన యువతను వెతకడం

**2) మలచడం:** అలా వెతికిన యువతను వివిధ సృజనాత్మక కార్యాలలో శిక్షణనివ్వాలి. సరైన రీతిలో మలచాలి.

**సంఘర్షణ లేని జీవితంలో సంతోషం, ఆనందం స్థిరంగా ఉండవు**

**3) సంఘటీకరణ:** మలచిన యువతను చిన్న చిన్న మండళ్ళు గా (గ్రామీణస్థాయి), స్థానిక (జోనల్) యువ మండళ్ళు / దియా (DIYA) మండలాలుగా ఏర్పర్చాలి. అందంగా మలచిన ముత్యాలన్నీ మాణిక్యాలను ఒక హారం లాగా అల్లాలి. అందరూ ఒకేమాట మీద నిలవాలి.

4) ఈ సంఘాలుగా ఏర్పడ్డ యువత ద్వారా యుగనిర్మాణ ప్రక్రియ సక్రియమవుతుంది. నూతన సాంస్కృతిక దృష్టితో భారతాన్ని నిర్మించడానికి వారి భూమిక ఏమిటో స్పష్టం చేయాలి. భరతమాత మహాకాలుడికి వీరి ద్వారానే మణుల మాలను అలంకరింపచేయాలి.

### కొన్ని సన్నాహాలు

ఒక యుగాంతర చైతన్యమే ఈ పనులన్నీ చేయిస్తోంది. మనం అందరం నిమిత్త మాత్రులం. నలుదిక్కుల నుండి రథాలు వాటివాటి గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయి. యువ సమూహాలు చర్చించుకుని ఇప్పట్నుంచే పనులు ప్రారంభించడానికి అవసరమైన కొన్ని ముఖ్య సూత్రాలు –

1) సక్రియ మండళ్ళు వీలైనంత పెద్ద ఎత్తున, జిల్లా స్థాయిలో మీటింగులు ఏర్పాటు చేసుకోవాలి. పాల్గొనా లనుకునే వారికి నమోదు చేయించే బాధ్యత అప్ప చెప్పాలి. ఆ తరువాత www.diya.net. in లేదా www.awgp.org లో నమోదు చేసి శాంతికుంజ్ నుండి స్వీకృతి పత్రాన్ని పొందాలి.

2) పాల్గొనేవారి ప్రత్యేకతలు, చేసిన పనులు మొదలైన వివరాలను అందులో పొందుపరచాలి.

3) నమోదు చేసుకున్నాక ఎస్.ఎమ్.ఎస్ లేదా ఇ-మెయిల్ ద్వారా స్వీకృతి పంపబడుతుంది. వారు మాత్రమే కార్యక్రమంలో పాల్గొనగలరు.

4) రాష్ట్రస్థాయిలో టీములు ఏర్పర్చుకుని, శాంతికుంజ్ నుండి శిబిరార్థులు స్వీకృతిని పొందగలరు. 15 నుండి 45 సంవత్సరాల మధ్య సోదర సోదరీమణులు మాత్రమే పాల్గొనగలరు.

5) ప్రాంతాల సాంస్కృతిక ప్రత్యేకతకు ప్రతీకగా మీ బ్యానర్లు రూపొందించుకుని ఉంచుకోవాలి.

6) యుగనిర్మాణ ఆందోళనలను ప్రదర్శించాలి. ప్రాంతాల వారీగా వాటి వీడియోలు తయారుచేసుకోవాలి. కాల వ్యవధిని దృష్టిలో ఉంచుకోవాలి. ప్రాంత మొత్తంలో జరిగిన చెప్పుకోదగ్గ కార్యాలన్నిటినీ పొందుపరచగలగాలి.

7) ప్రదర్శనకు తయారు చేసుకున్న మ్యాటర్ యొక్క ప్రింట్ కాపీ, ఎలక్ట్రానిక్ మరియు వీడియో కాపీలు ముందు గానే శాంతికుంజ్‌కి పంపించి ఆమోదనకి ఎదురు చూడాలి.

8) విజయాల కథలు పంపించండి. ఎవరో ఒకరి గొప్ప తనాన్ని కాక సమూహంగా చేసిన కార్యాల విషయాలు పంపండి.

9) విజన్ 2026 (VISION 2026) కోసం అందరూ సూచనలు పంపగలరు.

10)కార్పొరేట్ జగత్తులోని యువత, మహావిద్యాలయాలు – విశ్వవిద్యాలయాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనేటట్టు ప్రయత్నాలు చేయాలి.

11)రథయాత్ర జరుగుతున్న రూట్ ఇవ్వబడింది. దాని గురించి ముందే తెలుసుకుని అక్కడ మీ ప్రదర్శన కూడా ఏర్పాటు చేసుకోగలరు.

12)సాంస్కృతిక కార్యక్రమాల వీడియోలు ముందుగానే శాంతికుంజ్‌కు పంపగలరు. అనుమతి లేదా ఎడిటింగ్ అయ్యేంతవరకు వేచి ఉండండి.

అందరూ ఉత్సాహపూర్వకంగా కార్యక్రమంలో పాల్గొం టారని ఆశిస్తున్నాము. దీనితో మిషన్‌కు కొత్త రూపు దాలుస్తుందని భావిస్తున్నాం.

– *అఖండజ్యోతి, నవంబరు 2017*

*అనువాదం: మారెళ్ళ విశ్వనాథ్*

**సంఘర్షణ అనే తాళం చెవి జీవితంలో మూసివేయబడుతున్న తలుపులను తెరవగలదు**

ఆరోగ్య సూత్రాలు-4

# హోమియోపతి వైద్య విధానం

హోమియోపతి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న వైద్యపద్ధతి. ముఖ్యంగా భారతదేశంలో దీనికి లభిస్తున్న ప్రజాదరణ ప్రపంచంలో మరెక్కడా లేదనటం అతిశయోక్తి కాదు. ఈ పద్ధతి దరిదాపు రెండువందల ఏళ్ళబట్టీ వాడుకలో ఉన్నప్పటికీ దీనికి శాస్త్రీయమైన పునాదులు లేవనే నింద ఒక చెరగని మచ్చలా ఉండిపోయింది. ఆధునిక శాస్త్రీయ దృక్పథంతో చూస్తే ఈ నిందారోపణ సబబయినదే అనిపిస్తుంది. కానీ హోమియోపతి వైద్యం వల్ల వ్యాధి నయమైన వారు ముందుకు వచ్చి ఇచ్చే సాక్ష్యం సంగతి ఏమిటని ప్రతి సవాలు చేసేవారు ఉన్నారు.

### చరిత్ర

హోమియోపతి అన్నది హోమోయిస్ (ఒకే రకమైన), పేథోస్ (బాధ, రోగ లక్షణం) అనే రెండు గ్రీకు మాటలని సంధించగా పుట్టిన మాట. కనుక కావలిస్తే దీనిని తెలుగులో సారూప్య లక్షణ వైద్యం అనొచ్చు. ఉష్ణం ఉష్ణేన శీతలం అన్నట్లు, వజ్రం వజ్రేనభిద్యతే అన్నట్లు ఒక పదార్థం ఏ బాధని కలిగిస్తుందో ఆ బాధని నివారించటానికి అదే పదార్థాన్ని మందుగా వాడాలి అన్నది హోమియోపతి మూల సూత్రం. ఈ వైద్య పద్ధతిని, ఈ మాటని కనిపెట్టినది "శామ్యూల్ హానిమాన్ (Samuel Hahnemann 1755-1843) అనే జర్మనీ దేశపు వైద్యుడు. ఈయన వైద్యకళాశాలకి వెళ్ళి లక్షణంగా అప్పటి వైద్యశాస్త్రం అధ్యయనం చేశాడు. ఆ రోజులలో వైద్యం అంటే నాటు వైద్యమే. రోగానికి కారణం మలినపు రక్తం అనే నమ్మకంతో రక్తనాళాలని కోసి రక్తం ఓడ్చేసేవారు. దేహనిర్మాణ శాస్త్రం (ఎనాటమీ), రోగనిర్ణయ శాస్త్రం, రసాయనశాస్త్రం, రసాయనశాస్త్రం అప్పటికి ఇంకా బాగా పుంజుకోలేదు. కనుక అప్పటి వైద్య విధానాలలో హానిమాన్‌కి లోపాలు కనిపించటం సహజం. ఈ లోపాలని సవరించటానికి ఆయన ఒక కొత్త పద్ధతిని కనిపెట్టాడు. అదే హోమియోపతి. హోమియోపతి వాడుకలోకి వచ్చిన తరువాత హోమియోపతి భక్తులు ఇప్పుడు వాడుకలో ఉన్న "ఇంగ్లీషు వైద్యాన్ని" ఎల్లోపతీ అనటం (allopathy) మొదలు పెట్టారు. అంతేకాని ఇంగ్లీషు వైద్యులు ఎవ్వరూ వారి వైద్యపద్ధతిని "ఎల్లోపతీ" అని అనరు.

దాదాపు రెండున్నర శతాబ్దాల క్రితం పుట్టిన ఈ పద్ధతి కాలక్రమేణా కొన్ని మార్పులు చెందింది. మొదట్లో హానిమాన్ ప్రవచించిన పద్ధతిని సనాతన హోమియోపతి (classical homeopathy) అనీ, ఇప్పుడు వాడుకలో ఉన్న పద్ధతిని అధునాతన హోమియోపతీ అనీ అందాం. కాని ఇక్కడ విచారణ చేసేది'

### మూలసూత్రాలు, ఆక్షేపణలు

హోమియోపతి వైద్యానికి కొన్ని మూలసూత్రాలు ఉన్నాయి.

**మొదటి సూత్రం:** మనం ఇచ్చే మందు రోగానికి, రోగ లక్షణాలని తగ్గించటానికి కాదు; మనిషికి ఒకే రోగం అందరిలోనూ ఒకే లక్షణాలని చూపించదనేది సర్వులూ గమనిస్తున్న విషయమే. ఇది పటిష్టమైన సూత్రమే అని మానసిక శాస్త్రంలో ప్రావీణ్యత ఉన్నవారు ఒప్పుకుంటున్నారు. ఈ సూత్రానికి "mind over matter" అని ఇంగ్లీషులో భాష్యం చెప్పొచ్చు. కనుక రోగి ఎన్ని లక్షణాలు ఏకరువు పెట్టినా వాటన్నిటికి ఒకే ఒక మూల కారణం ఉంటుందనేది వీరి సిద్ధాంతం. కనుక రోగి ఎన్ని లక్షణాలు ఏకరవు పెట్టినా వాటన్నిటికి ఒకే ఒక మందు (remedy) ఇస్తారు. సనాతన హోమియోపతిలో. మందుల ఖాతాలో ఉన్న ఏ మందు ఏ రోగికి నప్పుతుందో ఎంపిక చెయ్యటం చాలా కష్టం. పది పుస్తకాలు చదివినంత మాత్రాన అబ్బే ప్రతిభ కాదు ఇది; అనుభవం ఉండాలి. అందుకనే హోమియోపతి వైద్యం అందరి చేతిలోనూ రాణించదు. అందుకనే కాబోలు, అధునాతనులు ఈ సూత్రాన్ని సమయానుకూలంగా విస్మరిస్తారు.

**జీవితంలో సంఘర్షణ అనేది గొప్పవరం**

**రెండవ సూత్రం:** రోగికి ఏ మందు ఇవ్వాలనే ప్రశ్నకి సమాధానం చెబుతుంది. ఈ సూత్రం. ఆరోగ్యంగా ఉన్న ఒక వ్యక్తి చేత ఏదైనా మందు తినిపించినప్పుడు కలిగే లక్షణాలకు అటువంటి రోగ లక్షణములు కలిగిన రోగికి అదే పదార్థం మందుగా పనిచేస్తుంది. ఈ సూత్రానికి "ఉష్ణం ఉష్ణేన శీతలం" అని సంస్కృతంలో భాష్యం చెప్పొచ్చు. ఈ సిద్ధాంతాన్నే లాటిన్ భాషలో similia similibus curentur అంటారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి సింకోనా తింటే చలిజ్వరం లక్షణాలు కనిపించేయనుకుందాం. అప్పుడు చలిజ్వరంతో బాధపడే రోగికి అతి చిన్న మోతాదులలో సింకోనా ఇస్తే రోగ లక్షణాలు ఉపశమించి, క్రమేపీ రోగం నయమవుతుందని సనాతన హోమియోపతి వాదిస్తుంది. ఎల్లోపతీ వైద్యంలో కూడ ఈ సూత్రం ఉంది. టీకాల మందులు దీనికి ఒక ఉదాహరణ. ఏ రోగం బారి నుండి తప్పించుకోవాలంటే ఆ రోగం లక్షణాలని శరీరంలో పుట్టి స్తుంది టీకాల మందు కలరా, మసూచికం (స్మాల్‌పాక్స్), పోలియో, టెటనస్, న్యూమోనియా, ఫ్లూ మొదలైన వాటికి ఎన్నింటికో "టీకాల మందులు vaccinations కనిపెట్టారు. పుప్పొడి (pollen) పడని వాళ్ళకి కూడా టీకాల మందులు ఉన్నాయి. మలేరియా వంటి వ్యాధులకి కూడా టీకాల మందుల కోసం వేట సాగుతోంది. కనుక ఈ సూత్రంలో లోపం లేదు. కాని ప్రాయోగికమైన విషయాలలో భేదా భిప్రాయాలు ఉన్నాయి. ఉదాహరణకి, టీకాలు వేయించు కున్న వ్యక్తి రక్తం పరీక్ష చేసి చూస్తే టీకాల వల్ల శరీరంలో వచ్చిన మార్పు (ప్రతికాయాలు (antibodies) కనిపించటం) ఏమిటో స్పష్టంగా కనిపిస్తుంది. అంటే టీకామందు వల్ల శరీరం ఎలా స్పందిస్తుందో రక్తం పరీక్ష చేసి మనం రుజువు చూపించవచ్చు. హోమియోపతి మందు వేసుకున్న తరువాత శరీరంలోని రక్తంలో కాని, జీవకణాలలో కాని ఎటువంటి మార్పు వస్తుందో ఇంతవరకు ఎవ్వరూ ప్రమాణాత్మకంగా రుజువు చేసి చూపించలేక పోయారు.

**మూడవ సూత్రం:** ఇచ్చే మందు అతి సూక్ష్మమైన మోతాదులో ఇవ్వాలి. సాధారణంగా రోగి వేసుకొనే మూడు మాత్రలలో మందు ఒక పాలు ఉంటే పంచదార (కాకపోతే ఆల్కహాలు, కాకపోతే నీళ్ళు) 1,000,000,000,000 పాళ్ళు ఉంటుంది. ఇంత తక్కువ మోతాదులో ఉన్న మందు ఎలా పని చేస్తుందో, దాని వెనక ఉన్న తర్కం ఏమిటో ఇంతవరకు ఎవ్వరూ నిక్కచ్చిగా రుజువు చేసి నిర్ద్వందంగా చెప్పలేకపోయారు.

**తథాస్తు ప్రభావం:** ఇంగ్లీషులో ప్లసీబో (placebo) అనే మాట ఉంది. లేటిన్‌లో ఈ మాటకి "అలాగే! సంతోషిస్తాను" అనే అర్థం ఉంది. అలాగే వైద్యశాస్త్రంలో "ఈ మందు గుణం చేస్తుంది" అని చెప్పి వైద్యుడు పంచదార మాత్రలు ఇచ్చినా కొందరిలో గుణం కనిపిస్తుంది. ఈ దృగ్విషయాన్ని శాస్త్రీయ పద్ధతిలో అనేక కోణాల నుండి రుజువు చేశారు. ఈ సందర్భంలో ఔషధం లేని ఉత్త పంచదార మాత్రలని ప్లసీబో అంటారు. దీనిని తెలుగులో "తథాస్తు మందు" (placebo) అనిన్నీ, ఈ ప్రభావాన్ని తథాస్తు ప్రభావం (placebo effcet) అనిన్నీ అనొచ్చు. ఎందుకంటే సంస్కృతంలో తథాస్తు అంటే "అలాగే జరుగుతుంది" అని అర్థం కనుక.

హోమియోపతి వాడకంలో కనిపించే గుణం కేవలం తథాస్తు ప్రభావమే అని ఆధునిక శాస్త్రీయ దృక్పథపు వాదన. తథాస్తు ప్రభావం వల్ల కనిపించే గుణం ఉత్త ఊహాజనితమూ కాదు, మనస్సు మనని మభ్యపెట్టటమూ కాదు. ఈ ప్రభావం వల్ల వ్యాధి నిజంగా నయం అవుతుంది. నమ్మకంతో తులసి దళంతో నూతినీళ్ళు తాగినా కొందరిలో గుణం కనిపిస్తుంది. అలాగని నూతినీళ్ళకి మహత్తు ఉందనడం శాస్త్రీయం అనిపించు కోదు. వచ్చిన చిక్కల్లా ఈ తథాస్తు ప్రభావం అందరిలోనూ కనిపించదు. ఈ దృగ్విషయం (phenomenon) పరిపూర్ణంగా అర్థం అయిననాడు హోమియోపతి వైద్యం కూడా ఎలా పని చేస్తున్నదో అర్థం అవటానికి సావకాశాలు ఉన్నాయి.

## ప్రజాదరణకి కారణాలు

**హోమియోపతి మందులు:** హోమియోపతి శాస్త్రీయత లేని ఒక బూటకపు వైద్య పద్ధతి అనే ఆక్షేపణ ఒకటి బహుళ ప్రచారంలో ఉన్నప్పటికి, హోమియోపతి పద్ధతికి ప్రజలలో,

**విలువైనదేది అంత తేలికగా హస్తగతం కాదు**

కొన్ని పరిధులలో ఆదరణ ఉంది. ఉదాహరణకి బడుగు దేశాలలోనూ, బీదవారిలోనూ ఉన్న ఆదరణ సంపన్న దేశాల లోనూ, సంపన్నులలోనూ లేదు. సంపన్న దేశాలలో కూడా మిగిలిన దేశాలతో పోల్చి చూస్తే అమెరికాలో ఆదరణ చాలా తక్కువ. ఇదేవిధంగా విద్యాగంధం తక్కువ ఉన్న వారిలో ఉన్న ఆదరణ విద్యావంతులలో లేదు. విద్యావంతులలో కూడా ఆధునిక శాస్త్రంతో పరిచయం లేని వారిలో ఉన్న ఆదరణ శాస్త్రం తెలిసిన వారిలో లేదు. ఏది ఏమయి నప్పటికీ, ఎన్ని ఆక్షేపణలు ఉన్నప్పటికీ, హోమియోపతి వైద్యం రెండున్నర శతాబ్దాల కాలం నిలదొక్కుకోటానికి కారణాలు లేకపోలేదు.

1. హోమియోపతి వైద్యం, మందులు (కనీసం భారత దేశంలో) బాగా చౌక - ఇంగ్లీషు మందులతో పోల్చి చూసినా ఈ వైద్యం భారతదేశంలో చౌకే. కనుక బీదవారికి అందుబాటులో ఉన్న పద్ధతి ఇది.
2. సరైన మందు వేసుకుంటే గుణం కనిపిస్తుంది. త్వరగా కనిపిస్తుంది. చేసిన గుణం తాత్కాలికం కాకుండా శాశ్వతంగా ఉంటుంది.
3. హోమియోపతి మందులు హాని చెయ్యవు. ఒకవేళ సరైన మందు పడకపోతే గుణం కనిపించదు
4. హోమియోపతి మందులు ప్రకృతిలో దొరికే పదార్థాల తోటి తయారవుతాయి గాని కృత్రిమంగా సంధించబడ్డ రసాయనాలు కాదు.
5. హోమియోపతి మందులు బాహ్య లక్షణాలని అదుపులో పెట్టటానికి ప్రయత్నించవు. బయటికి కనిపించే లక్షణాలకి మూలహేతువు ఏదో వాటిమీద పనిచేస్తాయి. ఉదాహరణకి జ్వరం, దగ్గు మొదలైనవి బయటికి కనిపించే లక్షణాలు. ఈ లక్షణాలు పొడచూపగానే వాటిని వెంటనే అణచి పెట్టటానికి మందు వేసుకుంటే అసలు కారణం కప్పడి పోతుందని ఆధునిక వైద్యశాస్త్రం కూడా అంటుంది.
6. హోమియోపతి పూర్ణ దృక్పథ (holistic) సిద్ధాంతం. అంటే రోగిని ఒక రోగాల పుట్టలా కాకుండా ఒక వ్యక్తిగా చూసి, రోగికి ప్రస్ఫుటంగా కనిపించే బాహ్య లక్షణాలతో పాటు, రోగి మానసిక స్థితిని, మూర్తిత్వ వ్యక్తిత్వాలని సమీక్షించి, రోగ లక్షణాలని కాకుండా రోగ కారణాలని దృష్టిలో పెట్టుకుని ఔషధ నిర్ణయం చెయ్యాలంటుంది.

**చిక్కులు:** జలతారు పోగుల మధ్య నల్ల బట్ట ఉన్నట్లు, హోమియోపతి సిద్ధాంతాలు చెప్పటానికి, వినటానికి బాగానే ఉంటాయి కాని, వీటిని ఆచరణలో పెట్టటంలో కొన్ని చిక్కులు ఉన్నాయి. రోగితో కనీసం గంటయినా గడపకుండా రోగ నిర్ణయం చేసి ఔషధాన్ని ఎంపిక చెయ్యటం కష్టం. సరైన ఔషధం ఎంపిక చెయ్యకపోతే గుణం కనిపించదు. హోమియోపతిలో తలనొప్పికి ఫలానా, జ్వరానికి ఫలానా అంటూ మందులు లేవు. తలనొప్పి ఎక్కడ వస్తున్నది, ఎప్పుడు వస్తున్నది, ఎప్పుడు ఉద్రేకం (aggravation) అవుతున్నది, ఎప్పుడు ఉపశమనం (amelioration) అవు తున్నది, రోగి మూర్తిత్వ వ్యక్తిత్వాలు ఏమిటి, వగైరా ప్రశ్నలన్నింటికి సమాధానాలు రాబట్టాలంటే సమయం పడుతుంది.

*- డా॥ టంగుటూరి నీలవేణి, బి. హెచ్. ఎమ్. ఎస్.*

## పండుగలు

**డిసెంబర్ 2017**

| | |
|---|---|
| 03-12-2017 | దత్తాత్రేయ జయంతి |
| 25-12-2017 | క్రీస్తు జయంతి (క్రిస్మస్) |
| 29-12-2017 | వైకుంఠ ఏకాదశి |
| 30-12-2017 | శ్రీ రమణ మహర్షి జయంతి |

**జనవరి 2018**

| | |
|---|---|
| 12-01-2018 | స్వామివివేకానంద జయంతి |
| 14-01-2018 | మకరసంక్రాంతి |
| 23-01-2018 | సుభాష్‌చంద్రబోస్ జయంతి |
| 26-01-2018 | గణతంత్రదినోత్సవం |

**మనిషి తాను ఎంచుకున్న లక్ష్యమును సాధించేవరకు ఘర్షణ పడవలసినదే**

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## భారత యువాక్రాంతి రథయాత్ర - మన భారతయాత్ర మొబైల్ స్క్రీన్ వీడియో

ఖమ్మం తేది. 20.10.2017 నాడు రథం వచ్చినది. ఆ రోజు గాయత్రీ పరివార్ ఖమ్మం సభ్యులు ఖమ్మం శివారులో స్వాగతం పలికి, కలశపూజ నిర్వహించి నేరుగా స్వర్ణభారత ఇంజనీరింగ్ కళాశాలకు తీసుకు వెళ్ళటమైనది. అక్కడ విద్యార్థులకు, యువతకు వీడియో ప్రదర్శన ఇవ్వట మైనది. భోజన విరామం తరువాత, విజయలక్ష్మి ఇంజ నీరింగ్ కాలేజీలకి వెళ్ళి అక్కడి విద్యార్థులకు వీడియో ప్రదర్శన చూపించి వారిని చైతన్యపరచటమైనది.

ఈ కార్యక్రమములో వందలాది విద్యార్థులు పాల్గొని ఎంతో ఆసక్తిగా ప్రదర్శనను తిలకించి ప్రభావితులైనారు.

తరువాత గవర్నమెంట్ డిగ్రీ కాలేజి గ్రౌండ్స్‌లో ప్రదర్శన ఇవ్వటమైనది. దీనిలో గాయత్రీ పరివార్ సభ్యులు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొని కలశపూజ నిర్వహించిన తరువాత మొబైల్ వీడియోను తిలకించినారు.

ఈ కార్యక్రమంలో హరిద్వార్ సభ్యులైన ఉమేష్‌శర్మ, మోజేష్ శర్మ, యాదవ్, సంజయ్ మరియు ఖమ్మం సభ్యులు బాలకృష్ణచౌదరి, పద్మ, వెంకయ్య, ప్రసాద్, ఉమా మహేశ్వర రావులు పాల్గొన్నారు.

## అశ్వమేధ శక్తికలశ రథయాత్ర, ఖమ్మం

అశ్వమేధ శక్తి కలశ రథయాత్ర తేది. 07.11.2017 నాడు ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు మండలమునకు ఉ॥11 గం॥లకు ప్రవేశించినది. శక్తి కలశ రథానికి గాయత్రీ పరివార్ సభ్యులు, నూతక్కి బాలకృష్ణ, వెంకయ్య, ఉమా మహేశ్వరరావుగార్ల మరియు ఏన్కూరు మరియు ఇతర గ్రామ పరిజనులు, కోలాట నృత్యంతో స్వాగతం పలికి, రామాలయంలో శక్తి కలశపూజ మరియు హారతి ఇవ్వటం జరిగినది.

ఈ కార్యక్రమం ముగించుకుని, తల్లాడ, నారాయణ పురం, వైరా, కొణిజర్ల, తనికెళ్ళ మండలాలలో యాత్ర జరిపి రాత్రికి ఖమ్మం రావటం జరిగినది.

తేది 8,9,10, తారీఖులలో ఖమ్మం జిల్లాలో దాదాపు అన్ని మండలములో అనగా ఖమ్మం పట్టణం, ముదిగొండ, కుసుమంచి, తిరుమలాయపాలెం, బోనకల్లు, మధిర, కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్ల, దమ్మపేట మరియు కృష్ణాజిల్లా లోని గొల్లముడి గ్రామంలో రథయాత్ర జరిగినది.

శక్తి కలశములను వేలసంఖ్యలో దర్శించుకొని ఎంతో సంతోషపడినారు. జిల్లాలో చాలా స్పందన వచ్చినవి. దాదాపు 500 మంది మంగళగిరిలో జరిగే అశ్వమేధ యజ్ఞానికి రావటానికి ఎంతో ఉత్సాహముగా ఉన్నారు.

ఈ జిల్లాలో దాదాపు రూ. 80,000/- (ఎనభై వేల రూపాయలు) అంశదానంగా వచ్చింది.

ఈ యాత్రలో రెండు రోజులు సాయంత్రం దీపయజ్ఞం కూడా చేయటం జరిగినది. దీపయజ్ఞమునకు కూడా భారీ స్పందన వచ్చినవి.

ఈ యాత్రలో పాల్గొన హరిద్వార్ ప్రతినిధులు శ్రీ ఫూల్‌సింగ్ మరియు ఇతరులు ఈ జిల్లాలో వచ్చిన స్పందన మరియు రథయాత్రకు చేసిన ఏర్పాట్లు చూసి చాలా సంతోషం తెల్పినారు.

ఈ కార్యక్రమంలో (7 నుండి 10 వరకు) నూతక్కి బాలకృష్ణ, పద్మ, వెంకయ్యగారు ప్రసాద్, ఉమామహేశ్వర రావు, బలరాం, రామరావు మరియు ఇతర మండల ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు.

**మనస్సులో లక్ష్యమును సాధించాలనే ఆకాంక్ష ఉండి తీరాలి**

## విశేష ఆదరణకు నోచుకుంటున్న శక్తి కలశరథము

మనందరికీ తెలిసినదే 2017 సెప్టెంబర్ 21న ప్రారంభమైన తమ యాత్రను కొనసాగిస్తున్న శక్తి కలశరథాలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో శ్రద్ధను ఇనుమడిస్తూ ముందుకు వెళ్తున్నాయి. గత సంచిక మీ చేతులలోకి చేరుకునే సమయానికి శక్తి-కలశ రథము తెలంగాణలోని పాత కరీం నగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో తన శక్తితో జనుల హృదయాలను భక్తి పారవశ్యంలో నింపుతూ నవంబర్ ఒకటవ తేదికి ధర్మసాగర్ ప్రాంతమునకు చేరుకుంది. అక్కడ సదానందం గారు వారి బృంద సహకారంతో తన లక్ష్యాన్ని సాధించుకుంటూ వరంగల్ పట్టణం చేరుకొని పట్టణములోని గాయత్రీ సాధకులను అనుగ్రహించింది. ఇందుకు కావలసిన ఏర్పాట్లు, సహకారం అంతా శ్రీ వనమా సురేష్‌గారి మార్గదర్శనంలో వరంగల్ కార్యకర్తలు అందించారు. అక్కడ నుంచి తొర్రూరు ప్రజలను అనుగ్రహించి వారిని అశ్వమేధ యజ్ఞంనకు ఆహ్వానించి భద్రాచలం రామయ్యదగ్గరకు పరుగులు తీసింది. ఆనాడు మీరు అశ్వమేధం చేశారు ఈనాడు మేము చేస్తున్న ఈ ప్రయత్నానానికి అనుగ్రహ ఆశీస్సులు ఇవ్వమని రామయ్యను ప్రార్థించి భద్రాచలం, కొత్తగూడెం, ఏకనూర్, ఇల్లందు, తల్లాడ, వైరా, కొనిజర్ల చుట్టుప్రక్కల ప్రాంతాల భక్తులకు తన అనుగ్రహాన్ని అందించింది. ఇందు కోసం ఇల్లందు శాఖ ప్రముఖులు శ్రీ సతీష్ ఖండేల్వాల్ గారి మార్గదర్శనంలో భద్రాద్రి కొత్తగూడెం కార్యకర్తలు ఎంతో శ్రమించారు. అక్కడ నుంచి ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించి ఖమ్మం పట్టణం, నెలకొండ పల్లి, తిరుమలపాలెం, ముదిగొండ, బోన్‌కల్, మధిర, అగ్రహారం చుట్టుప్రక్కల ప్రాంతాలను చుట్టి వచ్చి తిరిగి తన మార్గంలో దమ్మపేట గ్రామమునందుగల గాయత్రీ ఆశ్రమ భక్తులకు శ్రీ రమణమూర్తిగారి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించుకొని అందరిని అశ్వమేధానికి ఆహ్వానం పలుకుతూ తన ప్రస్థానంలో ముందుకు వెళ్ళింది. అక్కడ నుంచి ఆంధ్రా రాయలసీమలోకి నవంబర్ మాసం పదమూడవ తారీఖున ప్రవేశించింది. కర్నూల్ పట్టణము, వెల్దుర్తిలో నూతనంగా నిర్మించిన గాయత్రీ అమ్మవారి ఆలయం, డోన్, కొడునూరు, ఎమ్మిగనూర్, ఆదోని, గుంతకల్ అటునుంచి ప్రక్క రాష్ట్రములో ఉన్న బళ్లారి, హోస్‌పేట ప్రాంతాలను చుట్టి వస్తూ అనంతపురము, ధర్మవరము గుత్తి, తాడిపత్రి, బేతంచెర్ల, బనగానపల్లి, తాడిపత్రి సిమెంట్ ఫ్యాక్టరీ, అక్కడ నుంచి కడప జిల్లా రాయలసీమ పవర్ ప్లాంట్, ప్రొద్దుటూరు, యర్రకుంట్ల, కమలాపురము, కడప, వేంపల్లి, పులివెందుల, కడప, మైదుకూరు, బ్రహ్మంగారిమఠము, అక్కడ నుంచి నంద్యాల మార్గం గుండా ప్రకాశం జిల్లాలోకి ప్రవేశించనున్నది. కర్నూల్ జిల్లాలో శ్రీగురు రాజారావు, శ్రీ కె. బాలకృష్ణ, శ్రీ సాయినాథ్, శ్రీమతి వసుంధర, శ్రీ రామలింగం, శ్రీ జి. మోహన్‌కుమార్, అనంతపురం జిల్లాలో శ్రీ మంగీలాల్ రాజ్‌పురోహిత్, శ్రీ వి.వెంకటేష్, శ్రీ నరేష్, శ్రీ ప్రసాద్, శ్రీ కె. వెంకటేష్, శ్రీమతి సుజాతశర్మ, శ్రీజి.పి. రెడ్డి, శ్రీ సి.హెచ్.సత్యనారాయణ, శ్రీ బాలరాజు అలాగే కడప జిల్లాలో శ్రీ సత్యనారాయణరెడ్డి, శ్రీ ప్రసాద్‌రాజు, శ్రీ బ్రహ్మానందరెడ్డి ముఖ్యులుగా ఉన్న వారి బృందం అందరూ కలసి విశేష సేవల అశ్వమేధ శక్తి కలశ రథయాత్ర తన లక్ష్యపూర్తితో సహకరించారు. బెంగుళూరు, శ్రీ వెంకటేశ్వర్లు అందరిని సమన్వయపరచటమేకాక సతీసమేతులై రాయల సీమలో అశ్వమేధ సందేశాన్ని అందరి దగ్గరకు చేర్చటంలో సఫలీకృతం అయ్యారు.

రెండవ రథము ఆంధ్రప్రదేశ్ శక్తి-కలశరథము అక్టోబర్ మాసాంతం వరకు శ్రీకాకుళం, విజయనగరం, ఒడిషా ప్రాంతాలను చుట్టుముట్టి నవంబర్ ఒక్కటవ తేదిన విజయనగరం పట్టణం చేరుకొని పట్టణం పరిసర ప్రాంతాల్లో శ్రీ కాశీ విశ్వేశ్వరరావు, శ్రీ చలమయ్య, శ్రీ కుసుమంచి సుబ్బారావు గార్ల నేతృత్వంలో అశ్వమేధ ఆహ్వానాన్ని అందించి

**సాఫల్యానికి దగ్గర దారులు ఏమి ఉండవు**

విశాఖ పట్టణం జిల్లాలోకి తగరపువలస శ్రీ రామకృష్ణ సహకారంతో తన లక్ష్యాన్ని పూర్తిచేసి ఉక్కునగరం చేరుకుంది. అక్కడ శ్రీ అవతారం రాజు, శ్రీమతి సావిత్రి, శ్రీ గణేష్, శ్రీ ఐ.జె.సింగ్, శ్రీ మనీష్ సాహుగార్ల మార్గదర్శనం, విశాఖ పట్టణం, నవసేనాబాగ్, ఉక్కునగరం, అక్కయ్యపాలెం, మహారాణిపేట మొదలైన స్థానిక ప్రాంతాలలో అశ్వమేధ ఆహ్వానంతోపాటు శక్తిని అనుగ్రహాన్ని అందిస్తూ యలమంచిలి శ్రీ నాగేశ్వరరావుగారి నేతృత్వంలో అనకాపల్లి, యలమంచిలి, అడ్డరోడ్డు, ఉద్దండపురము, నర్సీపట్నం మీదుగా తుని చేరుకుంది. అక్కడి నుంచి తన ఉభయ గోదావరి జిల్లాలను చుదుతూ, గోదావరి పరీవాహక ప్రాంతంలోని లంక గ్రామాల పుణ్యతీర్థాలు, చారిత్రాత్మక పట్టణం, రాజమహేంద్రవరం ఇప్పటి రాజమండ్రి నుంచి అనపర్తి, రాజుపాలెం, అంబాజీ పేట, అమలాపురం, పాలకొల్లు, భీమవరం తణుకు, తాడేపల్లిగూడెం, నల్లజెర్ల, కావులూరు, పోలవరం మీదుగా కృష్ణా జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఉభయగోదావరి జిల్లాలో నాగమణిగారి నేతృత్వంలో కార్యకర్తల సహకారం వలన అశ్వమేధ శక్తి కలశం తన శక్తిని అందిస్తూ ముందుకు వెళ్తుంది. త్యాగరాజులు వారు చెప్పిన విధముగా ఎందరో మహానుభావులు అందరికి వందనాలు అన్న చందాన కొత్తపాత అందరి కార్యకర్తలు సహకారం ప్రశంస నీయం. పేర్లు చెప్పకపోయిన వారి కృషి ఏ మాత్రం తగ్గదు. కార్యకర్తల ఉత్సాహం, భక్తుల శ్రద్ధ రెండు కలసి ఉభయ తెలుగు రాష్ట్రాలలో అశ్వమేధ రథయాత్రను సఫలీకృతం చేస్తున్నాయి.

## నెల్లూరు జిల్లాలో అశ్వమేధ శక్తి కలశరథ తీర్థయాత్ర వివరాలు

తేది 28.09.2017 మ॥ 3 గం॥లకు కలశరథము నెల్లూరు జిల్లా కావలి పట్టణమునకు విచ్చేసినది. ఆ కలశ రథాన్ని నెల్లూరు గాయత్రీ పరివార్ కార్యకర్త శ్రీమతి టి.భువన (టి.లక్ష్మీభవాని) ఒంగోలు నుండి కావలికి తీసుకొని రావడమైనది. కలశరథములో హరిద్వార్ ప్రతి నిధులు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్ గాయత్రీ పరివార్ కార్యకర్తలు నాగేశ్వరరావుగారు, అచయ్యగారు మొత్తం ఐదు మంది రావడం జరిగింది.

శ్రీమతి భువనగారి ఆధ్వర్యములో తేది 28.09.2017 నుండి 05.01.2017 కలశయాత్ర జరగవలసిన ప్రాంతాలను, తేదీలవారీగా ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేసుకోవడ మైనది. ముందుగా కావలిలో 28.09.2017 సా॥ 4 గం॥ల నుండి కలువాలమ్మ దేవస్థానము నుండి 125 మందితో కలశయాత్ర ప్రారంభమైనది. స్త్రీలు వారి ఇంటి వద్ద నుండి కలశాలు తెచ్చుకున్నారు. ఆ కలశయాత్ర బృందావన కాలనీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం వరకు జరిగినది. బృందావన కాలనీలో ప్రవచనం ఇచ్చి అందరిని గాయత్రీ జపము చేయమని, అశ్వమేధ యాగానికి అంశదానం తీసిపెట్టమని తెలియచేయడ మైనది. 220 మంది దీక్ష తీసుకోవడమైది.

## మంగళగిరి పుణ్యక్షేత్రం గురించి

భారతీయ సంస్కృతి ఎన్నో విశేషణలతో కూడి ఉన్నది. ఆదిశంకరుల వారు అతి పిన్నవయస్సులోనే భారతదేశ భ్రమణం కావించి మన సంస్కృతిలో, ధర్మ ఆచారాలలో వచ్చిన వికృతాలను దూరంచేసి షణమతాలను స్థాపించారు. అవి శైవము, వైష్ణవము, శాక్తము, గాణాపత్యము, సౌరము, కపాలము. వాటిలో ముఖ్యమైనవి శైవము, వైష్ణవము, శాక్తము. ఈ మూడు ధారలను సమన్వయపరచు, మూడింటికి దివ్య కేంద్రము మన అశ్వమేధం జరుగనున్న దివ్య క్షేత్రము. ఈ అశ్వమేధ యజ్ఞస్థలం మంగళగిరి పట్టణమునందు కలదు. దీని ప్రాచీన నామము మంగళాద్రి. ఇది వైష్ణవ క్షేత్రము. ఇది 8 వైష్ణవ దర్శనీయ క్షేత్రాలతో దర్శించుకోవల్సిన దివ్య క్షేత్రం. ప్రహ్లాదుని తండ్రియైన హిరణ్యకశ్యపుని సంహరించుటకు అవతారం తీసుకున్న నరసింహస్వామి ఇక్కడి మూలవిరాటు. ఇక్కడ నరసింహా

**సంఘర్షణ అనేది జీవితానికి వన్నె తెస్తుంది**

స్వామిని మూడురూపాలలో మనము దర్శించుకోవచ్చును. క్రింద లక్ష్మీ నరసింహస్వామి ఎగువ పానకాల స్వామి ఆ పైన గండాల నరసింహస్వామి.

అలాగే మంగళగిరి పశ్చిమాన 40 కి.మీ. దూరంలో కృష్ణానది ఒడ్డున ప్రాచీన అమరావతి నగరంలో అమర లింగేశ్వరుని శైవక్షేత్రంగా దర్శించుకోవచ్చు. ఇది శివపంచారామక్షేత్రాలలో ఒక్కటి. ఇది హిందువులకే కాదు బౌద్ధులకు దర్శనీయ స్థలం. ప్రాచీన మహాచైత్యస్థాపపు శిథిలాలు బౌద్ధమత వికాస ఆనవాళ్ళకు సాక్ష్యం. అమరలింగేశ్వరుడినే కాక ఇక్కడ 125 అడుగుల ధ్యానబుద్ధ విగ్రహాన్ని కూడా దర్శించుకోవచ్చు. బుద్ధా హెరిటేజ్ సెంటర్ పేరుతో బౌద్ధుని మ్యూజియం కూడా దర్శించుకోవచ్చు.

అంతేకాక మంగళగిరికి దక్షిణమున మంగళగిరి – గుంటూరు మార్గంలో పెదకాకాని గ్రామంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి. అందరికి తెలిసిన మహిమలు కలిగిన దైవం. రామాయణంలో ప్రస్తావించబడిన కాకభూషణుడు అనే కాకిరూపంలోని రాక్షసుడు మోక్షం పొందిన దివ్యక్షేత్రం ఈ పెద్దకాకాని. అక్కడి శివయ్య ఎన్నో మహత్తులు కలవాడని ఇక్కడి రాహుకేతువులకు చేసే పూజలు కూడా ప్రసిద్ధి కాంచినవి.

మంగళగిరి పట్టణమున, ప్రవహించు కృష్ణమ్మకు ఆవలి ఒడ్డున విశ్వ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బెజవాడ కనకదుర్గమ్మ. ఈవిడ గురించి కాళికపురాణం నందు, దుర్గాసప్తశతినందు కూడా ప్రస్తావన కలదు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ మందిరం అర్జునుడి ద్వారా నిర్మింపబడినది అని నానుడి. మహాభారత యుద్ధంలో విజయలక్ష్మి తమను వరించాలంటే మహేశ్వరుని దగ్గర నుంచి పశుపతాస్త్రం కావాలని తపస్సు చేసిన పర్వతమే ఈ ఇంద్రకీలాద్రి. అక్కడ నుంచి ఈ పట్టణమునకు విజయ వాడ అన్నపేరు వచ్చింది అంటారు. కనకదుర్గ అమ్మవారు, విజయవాడ పర్యాయాలుగా ఉంటారు. ఈ కొండమీద మల్లికార్జున స్వామితోపాటు అమ్మ వారు కొలువై ఉన్నారు. అమ్మ వారు స్వయంభూ అని చెబుతారు. ఒక పురాణ ప్రాశస్త్యమును అనుసరించి ఇంద్ర కీలక అనే ముని తపస్సు చేసి అమ్మవారిని తమ శిరస్సు మీద ప్రకటితమే స్థిరనివాసం ఏర్పరచుకొని మహిషాసురుడు వంటి రాక్షసులను సంహరించవలసినదిగా కోరాడని అందుకే ఇక్కడ అమ్మవారు ఎనిమిది చేతులలో వివిధ ఆయుధాలను ధరించి తన పాదముల క్రింద మహిషాసురుని మర్దించు రూపంలో దర్శనం ఇస్తూ ఉంటుంది. తప్పక దర్శించుకో వలసిన అమ్మవారు.

మంగళగిరి పట్టణమునకు కొలది దూరంలో విజయవాడ వెళ్ళు మార్గంలో ప్రకాశం బ్యారేజ్‌కు దగ్గరగా ఉండవల్లి గుహాలయాలు ఉన్నాయి. ఇక్కడ అనంత పద్మనాభస్వామిని శయన భంగిమలో దర్శించుకొనవచ్చును. ఈ గుహలు ఇప్పుడు భారతీయ పురావస్తు శాఖ నిర్వహణలో ఉన్నాము. రాతిని మలచి కట్టడాలు నిర్మించే కళకు ఉదాహరణగా నిలుస్తాయి. వీటిని ఉదయం 10 గం॥లకు నుంచి సాయంత్రం 5.30 గం॥ల వరకు దర్శించుకోగలము.

మంగళగిరి పట్టణమునకు 47 కి.మీ. దూరంలో దక్షిణమున పొన్నూరు పట్టణమునందు ఆంజనేయస్వామి ఆలయం కలదు. అది దర్శనీయ స్థలం. అక్కడ ఆంజనేయ, గరుడు ఇద్దరు విష్ణు భగవానుని భక్తుల ముఖ్య దేవుళ్ళు. అక్కడ ఆంజనేయస్వామి ఎంతో మహత్తు కలిగిన స్వామి అని 24 అడుగుల భారీ స్వరూపం స్వామిది. అలాగే గరుత్మంతుని విగ్రహం 30 అడుగుల ఎత్తు ఉన్నది. దానికి మంగళగిరి, గుంటూరు, తెనాలి పట్టణము నుంచి నేరుగా బస్సు సౌకర్యం కలదు.

ఇంకో ఎన్నో దివ్యక్షేత్రాలు కలిగిన మహిమాన్విత స్థానంలో మన అశ్వమేధ మహాయజ్ఞం నిర్వహించబడనున్నది. ఇక్కడి ఉత్పన్నమయ్యేశక్తి ప్రవాహాలు ముందునుంచే ఇక్కడ సహజ సిద్ధంగా ఉన్న ఆధ్యాత్మిక తరంగాలతో కలసి శక్తివంతమైన మన లక్ష్యసాధనలో సహకరిస్తాయి.

**కలలు కనండి, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించండి**